


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 176

శుక్రవారం 16-9-2022


SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆటకు ఫెడరర్ వీడ్కోలు

టెన్నిస్ దిగ్గజం, ఆల్‌టైమ్ గ్రేట్ రోజర్ ఫెడరర్ తన కెరీర్‌ను ముగించాడు. ఆట నుంచి రిటైర్ అవుతున్నట్లు స్విట్జర్లాండ్ స్టార్ గురువారం ప్రకటించాడు. త్వరలో జరిగే లేవర్ కప్‌లో చివరిసారిగా బరిలోకి దిగుతానని వెల్లడించాడు. 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన ఫెడరర్ ఓవరాల్‌గా 103 టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

13లో



ఆ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా

కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం అధికారంలోకివస్తే వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇస్తామని బిహార్ సీఎం నితీశ్ అన్నారు.

వివరాలు 6లో



గోవా సీఎల్పీ విలీనానికి ఆమోదం

గోవా కాంగ్రెస్ శాసనసభా పక్షాన్ని బీజేపీలోకి విలీనం చేయాలన్న ప్రతిపాదనను ఆమోదించినట్లు ఆ రాష్ట్ర స్పీకర్ రమేశ్ తెలిపారు.


వివరాలు 6లో



నేడే షాంఘై శిఖరాగ్ర సదస్సు

ఉజ్బెకిస్తాన్‌లో ప్రారంభం కానున్న షాంఘై సదస్సులో ప్రధాని మోదీ, రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్ పాల్గొననున్నారు.

వివరాలు 6లో



పాక్‌ను బిచ్చగాడిగా చూస్తున్నాయి

మిత్రదేశాలు కూడా పాకిస్తాన్‌ను బిచ్చమెత్తుకునే దేశంగానే చూస్తున్నాయని ఆ దేశ ప్రధాని షరీఫ్ విచారం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

విజయవాడలో సీపీఐ జాతీయ మహాసభలు



సీపీఐ 24వ జాతీయ మహాసభలు అక్టోబర్ 14 నుంచి 18 వరకు విజయవాడలో నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఈ మహాసభలకు పలు రాష్ట్రాల సీఎంలు, సీపీఐ నాయకులు, 20 దేశాల నుంచి కమ్యూనిస్టు, సోషలిస్ట్ పార్టీల నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

వివరాలు 14లో ▸

బ్రహ్మోత్సవాలకు తిరునగరి ముస్తాబు



ఈనెల 27 నుంచి జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల కోసం తిరుమలను టీటీడీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశముండటంతో టీటీడీ అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది.

వివరాలు 5లో ▸

ఉక్రెయిన్ విద్యార్థులకు సీట్లు ఇవ్వలేమన్న కేంద్రం

6లో

వికేంద్రీకరణే మా విధానం

మూడు ప్రాంతాల అభివృద్ధి.. ప్రతి ఇంటికీ మేలు చేయడమే మా లక్ష్యం: శాసన సభలో సీఎం వైఎస్ జగన్

నాడు, నేడు ఒకే మాట

- మూర్ఖ దుష్టచతుష్టయాన్ని మెప్పించలేం
- ఉత్తరాంధ్రకు వెళ్లి ఆ ప్రాంతం బాగుపడకూడదని దేవుడిని ప్రార్థిస్తారా?
- ఈసారి ఎన్నికల్లో టీడీపీకి ఒక్క సీటూ రాదు.. ఆ విషయం తెలిసే చంద్రబాబు చిచ్చు పెడుతున్నారు
- వికేంద్రీకరణ వల్ల మేలు కళ్లెదుటే కన్పిస్తోంది.. నేను ఎంతమాత్రం ఈ ప్రాంతానికి వ్యతిరేకం కాదు..
- అందుకే మూడు రాజధానుల్లో ఒకటి ఇక్కడే ఉండాలని కోరుకుంటున్నా



శాసన సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'నేను గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ఇప్పుడు అధికారంలో ఉంటున్న మూడేళ్ల నుంచీ ప్రతిసారి వికేంద్రీకరణ గురించే మాట్లాడాను. ఇంకా చెప్పాలంటే శ్రీబాగ్ ఒప్పందం మొదలు శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణ కమిటీ, బోస్టన్ గ్రూప్, ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ వరకు కూడా అందరి అభిప్రాయం ఇదే. వికేంద్రీకరణ వల్లే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలి. అదే మా విధానం.. నినాదం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. వికేంద్రీకరణ అంశంపై గురువారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన టీడీపీ వైఖరిపై, సంక్షేమాభివృద్ధికి వారు కలిగిస్తున్న విఘాతంపై మండిపడ్డారు. 'తివిరి ఇసుమున తైలమ్ము తీయవచ్చు. దవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు. తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు. చేరి మూర్ఖుల మనసు రంజింప రాదు' (ఇసుక నుంచి నూనె తీయొచ్చు. ఎండమావిలో నీరు తాగొచ్చు. తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు కానీ.. మూర్ఖులైన చంద్రబాబుతో కూడిన ఈ దుష్ట చతుష్టయాన్ని ఒప్పించడం ఎవరి వల్లా కాదు) అన్న భర్తృహరి సుభాషితాన్ని ఉదహరిస్తూ దుష్టచతుష్టయం తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అక్కడికెళ్లి దేవుడిని ఏమని మొక్కుతారు?

- వికేంద్రీకరణ వల్ల ఇంత మంచి జరుగుతుంటే దీన్ని కూడా వక్రీకరించి, అబద్ధాలు జోడించి, ప్రాంతాల మధ్య భావోద్వేగాలు పెంచుతున్నారు. అసలు ఇక్కడి నుంచి అక్కడికి

మిగతా 2వ పేజీలో ▶

> గత 75 ఏళ్లలో కేవలం 2 జిల్లాలు మాత్రమే ఏర్పాటు చేస్తే వికేంద్రీకరణకు అర్థం చెబుతూ 13 జిల్లాలను 26 జిల్లాలు చేశాం. 51 రెవెన్యూ డివిజన్లను 75కు పెంచాం. 91 పోలీస్ డివిజన్లు ఉంటే వాటిని 103కు పెంచి వికేంద్రీకరణకు అర్థం చెప్పాం. చివరకు కుప్పంలో రెవెన్యూ డివిజన్ పెట్టమని చంద్రబాబు నాకు లేఖ రాశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు ఏ గాడిదలు కాశారో తెలియదు. కుప్పంలో ప్రజలు ఒత్తిడి చేస్తే నన్ను అడగక తప్పని పరిస్థితి వచ్చింది. 14 ఏళ్లు సీఎం.. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే ఆయన తీరు ఇది. నిజమైన వికేంద్రీకరణ అంటే ఎలా ఉంటుందో మనం చూపించాం.

> గ్రామ సచివాలయంలో ఏ సర్టిఫికెట్ జారీకైనా కచ్చితంగా గడువు పెట్టి ఇచ్చే మెకానిజమ్ పెట్టాం. ఇది ఆ పెద్దమనిషికి కనీసం ఏ రోజైనా తట్టిందా? రైతు భరోసా కేంద్రాలనే కాన్సెప్ట్ గురించి ఏ రోజైనా ఆలోచించారా? ఇవాళ రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలు విత్తనం మొదలు పంటల అమ్మకం వరకు రైతుల చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ఇదీ వికేంద్రీకరణ అంటే.

- అసెంబ్లీలో సీఎం జగన్

అది పెత్తందారుల ఉద్యమం

- ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, పేద ఓసీల కోసం కానేకాదు
- శాసనసభలో నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- కట్టని, కట్టలేని రాజధాని కోసం కృత్రిమ, రియల్ ఎస్టేట్ ఉద్యమం
- వాళ్ల భూములు, వాళ్ల ఇండస్ట్రీలు, వాళ్ల సినిమాలు అంతా వాళ్లే ఉండాలట!
- బాబుతో కూడిన దుష్ట చతుష్టయానికే మేలు జరగాలట
- ఈ ప్రాంతానికంతా టెంపరరీ అని పేరు పెట్టింది బాబు కాదా?

2లో

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని కాదు

గణాంకాలతో సహా వివరించిన సీఎం

- దుష్టచతుష్టయం చెబుతున్నట్లు అమ్మదగినది 20 వేల ఎకరాలు లేదు.. అందుబాటులో ఉన్నది 5,817 ఎకరాలే
- ఆ భూమి ఎకరా రూ.20 కోట్లతో ఎవరైనా కొంటారా?
- అలా కొంటేనే రూ.లక్ష కోట్లు వస్తుంది.. ఈ విషయంలో దుష్టచతుష్టయం మోసం చేస్తోంది

2లో

చంద్రబాబు విజయవాడకు ఏం చేశారు?

- అసెంబ్లీ వేదికగా నిలదీసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- మన ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రత్యేక శ్రద్ధ
- శరవేగంగా పశ్చిమ బైపాస్
- చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు రూ.1,321 కోట్లతో రోడ్డు పనులు
- రూ.1,600 కోట్లతో గొల్లపూడి-చినకాకాని రహదారి
- కృష్ణా తీరంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- బాబు కనీసం కరకట్ట రోడ్డును వెడల్పు చేయలేదు
- మన ప్రభుత్వం వచ్చాక రూ.150 కోట్లతో పనులు
- రూ.10 వేల కోట్లు వెచ్చిస్తే విశాఖ అద్భుత నగరం అవుతుంది

2లో

దళిత ఎమ్మెల్యేలను కించపరుస్తున్నారు

టీడీపీ ఎమ్మెల్యేలపై మంత్రి మేరుగు ధ్వజం



- సభను అగౌరవ పరిచేలా ప్రవర్తిస్తున్నారు
- టీడీపీ ఎమ్మెల్యే స్వామి గురించి ఎవరూ తప్పుగా మాట్లాడలేదు
- నన్ను ఉద్దేశించి దళితుడివా అని అనడమేమిటి?

3లో

పట్టుబడ్డ పయ్యావుల

- అసెంబ్లీ సాక్షిగా ఇన్‌సైడర్ ట్రేడింగ్ వ్యవహారాలు నిర్ధారణ
- రాజధాని ప్రకటన కంటే ముందే భూముల కొనుగోలు
- 2014 డిసెంబర్ 30 కంటే ముందే కుమారుడు, కుమార్తె పేరుతో కొనుగోలు
- హెరిటేజ్ ఫుడ్స్ పేరిట కూడా భారీగా భూముల కొనుగోళ్లు
- ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి బుగ్గన

10లో

సభలో టీడీపీ సభ్యుల రచ్చ

స్పీకర్ పోడియం వద్ద ఘర్షణ వాతావరణం

- పాలన వికేంద్రీకరణపై చర్చకు పదే పదే అడ్డు
- అమరావతిలో భూములు కొన్న టీడీపీ నాయకుల జాబితా చదివిన బుగ్గన
- జాబితాలో టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల పేరు
- వాస్తవాలు ప్రజల్లోకి వెళ్తుండటంతో పోడియాన్ని చుట్టుముట్టిన టీడీపీ సభ్యులు
- మార్షల్స్‌ను తోసేసిన టీడీపీ సభ్యులు
- టీడీపీ సభ్యులను ఒక రోజు సస్పెండ్ చేస్తూ స్పీకర్ ప్రకటన

10లో



శాసనసభలో స్పీకర్ పోడియంపైకి వెళ్లి రచ్చ చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలను వారిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

కర్నూలులో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు



హైకోర్టును కర్నూలుకు తరలించాలి

విధులు బహిష్కరించి ఆందోళనకు దిగిన న్యాయవాదులు

హైకోర్టు తరలింపును అడ్డుకునే పార్టీలకు బుద్ధి చెబుతామని హెచ్చరిక

కర్నూలు(సెంట్రల్/లీగల్): కర్నూలుకు వెంటనే హైకోర్టును తరలించాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం కర్నూలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి.. కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఆర్ కృష్ణ, జేఏసీ కన్వీనర్ వై.జయరాజ్ మాట్లాడుతూ.. గతంలో కర్నూలుకు జరిగిన అన్యాయాన్ని కొంత వరకైనా తగ్గించాలంటే హైకోర్టును ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. సీఎం వైఎస్ జగన్ హైకోర్టు ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారని, టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతి పేరుతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. హైకోర్టు తరలింపును అడ్డుకునే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తమ సత్తా ఏంటో తెలియజేస్తామన్నారు. హైకోర్టు తరలింపు కోసం వెంటనే తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు విధులను బహిష్కరించి.. తమ ఆందోళన తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా, సీనియర్ న్యాయవాదులు ఓంకార్, వి.నాగలక్ష్మీ, పి.సువర్ణరెడ్డి, ఎం.సుబ్బయ్య, బి.చంద్రుడు, కర్నాటి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలాల్లో ఆక్రమణలు తొలగించండి



- పార్కులు, ప్రజోపయోగ స్థలాలపై హైకోర్టు ఆదేశం
- ముందుగా ఆక్రమణదారులకు నోటీసులివ్వండి
- అనంతరం ఖాళీకి ఉత్తర్వులు జారీ చేయండి
- నాలాలు, కాలువల ఆక్రమణలకూ ఈ ఉత్తర్వులే..

సాక్షి, అమరావతి: పార్కులు, పబ్లిక్ రోడ్లు, ఇతర ప్రజోపయోగ స్థలాల ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆక్రమణలు తొలగించేటప్పుడు ఆక్రమణదారులకు షోకాజ్ నోటీసు జారీచేసి వారి వాదన వినాలని అధికారులకు హైకోర్టు స్పష్టంచేసింది. ఆ తర్వాతే వారిని ఖాళీచేయించే విషయంలో

మిగతా 14వ పేజీలో ▶


ఇదండీ సంగతి




వైద్యుల ప్రొబేషన్ రెండేళ్లు

సీఏఎస్‌ల వేతనం రూ.85వేలకు పెంపు

- సొంత జిల్లాల్లో పోస్టింగ్‌కు అనుమతి
- వైద్య శాఖ ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: డీఎంఈ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, వైద్య విధాన పరిషత్‌లోని సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్)ల ప్రొబేషన్ కాలాన్ని రెండేళ్లకు ప్రభుత్వం తగ్గించింది. కొద్దికాలంగా వైద్యులు, వైద్య సంఘాల వినతులను, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, సీఏఎస్‌లకు ప్రొబేషన్ కాలాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించింది. మరోవైపు ప్రజారోగ్య విభాగంలోని సీఏఎస్‌లకు కన్సాలిడేటెడ్ వేతనాన్ని రూ.53,500 నుంచి రూ.85వేలకు పెంచింది. జీవో నంబర్లు 60, 61 ప్రకారం 2020లో, జీవో నంబర్ 615 ప్రకారం 2021లో ఎంపికైన వైద్యులందరికీ పెంచిన కన్సాలిడేటెడ్ వేతనాన్ని వర్తింపజేస్తుంది. వైద్య విధాన పరిషత్ పరిధిలో సీఏఎస్ (ఫస్ట్ లెవల్ గెజిటెడ్) క్యాడర్ వారికి సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లకు అనుమతి తెలిపింది. సొంత మండలం, డివిజన్‌లో కాకుండా జిల్లాలో ఎక్కడైనా వీరికి పోస్టింగ్ ఇస్తారు. అడిషనల్ డీఎంహెచ్‌వో, డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్ వంటి పరిపాలన పోస్టింగ్‌లలో మాత్రం సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లను అనుమతించరు. ఈ మేరకు వైద్యశాఖ ఉత్తర్వులను జారీ చేసింది.



కృష్ణాలో పెరుగుతున్న వరద

- పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో వరద ప్రవాహం మరింత పెరిగింది. జూరాల, సుంకేశుల బ్యారేజీల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,54,343 క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతుండగా.. ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.74 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

- వివరాలు 14లో

యూపీలో దారుణం

లఖీంపూర్‌ఖేరిలో దళిత అక్కాచెల్లెళ్లపై అత్యాచారం, హత్య

ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు

ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్‌ఖేరి జిల్లాలో మరో ఘోరం జరిగింది. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించారన్న ఆగ్రహంతో దళిత అక్కాచెల్లెళ్లపై కొందరు దుర్మార్గులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఆ బాలికలు ధరించిన చున్నీలనే గొంతులకు బిగించి చంపేశారు. పొలాలకు సమీపంలోని చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. నిందితులు ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్‌లోని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

6లో



రేపిస్టులను జైళ్ల నుంచి విడుదల చేసి.. సత్కారాలు చేస్తున్న ప్రభుత్వం నుంచి మహిళల భద్రత ఎలా ఆశించగలమంటూ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.



"ఇవాళ 2.70 లక్షల మంది గ్రామ వలంటీర్లు రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో కూడా సేవలందిస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీన సూర్యోదయానికి కంటే ముందే ఇంటి తలుపు తట్టి.. సామాజిక పెన్షన్లు ఇస్తున్నారు. రేషన్ సరుకులను ఇంటి వద్దే డోర్ డెలివరీ చేస్తున్నాం. ఇదీ వికేంద్రీకరణ అంటే.

దశాబ్దాలుగా నిర్మించుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే కూడా, ఉమ్మడి రాజధాని హైదరాబాద్ కంటే కూడా ఈ కట్టని, కట్టలేని అమరావతి వీరి దృష్టిలో ఎంతో గొప్పది. వీరు చేస్తున్న ఉద్యమం బీసీల అభివృద్ధి కోసమా! కాదే. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి కోసమూ కాదు. పేద ఓసీల అభివృద్ధి కోసం అంతకంటే కాదు. మూడు ప్రాంతాల అభివృద్ధి కోసమా.. అంటే అది కూడా కాదు. కేవలం ఈ పెత్తందార్ల సొంత అభివృద్ధి కోసం మాత్రమే ఈ ఉద్యమం చేస్తున్నారు."
- సీఎం వైఎస్ జగన్



అది పెత్తందారుల ఉద్యమం

ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, పేద ఓసీల కోసం కానేకాదు

- శాసనసభలో నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- నేడు ప్రాంతాల మధ్య దుష్టచతుష్టయం చిచ్చు పెడుతోంది
- అందరి బాగు కోసం మూడు ప్రాంతాల అభివృద్ధే మా లక్ష్యం
- అప్పుడు, ఇప్పుడూ అదే బడ్జెట్.. మరి ఇన్ని పథకాలు అప్పుడెందుకు లేవు?
- నాడు దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ పథకం
- నేడు నేరుగా ప్రజల ఖాతాల్లో రూ.1.65 లక్షల కోట్లతో డీబీటీ పథకం

సాక్షి, అమరావతి: 'రాజధానులతో పాటు గ్రామ స్థాయి వరకు వికేంద్రీకరణే మా విధానం.. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయడం.. ప్రతి ఇంటికి మేలు చేయడమే మా లక్ష్యం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్పష్టంగా ప్రకటించారు. 'వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకు మంచి జరుగుతుంటే చంద్రబాబు, ఆయనతో కూడిన దుష్టచతుష్టయం దాన్ని వక్రీకరిస్తూ ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారు. నారా హమారా అని యాత్రలు మొదలు పెట్టించి పెట్రోల్ పోసి మరీ ప్రాంతాల మధ్య భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంతోసహా ఎక్కడా గెలవలేమని తెలిసి ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి కోసం కుట్రలు పన్నుతున్నారు' అని ధ్వజమెత్తారు. వికేంద్రీకరణ అంశంపై గురువారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మూడు రాజధానుల అంశంపై ప్రభుత్వ విధానాన్ని సోదాహరణంగా వివరించారు. '58 ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తుంటే, 58 ఏళ్ల రాజధాని హైదరాబాద్‌ను వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడితే ఒక్క రోజూ ఉద్యమం చేయని చంద్రబాబు.. ప్రస్తుతం అమరావతి పేరిట కృత్రిమ ఉద్యమాన్ని, రియల్ ఎస్టేట్ ఉద్యమాన్ని నడుపుతున్నారు. చంద్రబాబు కట్టని, కట్టలేని.. ఎవరూ కట్టలేని రాజధాని కోసం ఎందుకు ఉద్యమం పేరిట డ్రామాలు ఆడుతున్నారు? ఈ ఉద్యమం ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, పేద ఓసీల కోసం కాదు. దుష్టచతుష్టయంతో కూడిన పెత్తందార్ల ప్రయోజనాల కోసమే' అని విరుచుకుపడ్డారు. 'తమ బినామీ భూములు ఉన్న ప్రాంతమే రాజధానిగా ఉండాలి. తమ పత్రికే ఉండాలి. తమ చిట్‌ఫండ్ కంపెనీలే ఉండాలి. తమ



పాల డెయిరీలే ఉండాలి. తమ సినిమాలు, తమ ఇండస్ట్రీలే ఉండాలి. మార్కెట్‌లో ఎవరూ ఉండకూడదు' అనే పెత్తందారి పోకడలతో దుష్టచతుష్టయం.. అంటే చంద్రబాబు, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ 5 నాయుడు.. వీరికి తోడు దత్తపుత్రుడు వ్యవహరిస్తున్నారు' అని ఆయన దుయ్యబట్టారు.

ఆ ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.5,674 కోట్లే

అమరావతిలో మౌలిక వసతుల కల్పనకే రూ.1.10 లక్షల కోట్లు కావాలని చెప్పిన చంద్రబాబు.. ఐదేళ్లలో కేవలం రూ.5,674 కోట్లే ఖర్చు చేశారని సీఎం తెలిపారు. మరి పూర్తి స్థాయిలో అమరావతి నిర్మాణం కోసం రూ.5 లక్షల కోట్లు వెచ్చించేందుకు వందేళ్ల సమయం పడుతుందన్నారు. అప్పటికి ద్రవ్యోల్బణంతో వ్యయం రూ.30 లక్షల కోట్లకు చేరుతుందని.. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని అంటూ చంద్రబాబు అండ్ గ్యాంగ్ చేస్తున్న ప్రచారం అవాస్తవమని గణాంకాలతో సహా వివరించారు. తమకు రాష్ట్రం అంటే అంటే కేవలం 8 కి.మీ.పరిధిలోని భూభాగం కాదని, 1,62,967 చ.కి.మీ యావత్ రాష్ట్రమని స్పష్టం చేశారు. రాష్ట్రం అంటే కేవలం 50 వేల ఎకరాలు కాదని.. 3.96 కోట్ల ఎకరాలన్నారు. తమకు రైతులు అంటే కేవలం అమరావతికి భూములు ఇచ్చిన 35 వేల మంది మాత్రమే కాదని, వారితో పాటు రాష్ట్రంలోని మరో 50 లక్షల మంది రైతులు అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా

కట్టని కట్టలేని రాజధాని కోసం కృత్రిమ ఉద్యమం

- 1956 నుంచి 2014 వరకు 58 ఏళ్లు కలిసి ఉన్న రాష్ట్రం విడిపోయినప్పుడు చంద్రబాబు ఏనాడూ ఉద్యమం చేయలేదు. ఆ 58 ఏళ్లు రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను వదిలి వచ్చేయాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడూ ఒక్కరోజు కూడా ఎలాంటి ఉద్యమం చేయలేదు. రామోజీరావు, రాధాకృష్ణ చంద్రబాబు బృందం ఎలాంటి బాధా పడలేదు.
- రాష్ట్రాన్ని విడగొట్టడానికి వీల్లేదని, ఈ పెత్తందార్లు, మహానుభావులు ఒక్కరోజూ ఉద్యమం చేయలేదు. ఎలాంటియాత్రా చేయలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసేందుకు కోట్లు లంచమిస్తూ దొరికిపోయిన చంద్రబాబే ఈ ప్రాంతానికంతా టెంపరరీ అనే పేరు పెట్టారు.
- 58 నెలల కాలం రాజధానిగా పరిపాలించిన ప్రాంతం అమరావతి గురించి ఉద్యమాలట!

చంద్రబాబు ఎలాంటి అభివృద్ధి చేయని, చేయలేని ప్రాంతం గురించి ఉద్యమాలట! ఇవాళ రకరకాల డ్రామాలు జరుగుతున్నాయి. ఈ పెత్తందార్లు, మహానుభావులు వారు కట్టని రాజధాని గురించి, కట్టలేని గ్రాఫిక్స్ గురించి వెయ్యి రోజులుగా ఒక కృత్రిమ ఉద్యమాన్ని, రియల్ ఎస్టేట్ ఉద్యమాన్ని నడుపుతున్నారు. మిగతా ప్రాంతాల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తూ.. మరోవైపు ఇతర ప్రాంతాలను రెచ్చగొడుతూ ఒక డ్రామా నడుపుతున్నారు.

నాడు లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?

- 2019లో రాష్ట్ర బడ్జెట్‌ను చంద్రబాబు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉంటూ ప్రవేశపెట్టారు. అప్పటి బడ్జెట్.. ఈ సంవత్సరం మనం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దాదాపు ఒకటే. అప్పుడు రూ.2.27 లక్షల కోట్లు అయితే ఈ ఏడాది రూ.2.50 లక్షల కోట్లు. మరి చంద్రబాబు హయాంలో జగనన్న అమ్మఒడి ఎందుకు లేదు? వైఎస్సార్ ఆసరా ఎందుకు లేదు? చేయూత పథకం, రైతు భరోసా పథకాలు ఎందుకు లేవు?
- నవరత్నాల పథకాల ద్వారా ఏకంగా రూ.1.65 లక్షల కోట్లు బటన్ నొక్కి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎలాంటి అవినీతి, వివక్ష లేకుండా నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి ఇచ్చాం. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 31 లక్షల ఇళ్లపట్టాలు ఎందుకు లేవు? 21 లక్షల ఇళ్ల నిర్మాణం ఎందుకు జరగలేదు? ఈ రోజు ఎందుకు ఈ పథకాలన్నీ జరుగుతున్నాయి?
- చంద్రబాబు ప్రభుత్వంలో డబ్బులన్నీ ఎవరెవరి జేబులోకి పోయాయన్నది ఆలోచించాలి. ఎన్నికల సమయంలో పార్టీ మేనిఫెస్టో గురించి ప్రచారం చేస్తుంటే మా అప్పలనర్సయ్య మాట్లాడుతూ.. 'ఇవన్నీ అవుతాయా' అని ప్రశ్నించారు. కానీ ఈరోజు మనం ఇవన్నీ చేయగలుగుతున్నాం.
- చంద్రబాబు హయాంలో దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ పథకం ఉండేది. చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడు వీళ్ల పని దోచుకోవడం పంచుకోవడం. వారు ఏం దోచుకున్నా.. పంచుకున్నా అడిగేవాడు ఉండడు, రాసేవాడూ ఉండడు. మనలాంటి వాళ్లు ప్రశ్నిస్తే మైకులు నొక్కేస్తారు. దుష్ప్రచారాలు చేస్తారు.

ఏం చెప్పారంటే..

చంద్రబాబు, ఆయన మనుషులే ఉండాలా?

- చంద్రబాబు ఆయన బృందానివి పెత్తందారి ఆలోచనలు. వాళ్ల బినామీల భూములున్న ప్రాంతమే రాజధానిగా ఉండాలి. ఇంకెక్కడా ఉండకూడదు. పత్రిక అంటే కేవలం ఈనాడు, చంద్రజ్యోతి మాత్రమే. మరే పత్రికా ఉండకూడదు. పచ్చళ్లు అమ్మినా తమ వాళ్ల పచ్చళ్లే అమ్మాలి. చిట్‌ఫండ్స్ వ్యాపారం చేసినా తమ వాడి చిట్ ఫండ్స్ వ్యాపారమే జరగాలి. డిపాజిట్స్ సేకరణ చేసినా తమవాడే చేయాలి. అది కూడా ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి చేసుకోవచ్చు.
- డెయిరీలు, పాలు అంటే ప్రభుత్వ రంగంలో లాభాల్లో ఉన్న చిత్తూరు డెయిరీని కూడా మూసివేయాలి. తమ హెరిటేజ్ కోసం ఆ డెయిరీల పీక పిసికేయాలి. ఆ రంగం ఈ రంగం అనే తేడా లేదు. వారు వీరు అనే తేడా లేదు. ఎవ్వరూ కూడా మార్కెట్‌లో ఉండకూడదు. తాను తన మనుషులే ఉండాలి. అది ఇండస్ట్రీ అయినా, సినిమా అయినా ఏదైనా తాను తన మనుషులు మాత్రమే ఉండాలన్న పెత్తందారి మనస్తత్వం వారిది.
- కార్పొరేట్ చదువులు తీసుకున్నా కేవలం మా నారాయణ, మా చైతన్య మాత్రమే ఉండాలి. గవర్నమెంటు బడులలో మాత్రం ఇంగ్లిష్ మీడియం ఉండకూడదు. అన్ని వ్యవస్థలు కూడా తమ మనుషుల చేతుల్లోనే ఉండాలి. ప్రతిపక్ష పార్టీల్లో కూడా తమ మనుషులే ఉండాలి. రాజధానితో పాటు ఏది తీసుకున్నా, వీళ్ల ఆలోచనలు, డిజైన్స్ అన్నీ ఈ మాదిరిగానే ఉంటాయి. వీటికి అందమైన పేర్లు కూడా పెడతారు. అలాంటి కుట్రపూరితమైన ఒక డిజైన్ పేరు.. ఒకటే రాజధానిగా అమరావతి. నిజంగా ఇది సాధ్యమయ్యే పనేనా అన్నది అందరూ ఆలోచించాలి.

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని కాదు

- అసెంబ్లీలో గణాంకాలతో సహా వివరించిన సీఎం వైఎస్ జగన్
- చంద్రబాబు, దుష్టచతుష్టయం మోసం చేస్తున్నారు
- బాబు దృష్టిలో 35 వేల ఎకరాలిచ్చిన వారు మాత్రమే రైతులు
- నా దృష్టిలో రైతు భరోసా అందుకుంటున్న 50 లక్షల మందీ రైతులే

"చంద్రబాబు లెక్కల ప్రకారమే ఇక్కడ మౌలిక వసతులకే రూ.1.10 లక్షల కోట్లు పెట్టాలి. కానీ ఇప్పటి వరకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన రూ.1.05 లక్షల కోట్లు కేటాయించాలంటే కనీసం వంద సంవత్సరాలు పడుతుంది. కేవలం రోడ్లు, డ్రైనేజీకి, కరెంట్ కోసం పెట్టే రూ.లక్ష కోట్లు వందేళ్లలో ద్రవ్యోల్బణం వల్ల కనీసం రూ.20 లక్షల కోట్ల నుంచి రూ.30 లక్షల కోట్లు అవుతుంది. మనం దీన్ని ఏ రకంగా పూర్తి చేయగలుగుతాం? ప్రతి ఒక్కరూ ఆలోచించాలి."
- సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'చంద్రబాబుతో పాటు దుష్టచతుష్టయం సభ్యులందరూ వాళ్ల పేపర్లలో, టీవీల్లో కామన్‌గా చెబుతున్నట్లు అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ రాజధాని కానే కాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వికేంద్రీకరణ అంశంపై గురువారం ఆయన శాసనసభలో జరిగిన చర్చలో స్పష్టమైన సమాధానాలిచ్చారు. 'ఇక్కడ మొత్తం 5,817 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. గ్రీన్ ట్రిబ్యునల్, రివర్ కన్జర్వేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలు అంటే కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాలు దాదాపు 820 ఎకరాలు ఉన్నాయి. లంక భూములు, ఎన్జీటీ, నదీ గర్భంలో ఉన్నవి, కరకట్ట భూములు కూడా ఉన్నాయి. ఆ 820 ఎకరాల భూమి అమ్మాలనుకున్నా ఎన్జీటీ కోర్టు అంగీకరించదు. ఈ భూములు తీసేస్తే 4,997 ఎకరాల భూమి ఉంది. 2019 ఫిబ్రవరి 5న చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే 5,020 ఎకరాలు మాత్రమే కమర్షియల్ ఎక్స్‌ప్లాయిటేషన్‌కు ఉంది అని చెప్పారు. (జీవో కాపీ ప్రదర్శిస్తూ) కానీ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 దొంగల ముఠా సభ్యులందరూ కూడా 10 వేల ఎకరాలు, 20 వేల ఎకరాలు ఉన్నాయని చెబుతున్నారు. అందరూ కలిసి ప్రజలను మోసం చేస్తున్నారు' అని సీఎం మండిపడ్డారు. ఈ చర్చలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నిజంగా అంత ధర ఉందా?

- చంద్రబాబు లెక్క ప్రకారం 5,020 ఎకరాలు మాత్రమే ఉంది. ఆ భూమిని ఎకరాకు రూ.20 కోట్ల చొప్పున అమ్మితేనే రూ.లక్ష కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, కరెంటు ఇవ్వగలం. నిజంగా ఈ రోజు ఇంత ధర ఉందా ? ఇంత ధరకు చంద్రబాబు కొంటారా? పోనీ రామోజీరావు కొంటారా? రాధాకృష్ణ కొంటారా? పోనీ టీవీ-5 నాయుడు కొంటారా?
- ఇంత ధర లేనప్పుడు ఎకరా రూ.10 కోట్లకు కొంటారా? అని వీళ్లు మనల్ని తిరిగి అడుగుతున్నారు. ఈ మధ్య ఈనాడు రాసింది (ఆ పత్రిక క్లిప్పింగ్‌ను స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ). మీరే ఎకరా రూ.10 కోట్లకు ఎవరైనా కొంటారా అని నేను అడుగుతున్నారు. మరి ఈ ప్రాజెక్టు ఎలా చేయగలుగుతాం? ఈ ప్రాజెక్టు అడుగులు ముందుకు పడకపోతే ఈ ప్రాంతంలో ఉన్న రైతులేం కావాలి?

బాబుపై 420 కేసు పెట్టాలి

- చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కేవలం రూ.5,674కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మరో రూ.2,297 కోట్లు బకాయిలు పెట్టి మనల్ని కట్టమని వదిలేశారు. అంతగా భ్రమలు కల్పించి, డిజైన్లు, గ్రాఫిక్స్ చూపించి మోసం చేసినందుకు నిజానికి 420 కేసు పెట్టాలి.
- ఆయన బినామీలందరికీ కూడా ఇక్కడ భూములుండి.. ఇక్కడ అభివృద్ధి చెందితే ఆ భూములకి రేట్లు పెరుగుతుందని తెలిసి కూడా ఎందుకు రూ.2,297 కోట్లు బకాయిలు పెట్టారు?
- వాస్తవం ఏమిటంటే ఏ ప్రభుత్వం కూడా ఇంతకన్నా ఎక్కువ పెట్టలేని పరిస్థితి. ఏడాదికి రూ.2 వేల కోట్లు కూడా పెట్టలేని పరిస్థితిలో మన రాష్ట్రం ఉంది. రాష్ట్రంలో 80 శాతం పైచిలుకు ప్రజలు తెల్లకేషన్ కార్డు మీదే బతుకుతున్న పరిస్థితి.

రూ.5 లక్షల కోట్లు కావాలని చంద్రబాబే చెప్పారు

అమరావతి ఇటు విజయవాడకు దగ్గరగా లేదు, అటు గుంటూరుకు దగ్గరగాలేదు. దేనికీ దగ్గరగా లేని ఈ ప్రాంతంలో కేవలం రోడ్లు, నీరు, కరెంటు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక వసతులు కోసమే ఎకరాకు రూ.2 కోట్లు చొప్పున ఖర్చు చేయాలని ఆనాడు చంద్రబాబే లెక్కకట్టారు. అంటే ఈ 53 వేల ఎకరాల అమరావతికి అక్షరాలా రూ.1.10 లక్షల కోట్లు అవుతుందని ఆయనే లెక్క తేల్చారు. కేవలం 53 వేల ఎకరాలు అంటే 8 కిలోమీటర్ల పరిధిలో మౌలిక వసతుల కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టాలని వాళ్లే ఇచ్చిన నివేదిక ఇది (కాపీని స్క్రీన్‌పై చూపించారు). ఇక రాజధాని భవనాలు మిగిలిన వాటిని కూడా కలుపుకుంటే కనీసం రూ.4 లక్షల కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు చాలా సార్లు చెప్పారు.

రాష్ట్రం అంటే 8 కి.మీ పరిధి కాదు

- రాష్ట్రం అంటే 8 కిలోమీటర్ల పరిధి మాత్రమే కాదు. రాష్ట్రం అంటే 1,62,967 చదరపు కిలోమీటర్ల భూభాగం. మన రాష్ట్రం అంటే 3.96 కోట్ల ఎకరాల భూభాగం. కేవలం కొందరి లబ్ధి కోసం ఉన్న 50 వేల ఎకరాల భూమి మాత్రమే కాదు. చంద్రబాబు దృష్టిలో రైతులు అంటే కేవలం 35 వేల ఎకరాలు ఇచ్చిన రైతులు మాత్రమే. మన దృష్టిలో రైతులంటే ఈ 35 వేల ఎకరాలిచ్చిన రైతులతోపాటు రైతుభరోసాను అందుకుంటున్న మరో 50 లక్షల మందీ రైతులే.

బాబు విజయవాడకు ఏం చేశారు?

- అసెంబ్లీ వేదికగా నిలదీసిన సీఎం వైఎస్ జగన్
- మన ప్రభుత్వం వచ్చాకే ప్రత్యేక శ్రద్ధ

"విశాఖపట్నంలో మనం చేయగలిగిన చోట అభివృద్ధి చేయకుండా వీళ్లు అడ్డుకుంటారు. ఇక్కడ మనం చేయలేం.. చంద్రబాబూ చేయలేరు. చంద్రబాబు చేయలేని దాన్ని, ఎవరూ చేయలేని దాన్ని మనం చేయాల్సిందే అని చెబుతూ రోజూ ధర్నాలు, డ్రామాలు, డ్యాన్సులు చేస్తున్నారు. మన మీద బురద జల్లాలనే దుర్బుద్ధితో డ్రామాలు ఆడుతున్నారు."
- సీఎం వైస్ జగన్

సాక్షి, విజయవాడ : రాజధాని పేరుతో ఈ ప్రాంతం వాళ్లను సైతం మోసం చేస్తున్న చంద్రబాబు విజయవాడకు కూడా చేసిందేమీ లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వికేంద్రీకరణపై అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడుతూ.. మన ప్రభుత్వం వచ్చాకే ఈ ప్రాంత అభివృద్ధిపై ఎక్కువ శ్రద్ధ పెట్టామని తెలిపారు. 'విజయవాడ పశ్చిమ బైపాస్ అభివృద్ధి చెందుతోంది. గన్నవరం సమీపంలోని చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు రూ.1,321 కోట్లతో 30 కి.మీ. రోడ్డు పనులు జరుగుతున్నాయి. దీనిలో 17.08 కి.మీ. పనులు పూర్తయ్యాయి. 65 శాతం పనులను పూర్తి చేశాం. 65 శాతం నిధులు వెచ్చించాం. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఈ పనులన్నీ పూర్తవుతాయి (రహదారి పనుల ఫొటోలను స్క్రీన్‌పై ప్రదర్శించారు). గొల్లపూడి నుంచి కృష్ణానది మీదుగా బ్రిడ్జి కట్టి.. చినకాకాని వద్ద చెన్నై జాతీయ రహదారిని కలిపే రోడ్డు పనులు కూడా జరుగుతున్నాయి. ఇది 18 కి.మీ.రోడ్డు. రూ.1,600 కోట్లు ఖర్చు పెడుతున్నాం. 33 శాతం పనులను 31 శాతం నిధులు ఖర్చు పెట్టి పూర్తి చేశాం. 2024లో ఇది పూర్తవుతుంది' అని వివరించారు. 'చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పనులన్నీ ఎందుకు పూర్తి చేయలేదు? ఎందుకంటే విజయవాడ, మంగళగిరి బాగా విస్తరించడానికి ఈ ప్రాజెక్టు బాగా ఉపయోగపడుతుంది. అదే జరిగితే అమరావతిలో చంద్రబాబు బినామీల భూముల విలువ పెరగదు కాబట్టి' అని చెప్పారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అక్కడ భూముల విలువ పెరిగేందుకే..

- విజయవాడ బాగుపడాలని మన ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది.
- కృష్ణా నదికి ఎప్పుడు వర్షాలు వచ్చినా కృష్ణలంక ప్రాంతం మునిగిపోయేది. చంద్రబాబు ఈ సమస్యను ఏనాడూ పట్టించుకోలేదు. మన ప్రభుత్వం వచ్చాక అక్కడ రూ.137 కోట్లతో ఒకటిన్నర కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ కట్టింది. (ఫొటోను స్క్రీన్‌పై ప్రదర్శించారు) దాంతో ప్రజలు సంతోషంగా ఉంటున్నారు.
- నదికి అటువైపు మరో కిలోమీటర్ మేరకు రీటెయినింగ్ వాల్ పనులకు టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఇదే పెద్దమనిషి నివాసం ఉండే కరకట్టకు ఒకవైపు వాహనం వస్తే మరో వాహనం పోవడం కష్టం. కానీ ఈ పెద్దమనిషి కనీసం ఆ రోడ్డును వెడల్పు చేయలేదు. మనం రూ.150 కోట్లు ఇచ్చి ఆ పనులు మొదలు పెట్టాం.

రూ.260 కోట్లతో అంబేడ్కర్ పార్క్

- విజయవాడలోని బందరు రోడ్‌లో అంబేడ్కర్ పార్క్‌ను రూ.260 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నాం. విజయవాడ ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు, వాకింగ్ చేసేందుకు పార్క్ నిర్మిస్తున్నాం. వేగంగా పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్ నాటికి పూర్తవుతాయి.
- విజయవాడలో కనకదుర్గమ్మ గుడి ఉంది. ఆ తల్లి చల్లని దీవెనలతోనే మనం క్షేమంగా ఉన్నాం. కానీ ఏ రోజైనా కానీ ఆ గుడిని అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆలోచంచనే లేదు. కొండ రాళ్లు పడిపోతున్నా పట్టించుకోలేదు. అదే మన ప్రభుత్వం ఆ గుడి కోసం రూ.70 కోట్లు ఇచ్చింది. అదే చంద్రబాబు తన హయాంలో 40 గుడులు కూల్చేశారు. ఏదైనా చేయాలన్న తపన, చిత్తశుద్ధి ఉంటే పనులు జరుగుతాయి. డ్రామాలు చేస్తే చివరకు గ్రాఫిక్స్ మాత్రమే మిగులుతాయి.

పది శాతం డబ్బుతో విశాఖపట్నం అభివృద్ధి

- ఇక్కడ వెచ్చించాలంటున్న దానిలో కేవలం 10 శాతం అంటే రూ.1.10 లక్షల కోట్లకు గానూ... కేవలం రూ.10-11 వేల కోట్లు విశాఖపట్నంలో ఖర్చు చేస్తే ఆ నగరాన్ని మనం ఎక్కడికో తీసుకెళ్లొచ్చు. ఎందుకంటే విశాఖపట్నంలో ఇప్పటికే రోడ్లు ఉన్నాయి. డ్రైనేజీ, నీళ్లు, కరెంటు వంటి కనీస వసతులు ఉన్నాయి. వీటి మీద మనం ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. కేవలం మెరుగులు దిద్దేందుకు కాస్తా డబ్బులు పెట్టాలి.

ఏ అంశంపైనైనా చర్చిద్దాం

- అచ్చెన్నాయుడికి సీఎం జగన్ ప్రతిపాదన
- ఐదు రోజులపాటు సమావేశాలు



బీఏసీ సమావేశంలో చర్చిస్తున్న స్పీకర్, సీఎం, మంత్రులు, సభ్యులు

సాక్షి, అమరావతి: ఏ అంశంపైనైనా సరే చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీఏసీ సమావేశంలో టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. చర్చకు సహకరిస్తారా? లేదా? అనేది తేల్చి చెప్పాలని సూచించారు. తమకు తగిన సమయం కేటాయించాలని అచ్చెన్నాయుడు కోరగా సభలో సభ్యుల సంఖ్య ఆధారంగా సమయం కేటాయిస్తామని స్పీకర్ తమ్మినేని తెలిపారు. గురువారం అసెంబ్లీ సమావేశాల తొలిరోజు స్పీకర్ అధ్యక్షతన బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. సభలో చర్చించేందుకు 27 అంశాలను అధికార పక్షం ప్రతిపాదించగా ప్రతిపక్షం 19 అంశాలను ప్రతిపాదించింది. 'అచ్చెన్నా.. మీరు ఏ అంశంపై కావాలన్నా చర్చిద్దాం. అవసరమైతే ఈఎస్ఐ స్కాంపైనా చర్చిద్దాం. కావాలంటే అమరావతి అంశంపై కూడా చర్చిద్దాం' అని సీఎం జగన్ ప్రతిపాదించారు. సభలో టీడీపీ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు హుందాగా లేదని, మీరు ఒకటి అంటే మేం నాలుగు అంటాం అని మంత్రులు బుగ్గన, జోగి రమేష్ తేల్చి చెప్పారు. శాసనసభ సమావేశాలను ఐదు రోజుల పాటు.. 21 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. కాగా, ప్రతి అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మీడియా పాయింట్ వద్ద తెలిపారు. అమరావతి పాదయాత్రలో స్థానికులెవ్వరూ లేరన్నారు.

వికేంద్రీకరణే మా విధానం

▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు వెళ్తున్నారో తెలియదు. ఉత్తరాంధ్రకు వెళ్లి, అక్కడి దేవుడిని ఏమని మొక్కుతారు ? అభివృద్ధి అంతా ఇక్కడే ఉండాలని అక్కడి, ఆప్రాంత దేవుడిని మొక్కుతారట! ఉత్తరాంధ్ర ప్రజలు ఇది చూసి గమ్మున ఉండాలట! వారికి భావోద్వేగాలు ఉండవా?

- వారిని రెచ్చగొట్టడానికి ఏకంగా ఈ మనిషి (చంద్రబాబు) వీరందరినీ అక్కడికి పంపించడం ధర్మమేనా? అంటే వారు వారు కొట్టుకోవాలి. ఆయనకు గతంలో 23 సీట్లు వచ్చాయి. ఇప్పుడు కుప్పం కూడా పోతుంది. ఒక్క సీటూ రాదు. ఆ విషయం ఈ పెద్ద మనిషికి బాగా తెలుసు. అందుకే పెట్రోల్ పోసి భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు.
- యాత్రలు మొదలు పెట్టించి, రాజకీయాల కోసం దిక్కుమాలిన పని చేస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా లాభం పొందాలని చూస్తున్నారు. అంత నీచమైన స్థాయికి ఏ నాయకుడూ పోడు. కేవలం చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5..ఇలా అందరూ కలిసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. వీరంతా పోతే తప్ప రాష్ట్రం బాగుండదు.

వికేంద్రీకరణ అంటే ఇదీ..

- రాజధానులు మాత్రమే కాకుండా పరిపాలన అనేది మారుమూల గ్రామాలకు సైతం ఎఫెక్టివ్‌గా అందాలంటే వికేంద్రీకరణ అవసరం. మూడేళ్ల క్రితం రాష్ట్రంలో గ్రామ సచివాలయాలు ఉన్నాయా? ఎలా ఉంటాయి? వాటి వల్ల ఎలా మేలు జరుగుతుందనుకున్నారు. ఈరోజు అన్నీ కనిపిస్తున్నాయి.
- చంద్రబాబు తాను 14 ఏళ్ల సీఎం, 40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటారు. కానీ గవర్నెన్స్‌ను ఈ మాదిరిగా ఇంప్రూవ్ చేయగలుగుతామని ఏనాడైనా ఊహించారా? వ్యవస్థలో అవినీతి లేకుండా చేయగలుగుతాం. ప్రతి గ్రామంలోనూ ఒక సచివాలయం ఏర్పాటు చేసి మన పిల్లలు 10 మందికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉండి ప్రతి కుటుంబానికి సేవలందించమని ఏ రోజైనా ఆయన ఆలోచించారా?
- ఇవాళ ఏకంగా 15,004 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయంలో దాదాపు 600 రకాల సేవలందిస్తున్నాం. వాటిలో దాదాపు 1.20 లక్షల మంది మన పిల్లలు ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వారిలో 83 శాతం మంది నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, నా చెల్లెమ్మలు.. నా తమ్ముళ్లు ఉన్నారని సంతోషంగా చెబుతున్నాను. వికేంద్రీకరణ అంటే ఇది.

"ఈ ప్రాంతం మీద నాకు ఎటువంటి వ్యతిరేకతా లేదు. ఇక్కడ రాజధాని తీసేయడం లేదు. విశాఖపట్నం, కర్నూలులోనూ రాజధానిని అదనంగా ఏర్పాటు చేయాలని మాత్రమే చెబుతున్నా. ఇక్కడ తీసేయాలని నేనెప్పుడూ అనలేదు. ఈ పది సంవత్సరాలలో నేను రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు ఖర్చుపెట్టినా ఈ రూ.లక్ష కోట్లు కాస్తా రూ.3 లక్షల కోట్లు అవుతుంది. అది ఎప్పటికీ పూర్తి కాదు. పనులన్నీ కూడా సగంలోనే కనిపిస్తాయి. అవి కూడా భవనాలు కాదు.. రోడ్లు, నీళ్లు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు మాత్రమే. ఇదొక డ్రీమ్ చేజింగ్."

- వ్యవసాయ శాఖ కార్యాలయం రాజధానిలో ఉంటుంది. అందువల్ల అక్కడ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తే అక్కడ స్థలాల రేట్లు పడిపోతాయని ఎవరైనా ఉద్యమం చేస్తే ఎలా ఉంటుంది? ఇవాళ వారు చేస్తోంది అదే. అన్నీ ఇక్కడే ఉండాలి. అన్నీ ఇక్కడికే రావాలి. రాజధానిలో భూముల రేట్లు పెరగాలి. అదే వారి ఉద్దేశం. వికేంద్రీకరణలో భాగంగా ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీలు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, విలేజ్ క్లినిక్‌లు ఇవన్నీ కూడా అమలుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. వికేంద్రీకరణ అంటే ఇది.
- ఇటీవలే నేను పులివెందులలోని వేల్పుల వద్ద సచివాలయ భవనాన్ని ప్రారంభించాను. అక్కడ డిజిటల్ లైబ్రరీ ఉంది. హైబ్యాండ్ విడ్త్‌తో అక్కడ ఇంటర్నెట్ ఉంది. 30 మంది పిల్లలు అక్కడే వర్క్ ఫ్రమ్ హోం కింద హాయిగా పని చేసుకుంటున్నారు. వికేంద్రీకరణ అంటే ఇది. ఆ పెద్దమనిషికి కనీసం ఏనాడైనా తట్టిందా?

అందరూ బాగుండాలన్నదే మా విధానం

- మనం తీసుకొస్తున్న సంస్కరణలు, చేస్తున్న కార్యక్రమాలు సమాజంలో కనీసం 90 శాతం ప్రజలకు మేలు చేస్తున్నాయి. ఇంటింటికీ, ప్రతి మనిషికి మేలు చేయడమే నా లక్ష్యం. నేను ఈ ప్రాంతానికి వ్యతిరేకం కాదు. అందుకే మూడు రాజధానుల్లో ఒకటి ఇక్కడే ఉండాలని కోరుకుంటున్నాను.
- నాటి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 33 నియోజకవర్గాలలో మన పార్టీ 29 ఎమ్మెల్యే సీట్లు గెలిచింది. మంచి చేస్తున్నాం కాబట్టే 2019 ఎన్నికల తర్వాత జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో మన పార్టీ స్వీప్ చేసింది. ఇది కేవలం కృష్ణా, గుంటూరు జిల్లాలలోనే కాదు. రాష్ట్రమంతా అవే ఫలితాలు వచ్చాయి.
- ఎంపీటీసీ ఎన్నికల్లో 86% అంటే 8,298 చోట్ల వైఎస్సార్‌సీపీ గెల్చింది. ఎంపీపీలు 637 వైఎస్సార్‌సీపీకి వచ్చాయి. అంటే 98% సీట్లు గెలిచింది. జడ్పీటీసీలు 639 వైఎస్సార్‌సీపీకి వచ్చాయి. అంటే 98% గెలిచాం. జడ్పీ ఛైర్మన్లు వంద శాతం అంటే మొత్తం 13 గెల్చుకుంది. 14 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లలో వంద శాతం అంటే మొత్తం 14 గెలిచాం. 86 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే 84 చోట్ల నెగ్గాం.
- ఈ చర్చ వల్లనైనా చంద్రబాబుకు, ఆయన పార్టీకి, ఆయన్ను మోస్తున్న దుష్ట చతుష్టయానికి జ్ఞానోదయం కావాలని ఆశిస్తున్నా.

వికేంద్రీకరణ అంటే ఎలాగుంటుందో మొన్న వరదల్లో చూశాం

- పరిపాలన వికేంద్రీకరణ ఏ విధంగా ఫలితాన్నిస్తోందన్నది మొన్నటి గోదావరి వరదల్లో చూశాం. 40 ఏళ్లలో ఏనాడూ ఆస్థాయిలో వరదలు రాలేదు. వికేంద్రీకరణ వల్లనే వరదల్లో బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందాయి. ప్రతి కుటుంబానికి రూ.2 వేలు ముట్టాయి.
- కోవిడ్ సమయంలో, మొన్నటి వరదల్లో మన వలంటీర్ల సేవలు అద్భుతం. గతంలో గోదావరికి వరదలు వస్తే అటు వైపు ఇటు వైపు కలిపి కేవలం ఇద్దరు కలెక్టర్లు, ఇద్దరు ఎస్పీలు మాత్రమే ఉండేవారు. కానీ మొన్న ఆరుగురు కలెక్టర్లు, ఆరుగురు ఎస్పీలు.. ఇంకా సచివాలయాల సిబ్బంది కలిపి మొత్తం 30 వేల మంది సైనికుల్లా పని చేశారు.
- మన రాష్ట్రంలో ఇప్పటి వరకు మొత్తం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా మరో 16 మెడికల్ కాలేజీలు రానున్నాయి. పార్వతీపురంలో మరో మెడికల్ కాలేజీ కూడా రానుంది. మన రాష్ట్రంలో టయర్ 1 సిటీలు లేవు.



సభా సమయం



ఉత్తరాంధ్రకు బాబు వెన్నుపోటు..

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే హక్కు టీడీపీకి లేదు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు విశాఖకు ఏం చేశారో కూడా చెప్పుకోలేని పరిస్థితి. హిందూస్థాన్ జింక్‌ను ప్రైవేటు పరం చేసిన ఘనత వారిది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధే విశాఖను గొప్ప నగరంగా నిలబెట్టింది. అచ్యుతాపురం సెజ్‌లో వేల మందికి ఉపాధి దొరుకుతుందంటే వైఎస్సార్ చలవే. విశాఖ విశిష్టతను గుర్తించిన సీఎం జగన్ పరిపాలన రాజధానిగా నిర్ణయిస్తే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఉత్తరాంధ్ర ఓట్లు వేయించుకుని మోసం చేసింది. వెన్నుపోటు పొడిచి ఉత్తరాంధ్రను ఉత్తి ఆంధ్రాగా మిగిల్చారు. రియల్ ఎస్టేట్, క్యాపిటలిస్టుల పాదయాత్రను ఉత్తరాంధ్ర ప్రజలు కచ్చితంగా అడ్డుకుంటారు.

సర్వత్రా స్వాగతం

పాలనా వికేంద్రీకరణకు అన్ని ప్రాంతాల్లోనూ ఆమోదం: ఎమ్మెల్యే భూమన

- ప్రజల ఆకాంక్షలను సీఎం జగన్ నెరవేరుస్తున్నారు
- ఉత్తరాంధ్రకు ప్రతిసారీ బాబు వంచన: మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- టీడీపీ నాయకులంతా అమరావతిలో భూములు కొన్నారు: కొడాలి నాని
- శివరామకృష్ణన్‌ను కాదని నారాయణ కమిటీని నియమించారు: కన్నబాబు
- అమరావతిపై అన్ని పార్టీలూ అంగీకరించాయి: టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల
- వికేంద్రీకరణ–పరిపాలనా సంస్కరణలపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ

సాక్షి, అమరావతి: పరిపాలన వికేంద్రీకరణను అన్ని ప్రాంతాల ప్రజలు స్వాగతిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఐదు కోట్ల మంది వికేంద్రీకరణను కోరుకుంటుంటే చంద్రబాబు ఒక్కరే వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. గురువారం అసెంబ్లీలో వికేంద్రీకరణ–పరిపాలనా సంస్కరణలపై జరిగిన చర్చలో భూమనతోపాటు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రులు కొడాలి నాని, కురసాల కన్నబాబు, టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధి: భూమన



సీఎం జగన్ అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా తెచ్చారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను గడప వద్దకే చేరవేస్తున్నారు. ఐదు కోట్ల మంది ప్రజలకు పాలనను చేరువ చేశారు. జిల్లాలను పునర్వ్యవస్థీకరించి రెవెన్యూ డివిజన్లు పెంచారు. అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్ పేరుతో జిల్లాలను ఏర్పాటు చేసి తెలుగు వారి గొప్ప తనాన్ని ఇతర ప్రాంతాలకు తెలిసేలా చేశారు. ఇప్పటికే 98 శాతానికిపైగా హామీలను నెరవేర్చారు. రాయలసీమను గతంలో అవమానకరంగా దత్త మండలాలుగా పిలిచేవారు. 1928లో జరిగిన ఆంధ్ర మహాసభలో రాయలసీమగా నామకరణం చేశారు. కొప్పూరు రామాచార్యులు ప్రతిపాదించిన మద్రాస్, నెల్లూరు, రాయలసీమతో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి ఉంటే సీమ దేశంలోనే అత్యంత సంపన్న రాష్ట్రంగా ఉండేది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక మొదటిసారిగా రాయలసీమ వాసుల కడగండ్లు, కన్నీరు తుడిచారు. వైఎస్సార్ పోతిరెడ్డిపాడు విస్తరణ పనులను చేపడితే చంద్రబాబు సహా టీడీపీ నేతలంతా ప్రకాశం బ్యారేజీపై ఆందోళన చేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక ప్రాంతాన్నే అభివృద్ధి చేయాలని ప్రయత్నించారు. అమరావతిలో రాజధానిని ఏర్పాటు చేస్తూ హైదరాబాద్ శాసన సభలో తీర్మానం చేశారు. దీని వెనుక సామాజిక ప్రయోజనాలు దాగున్నాయని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రిటైర్డ్ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు రాసిన పుస్తకంలో పేర్కొన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో విభిన్న ఆలోచనలు, అభివృద్ధిలో తేడాలున్నాయి. తెలుగువారిగా అందరం కలిసి ఉండాలి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగన్ ఆకాంక్ష.

కేంద్రాన్ని కాదని నారాయణ కమిటీ: కన్నబాబు



ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఏర్పాటుపై కేంద్రం శివరామకృష్ణన్ కమిటీని నియమిస్తే చంద్రబాబు స్వప్రయోజనాలకోసం నారాయణ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. తుళ్లూరు ప్రాంతాన్ని ఎంపిక చేసి రామోజీరావు సూచనల మేరకు అమరావతి పేరు పెట్టారని ఈనాడులో వార్త రాశారు. రాజధాని ఎక్కడ ఉండాలో బాబు తనవర్గం వారితో చర్చించి ముందుగానే భూములు కొనుగోలు చేయించారు. హైదరాబాద్ తరహా ప్లాన్‌నే అమరావతి లోనూ అమలు చేశారు. అమరావతిలో మౌలిక సదుపాయాలు, ఇతర పనులకు రూ.1.80 లక్షల కోట్లతో ప్రణాళిక ప్రకటించారు. రూ.14 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్నప్పుడు ఒకే దగ్గర రూ.లక్షల కోట్లు ఎలా వెచ్చిస్తారు? రాజధాని విషయంలో జరిగిన ఈ లోపాలను సీఎం వైఎస్ జగన్ సరిదిద్దుతున్నారు. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు 3 రాజధానుల నిర్ణయం తీసుకున్నారు.

సమైక్య ఉద్యమంపైనా ఇలా స్పందించలేదు..

అమరావతి పాదయాత్ర చంద్రబాబు డైరెక్షన్‌లో, ఆయన పెట్టుబడితో సాగుతోంది. రైతులు చేపట్టిన యాత్రపై ఏదో జరిగిపోతోందన్నట్లు ఎల్లో మీడియా ప్రచారం చేస్తోంది. సమైక్య రాష్ట్ర ఉద్యమంపై కూడా ఈనాడు ఇంతగా ప్రచారం చేయలేదు. నారా హమారా.. అమరావతి హమారా అనే నినాదాలే అసలు విషయాన్ని వెల్లడిస్తున్నాయి. నేను కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరిని విమర్శిస్తే టీడీపీకి చెందిన బుచ్చయ్య చౌదరికి కోపం వచ్చింది. అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందని కథనాలు రాస్తున్న ఈనాడు.. రాజధాని ఒకేదగ్గర కేంద్రీకృతమైతే మిగతా ప్రాంతాల వారికి జరిగే నష్టం గురించి రాయడం లేదు.

భ్రమరావతిగా మార్చింది బాబే: కొడాలి నాని



చంద్రబాబే అమరావతిని గ్రాఫిక్స్‌తో భ్రమరావతిగా మార్చారు. 29 గ్రామాలు కలిగిన ప్రాంతాన్ని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా లాంటి మహానగరాలతో పాటు సింగపూర్, మలేషియాతో పోలుస్తూ రియల్ ఎస్టేట్ దందా చేశారు. ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించింది. విశాఖలో తక్కువ ఖర్చుతో వేగంగా రాజధాని అభివృద్ధి చెందుతుంది. సీఎం జగన్ ఎన్నడూ కులాలు, మతాలను చూడలేదు. అలా చూసి ఉంటే రాయలసీమలోనే పరిపాలన రాజధాని పెట్టేవారు. అమరావతిలో కమ్మవారిని దెబ్బతీసేందుకు రాజధానిని తరలిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. పరిపాలన రాజధానిగా నిర్ణయించిన విశాఖలోనూ కమ్మవారి డామినేషనే ఉంది. అమరావతిలో అనేక కుంభకోణాలు, అవకతవకలు జరిగాయి. సంపద మొత్తాన్ని ఇక్కడే వెచ్చిస్తే మిగిలిన ప్రాంతాలు ఎప్పటికి అభివృద్ధి చెందుతాయి? అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.2,500 కోట్లు ఇస్తామంటే రూ.లక్షల కోట్లతో నిర్మిస్తానని బాబు ప్రచారం చేశారు. ఎస్సీ, ఎస్టీలను భయపెట్టి చట్ట విరుద్ధంగా అసైన్డ్ భూములను బినామీల పేర్లతో కొనుగోలు చేసి రాజధానిలో ప్లాట్లు పొందారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి 800 ఎకరాలు భూసేకరణ చేస్తే 200 ఎకరాలు కలిగిన పేద రైతులకు కాలువకట్టలు, లోతట్టు ప్రాంతాల్లో భూములిచ్చి మిగిలిన 600 ఎకరాలకు సంబంధించి తన వర్గానికి చెందిన వారికి రాజధానిలో రూ.3,600 కోట్లు విలువైన భూమిని కట్టబెట్టి అమరావతిని కమ్మరావతిగా మార్చేశారు. ఇందులో సినీ ప్రముఖులు అశ్వినీదత్, రాఘవేంద్రరావు, కేవీ రావు, శ్రీధర్ లాంటి వారున్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందని కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారు.

భూములు కొన్న బుచ్చయ్య

అనంతపురం నుంచి ఇచ్ఛాపురం వరకు టీడీపీ నాయకులు ప్రతి ఒక్కరికీ రాజధాని ప్రాంతంలో ఎకరం నుంచి ఐదెకరాల వరకు భూములున్నాయి. బుచ్చయ్య చౌదరి రాజమహేంద్రవరంలో స్థలాలను అమ్మేసి రూ.3 కోట్లతో అమరావతిలో మూడెకరాలు కొన్నారు. ఇప్పుడు వాటికి ధర లేదు. ఆయన అమ్మేసిన భూముల ధర రూ.11 కోట్లకు చేరింది. తమ భూముల ధరలు పెరగాలంటే బాబును గద్దెనెక్కించాలని కుట్రలు చేస్తున్నారు. చంద్రబాబును నమ్మి మోసపోయిన అమాయకులను రెచ్చగొట్టి పాదయాత్రలు చేయిస్తున్నారు. 500 కిలోమీటర్ల దూరాన్ని 50 రోజుల్లో పూర్తి చేస్తారు. నా నియోజకవర్గంలో మాత్రం 45 రోజుల పాటు యాత్ర చేస్తారట. పాదయాత్ర ప్రారంభించగానే రామోజీరావు మీడియాలో మహా ఉద్యమం కలరింగ్ ఇస్తున్నారు. రాధాకృష్ణ, బీఆర్ నాయుడు, ఖమ్మంలో కార్పొరేటర్‌గా కూడా గెలవలేని రేణుకా చౌదరి సైతం డాంబికాలు పలుకుతున్నారు.

అమరావతిని పార్టీలన్నీ అంగీకరించాయి: టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల



అన్ని పార్టీల ఆమోదంతోనే రాజధాని ఎంపిక జరిగింది. 175 నియోజకవర్గాలకు ఆదాయాన్ని సమకూర్చేలా అమరావతి నిర్మించాలని తలపెట్టాం. ఇప్పుడు జగన్ ప్రభుత్వం రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా పాలన చేస్తోందంటే టీడీపీ సర్కారు అమరావతిలో చేసిన అభివృద్ధి వల్లే. అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలి కానీ పాలనా వికేంద్రీకరణ కాదు. అమరావతి దేవతల రాజధాని. దాన్ని ఎందుకు మార్చాలని చూస్తున్నారు. ఇక్కడ కమ్మ, రెడ్డి కులస్తులు సమానంగా ఉన్నారు. 75 శాతం మంది ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలున్నారు. 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులను కాదనడం సరికాదు. రాజధానిని మార్చడం కుదరదని పార్లమెంట్ సైతం చెప్పింది.

దళిత ఎమ్మెల్యేలను కించపరుస్తున్నారు

సాక్షి, అమరావతి: శాసన సభలో టీడీపీ సభ్యుల తీరుపై మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను అగౌరవపరిచేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. గురువారం శాసన సభలో మంత్రి మాట్లాడుతూ.. స్పీకర్ పోడియం వద్దకు వచ్చి అధికార పార్టీ సభ్యులను, సభా నాయకుడిని ఏకవచనంతో మాట్లాడుతున్నారని తెలిపారు. సభలో దళిత సభ్యులను కించపరిచేలా టీడీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని అన్నారు. తనను ఉద్దేశించి దళితుడివా అని ప్రతిపక్ష సభ్యులు అనడం ఎమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. సభా మర్యాదలు పాటించకుండా బాధ్యతా రాహిత్యంగా వారు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. అభూత కల్పనలతో సభను, సభ్యులను అగౌరవపరుస్తున్నారని చెప్పారు. తాను తప్పు చేశానని స్పీకర్‌కి ఫిర్యాదు చేశారని, తాను ఎక్కడా తప్పు మాట్లాడలేదని స్పష్టం చేశారు. 'దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..' అని మాట్లాడిన చంద్రబాబు పార్టీ వారికి సిగ్గులేదని అంటే తప్పు ఏముందన్నారు. ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి శాసన సభలో తాను తప్పుగా మాట్లాడలేదని స్పష్టంచేశారు.

టీడీపీ సభ్యులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు: అంబటి

టీడీపీ సభ్యులు దళిత మంత్రి ఎదురుగా నిలబడి ప్లకార్డులు చూపిస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. టీడీపీ సభ్యుడు బాల వీరాంజనేయస్వామి తీరు సరిగా లేదన్నారు. మంత్రి మేరుగు నాగార్జున ఎదురుగా నిలబడి ఆయన ప్లకార్డులు చూపించారని, ఇది దురుసు ప్రవర్తన కాదా అని ప్రశ్నించారు. ఇది తప్పు అని గమనించిన టీడీపీ సభ్యుడు పయ్యావుల కేశవ్ వచ్చి ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారని చెప్పారు.

నా గురించి తప్పుగా మాట్లాడారు: టీడీపీ ఎమ్మెల్యే స్వామి

టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ మంత్రి నాగార్జున తనను అనరాని మాటలు అన్నారని చెప్పారు. తన పుట్టుక గురించి మాట్లాడారని, రికార్డుల్లో చూడాలని అన్నారు. ఆయన తన గురించి ఏమీ మాట్లాడలేదని రికార్డుల్లో తేలితే రాజీనామా చేస్తానన్నారు. తన గురించి నాగార్జున మాట్లాడుతుంటే సీఎం నవ్వుతున్నారని చెప్పారు. ఈ సమయంలో శాసన సభా వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ జోక్యం చేసుకుని ఆ సమయంలో సీఎం సభలో లేరని, అనవసరమైన మాటలు మాట్లాడవద్దని చెప్పారు. ఈ సమయంలో టీడీపీ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి గొడవ చేసేందుకు ప్రయత్నించారు. రికార్డులు చూడాల్సిందేనని స్వామి పట్టుబట్టడంతో స్పీకర్ చూస్తానని చెప్పారు. దీంతో పరిస్థితి సర్దుమణిగింది.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఏపీఐఐసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

జీవో–7 అమలు ద్వారా జీతాల పెంపు

సాక్షి, అమరావతి: ఏపీఐఐసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్ కి కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలంగా జీతాల పెంపునకు ఎదురు చూస్తున్న ఉద్యోగులకు జీవో నంబర్ 7 మార్గదర్శకాలను అమలు చేయడం ద్వారా జీతాలు పెంచుతూ ఏపీఐఐసీ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎండీ జవ్వాది సుబ్రమణ్యంలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ సీఎం నాయకత్వంలో అందరికీ మేలు జరుగుతోందని, ఈ నిర్ణయంతో ఏపీఐఐసీలో 400 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

కాస్టిక్ సోడా పరిశ్రమకు అన్ని విధాలా సహకారం

ఇదిలా ఉండగా తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూపు గ్రాసిం ఏర్పాటు చేసిన కాస్టిక్ సోడా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఏపీఐఐసీ చైర్మన్ గోవిందరెడ్డి హామీ ఇచ్చారు. కాస్టిక్ సోడా యూనిట్ విస్తరణకు సంబంధించి ఆదిత్య బిర్లా గ్రూపు ప్రతినిధులు ఏపీఐఐసీ చైర్మన్‌ను కలిశారు.

సచివాలయంలో 85 అదనపు పోస్టులు మంజూరు

సీఎస్ సమీర్ శర్మ ఉత్తర్వులు

అదనపు పోస్టుల వివరాలు ఇలా

కేటగిరి	పోస్టుల సంఖ్య
అదనపు కార్యదర్శులు	10
సంయుక్త కార్యదర్శులు	6
డిప్యూటీ కార్యదర్శులు	11
అసిస్టెంట్ కార్యదర్శులు	28
సెక్షన్ ఆఫీసర్లు	30

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు నవరత్నాల పేరుతో వివిధ పథకాలను అమలు చేస్తోంది. అలాగే కొత్తగా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ, ఈడబ్ల్యూసీ శాఖలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు విద్య, వైద్య రంగంలో నాడు–నేడు కింద పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో ఆయా శాఖల్లో ఉద్యోగులపై పనిభారం పెరిగిపోయింది. దీంతో సచివాలయంలోని వివిధ శాఖల్లో సాధారణ పరిపాలన శాఖ సింగిల్ యూనిట్ కింద 85 అదనపు పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ గురువారం ఉత్తర్వులిచ్చారు.

22 నుంచి రెండో విడత 'ఉచిత ప్రవేశాలు'

సాక్షి, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు స్కూళ్లలో 1వ తరగతిలోకి ఉచిత ప్రవేశాలకు సంబంధించి రెండో విడత ప్రక్రియ ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ గురువారం తెలిపారు. రెండో విడత లాటరీలో ఉచితంగా సీట్లు పొందే విద్యార్థుల జాబితాను ఈ నెల 21న వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆయా స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారని వివరించారు.

మహిళల్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నీచ రాజకీయాలు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి: మహిళలను అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలు చేయడం తగదని ప్రతిపక్ష టీడీపీకి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సతీమణి భారతిపై సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె బుధవారం డీజీపీని కలిసి లేఖను అందజేయడం తెలిసిందే. ఇదే విషయమై గురువారం రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి పద్మను కలిసి వినతులు అందించారు. గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాలు ఎవరికి వారు విడివిడిగా సంతకాలతో వినతిపత్రాలు ఇచ్చారు. వాటిని ఆమె డీజీపీ కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి పద్మ స్పందిస్తూ గత ఎన్నికల ప్రచారంలో వైఎస్ భారతి మాట్లాడిన మాటలను వక్రీకరించి ఒక వర్గం సోషల్ మీడియాలో చేసిన దుష్ప్రచారానికి సంబంధించిన ఆధారాలను డీజీపీకి సమర్పించినట్టు తెలిపారు.

సత్యవ్రతులకు వారి సత్యసంధత ప్రయోజనం చేకూర్చే రోజు వస్తుంది. అలాంటివారికి సెలయేళ్ళు ప్రవహించే స్వర్గ వనాలు లభిస్తాయి. అక్కడ వారు కలకాలం సుఖంగా ఉంటారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, సెప్టెంబర్, 16

పదవి సత్యం... పార్టీ మిథ్య!

అవును... పదవి సత్యం... పార్టీ మిథ్య. దక్కిన అధికారం సత్యం... ఆడినమాట మిథ్య. గోవా రాష్ట్ర ఎమెల్యేల సిద్ధాంతం ఇదే కావచ్చు. కొన్నేళ్ళుగా ప్రతి అసెంబ్లీ కాలవ్యవధిలోనూ ఇదే తంతు. బుధవారం నాడు ఎనిమిది మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అధికార బీజేపీలో చేరిపోవడం అచ్చంగా అందుకు మరో ఉదాహరణ. గోవా సహా అనేక రాష్ట్రాల్లో కమలనాథులు సాగిస్తున్న అధికార అశ్వమేధంలో ఇది మరో అంకం. ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధుల్ని తమలో కలిపేసుకొని, కాషాయ జెండా కప్పడం ఎనిమిదేళ్ళుగా అప్రతిహతంగా సాగుతున్నదే. గతంలో 2018లో అరుణాచల్ ప్రదేశ్, 2019లో కర్ణాటక, 2020లో మధ్యప్రదేశ్, 2021లో పశ్చిమ బెంగాల్... ఇలా ప్రతి చోటా అనర్హత వేటుకు దొరక్కుండా సాగుతున్న ఈ రాజకీయ ప్రహసనం పార్టీ ఫిరాయింపుల చట్టానికి పెద్ద వెక్కిరింత. మన రాజకీయ వ్యవస్థలోని లోపానికీ, ముందే తెలిసినా తమ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని ప్రతిపక్షాల అసమర్థతకూ పరాకాష్ఠ.

చిన్న చిన్న నియోజకవర్గాల గోవాలో ఒక పార్టీకీ, సిద్ధాంతానికే కట్టుబడే రాజకీయ పాతివ్రత్యం పట్ల ప్రజాప్రతినిధులకు పెద్దగా నమ్మకం కనిపించదు. కొద్ది వేల ఓట్లను చేతిలో పెట్టుకున్న నేతల చుట్టూనే ఆ రాష్ట్ర రాజకీయాలు నడుస్తున్నాయి. దాంతో, ఇన్నిసార్లు పార్టీ రంగులు మారుస్తున్నా ఓటర్లు ఛీ కొడతారనే భయమూ వారికి లేదు. ఇక ఆరునూరైనా అధికారంలో ఉండాల్సిందేనన్న బీజేపీ అజెండా పుణ్యమా అని 'ఆయా రామ్... గయా రామ్' సంస్కృతి ఇటీవల ప్రబలింది. క్రితం అసెంబ్లీలో ఏకంగా మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలు పార్టీలు మార్చారు. ఈసారి గెలిచి ఆరు నెలలైనా కాక ముందే అధికార విరహం భరించలేక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి దూకారు.

తాజా గోవా ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన గెలిచింది 11 మంది. వారిలో మూడింట రెండు వంతుల కన్నా ఎక్కువగా 8 మంది వెళ్ళి బుధవారం బీజేపీలో చేరడంతో సాంకేతికంగా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వీరికి వర్తించదు. కానీ, ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ఆలయాల్లో, దర్గాల్లో, చర్చిల్లో దేవుడి ఎదుట పార్టీ ఫిరాయించబోమంటూ ఇదే ఎమ్మెల్యేలు చేసిన ప్రమాణాలు ఏమైనట్టు? అదేమంటే, 'గుడికి వెళ్ళి, దైవాజ్ఞ మేరకే పార్టీ మారాను' అంటూ హస్తం గుర్తుపై గెల్చిన దిగంబర్ కామత్ లాంటి వాళ్ళు నైతికమైన ఈ తప్పును సమర్థించుకోవడమే అమితాశ్చర్యం. ఢిల్లీ నుంచి ఏ దేవుడు చెబితే వీళ్ళు మారినట్టు? మారకపోతే జాగ్రత్తంటూ ఏ సీబీఐ, ఈడీల బెత్తం చూపి బెదిరిస్తే, మారినట్టు? ఆ దేవుడు ఏ వరాలు ప్రసాదిస్తే మారినట్టు? ఇవన్నీ జవాబులు తెలిసిన ప్రశ్నలు.

ప్యాకేజీలతోనో, పదవులతోనో, మాట వినకుంటే కేంద్ర సంస్థల దర్యాప్తులతోనో... ఎలాగైతేనేం ప్రతిపక్ష సభ్యుల్ని కంచె దాటి తమ వైపు వచ్చేలా చేసుకొనే కళలో కొన్నాళ్ళుగా ఆరితేరింది. బీజేపీ, దాని పెద్దలు అదే పనిగా ఇస్తున్న పిలుపు – 'కాంగ్రెస్ ముక్త్ భారత్'. కానీ, గత ఎనిమిదేళ్ళలో అనేక రాష్ట్రాల్లో వరుసగా సాగుతున్న 'ఆపరేషన్ కమలం' చూస్తుంటే, ఎక్కడా ఏ ప్రతిపక్షమూ లేని 'ప్రతిపక్ష ముక్త్ భారత్' కాషాయ పార్టీ మనసులో కోరిక అని అర్థమవుతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా సాగే ఎన్నికల్లో ఒక పార్టీని ఓడించి, మరో పార్టీ గెలవాలనుకోవడం వేరు. కానీ, అసలు ప్రశ్నించే గొంతు, ప్రతిపక్షమే లేకుండా అంతా తామై ఏకపక్షంగా రాజ్యం చేయాలనుకోవడం వేరు. అప్పుడది ఏకస్వామ్యమే తప్ప ప్రజాస్వామ్యమైతే అనిపించుకోదు. వాజ్‌పేయి లాంటి నేతల హయాంలో కొన్ని విలువలకు పేరున్నపార్టీగా ఒకప్పుడు అందరూ అనుకున్న బీజేపీ దురదృష్టవశాత్తూ ఇప్పుడవన్నీ వదిలేసుకున్నట్టు కనిపిస్తోంది.

ఈ వ్యవహారంలో బీజేపీతో పాటు ప్రతిపక్షాల తప్పూ లేకపోలేదు. కమలనాథుల అధికారపు ఆకలి తెలిసీ, తమ వర్గం వారిని ఒక కట్టుగా ఉంచుకోలేక పోవడం పూర్తిగా ప్రతిపక్ష వైఫల్యమే. గోవాలో ఇప్పుడు మిగిలిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా ఎన్నాళ్ళు ఈ గట్టునే ఉంటారో చెప్పలేం. మాజీ సీఎం కామత్, ప్రస్తుత ప్రతిపక్ష నేత మైఖేల్ లోబో – ఇద్దరూ వెళ్ళిపోవడంతో కాంగ్రెస్‌కు ఇప్పుడక్కడ నాయకత్వం లేకుండా పోయింది. నిజానికి, జూలైలోనే ఇదే కామత్ – లోబో జంట ఎమ్మెల్యేల మూకుమ్మడి వలసకు యత్నించింది. తీరా అంతా కలసి అయిదుగురే అవడంతో ఫిరాయింపుల నిరోధక వేటు పడుతుందని ఆఖరి నిమిషంలో అది ఆగింది. ఆ సంగతి తెలిసినా గత రెండు నెలల్లో ఈ ఎమ్మెల్యేల వేటను ఆపడంలో కాంగ్రెస్ విఫలమైంది. సంక్షోభ నివారణలో ఆ పార్టీ నేతల అసమర్థతకు ఇదో మచ్చుతునక.


రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేపట్టి వారం తిరగక ముందే గోవా లాంటి ఘటన ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. యాత్ర మరిన్ని రాష్ట్రాల మీదుగా సాగే కొద్దీ మరిన్ని దొంగదెబ్బలను కాంగ్రెస్ కాచుకోవాల్సి ఉంటుంది. గత నెలలో జార్ఖండ్‌లో ఆఖరి నిమిషంలో ఆగిన ఫిరాయింపులపై బీజేపీ ఈసారి దృష్టి పెట్టవచ్చు. ఈ దుష్ట ఫిరాయింపుల సంస్కృతికి అడ్డుకట్ట ఎలా వేయాలన్నది ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ప్రజాప్రాతినిధ్య, ఫిరాయింపుల నిరోధక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న లొసుగులను సరిదిద్దాలని పార్టీలన్నీ పట్టుబట్టాలి. పార్టీ మారే ప్రబుద్ధులను రీకాల్ చేసే అవకాశం లేనందున, తదనంతర ఎన్నికల్లో వారిని ఓడించి బుద్ధిచెప్పాలనే చైతన్యం ఓటర్లలో రావాలి. అలా కాక సరసంలో, రాజకీయ సమరంలో అంతా సమంజసమే అనుకొంటేనే కష్టం. ఏ గుర్తుపై గెలిచామన్నది కాదు.... ప్రభుత్వంలో ఉన్నామా లేదా అన్నది ముఖ్యం అన్న చందంగా రాజకీయాలు తయారైతే, ఎన్నికల ప్రజాస్వామ్యంలో అంతకు మించిన అపహాస్యం మరొకటి లేదు. గోవా ఉదంతం మరోసారి గుర్తు చేస్తున్న సంగతి అదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.26 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** కృత్తిక ప.12.11 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.5.22 నుండి ఉ.7.05 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.04 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.36 నుండి 11.18 వరకు; రాహుకాలం ఉ.10.30 నుండి 12.00 వరకు; **యమగండం** ప.3.00 నుండి 4.30 వరకు; **సూర్యోదయం** 5.51; **సూర్యాస్తమయం** 6.01

తలచుకుంటే నడుచుకోవాలి!

అభిప్రాయం



వప్పల బాలచంద్రన్

సుభాష్ చంద్రబోస్ తను ఏర్పాటు చేసిన సైనిక దళాన్ని భవిష్యత్ భారత సైన్యానికి బలమైన ఇరుసుగా మార్చాలని ఆశించారు. సైన్యంలో అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమంపై శ్రద్ధ వహించారు. తన కొత్త సైన్యాన్ని ఆనాడు ఉన్నట్లుగా మతం, కులం లేదా ప్రాంతం ఆధారంగా రెజిమెంట్లుగా విభజించలేదు. హిందువులు, ముస్లింలు మాట్లాడే భాషలను హిందూస్థానీగా సమ్మిళితం చేయడం ద్వారా తన దళంలో ఉన్న రెండు ప్రధాన భారతీయ సంస్కృతుల మధ్య సమైక్యతను తెచ్చారు. ఇండియా గేట్ సమీపాన ఉన్న ఛత్రంలో సుభాష్ చంద్రబోస్ నిలువెత్తు విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించడం ఒక చరిత్రాత్మక ఘట్టం. అయితే, నేతాజీ ప్రాధాన్యాలను అనుసరించాలనుకుంటే కనుక దేశంలో మత సామరస్యాన్ని కాపాడాలి.

న్యూఢిల్లీలోని ఇండియా గేట్ సమీపాన ఉన్న ఛత్రంలో సెప్టెంబరు 8న స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ నిలువెత్తు విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించడం ఒక చరిత్రాత్మక ఘట్టం. ఒకప్పుడు ఆ ఛత్రంలో ఉండిన బ్రిటిష్ రాజు 5వ జార్జ్ విగ్రహం తొలగింపుతో ఏర్పడిన ఖాళీని ఎవరితో భర్తీ చేయాలన్న విషయమై దశాబ్దాల తరబడి సాగిన ఊగిసలాట అనంతరం తీసుకున్న సముచిత నిర్ణయం ఇది. అంతేనా, దేశ స్వాతంత్య్ర సాధన కోసం సాయుధ మార్గాలను అన్వేషిస్తూ నేతాజీ 1941 జనవరి 26న భారతదేశాన్ని వీడి ప్రవాసం వెళ్లిన అనంతరం ఇన్నేళ్లకు న్యూఢిల్లీలో తొలిసారిగా ఏర్పాటైన ఆ యోధుడి గర్వస్థలి కూడా ఇది! 1947కి ముందే అండమాన్‌ను వలస పాలన నుంచి విముక్తం చేసి, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు బోస్‌ను 'అఖండ భారత్‌కు తొలి అధిపతి'గా మోదీ ప్రశంసించడం కూడా సరైనదే. అదే సమయంలో ఆయన సుభాష్ చూపిన పథాన్ని 1947 తర్వాత జాతి విస్మరించిందని విచారం వ్యక్తం చేస్తూ, ఇకపై ఈ విగ్రహం నేతాజీ పోరాట పటిమకు ఒక స్ఫూర్తి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మనం స్వతంత్ర భారతిపై బోస్ ఆలోచనలు ఏమిటన్నవి మననం చేసుకోవాలి.

స్వాతంత్య్రానంతరం భారత భద్రతా బలగాలు ఎలా ఉండాలనే విషయమై నేతాజీ ఐరోపాలో ఉన్నప్పుడే ప్రయోగాత్మకమైన ఆలోచనలు, ప్రయత్నాలు చేశారని ప్రస్తుత తరంలో చాలామందికి తెలియకపోవచ్చు. 1943 అక్టోబరు 21న షోనన్ (సింగపూర్)లో 'ఆజాద్ హింద్ ఫౌజ్' తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు పూర్వరంగంగా బోస్ 1943 ఆగస్టు 25న 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'కి నాయకత్వం వహించడానికి చాలాముందే ఈ ప్రయోగాలు, ప్రయత్నాలు జరిగాయి. ఆనాటికి బెర్లిన్‌లో ఉంటున్న దివంగత భారతీయ పాత్రికేయుడు ఏసీఎన్ నంబియార్‌తో భవిష్యత్ స్వతంత్ర భారత విదేశాంగ విధానం, రక్షణ, అంతర్గత పాలనపై తన ఆలోచనలను బోస్ 1934 నుండీ నిరంతరంగా పంచుకుంటూ వచ్చారు. 1942–1945 మధ్య కాలంలో నంబియార్ ఐరోపాలో బోస్‌కు సహాయకారిగా ఉన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబానికి కూడా నంబియార్ సన్నిహితులు. నంబియార్‌తో బోస్ మొదటి సమావేశం 1934లో చెకొస్లొవేకియా రాజధాని ప్రాగ్‌లో జరిగింది. జర్మనీ పార్లమెంటు దిగువసభ ఉండే చారిత్రక రైక్‌స్టాగ్ భవనంలో 1933లో సంభవించిన అగ్నిప్రమాదంలో నంబియార్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ నాజీలు ఆయనను జర్మనీ నుండి బహిష్కరించిన తర్వాత ఆయన ప్రాగ్ వెళ్లారు. 1938 వరకు నంబియార్, బోస్ ఐరోపాలో వివిధ సందర్భాలలో కలిసే ఉన్నారు. 1939 మార్చిలో హిట్లర్ చెకోస్లోవేకియాలోకి ప్రవేశించినప్పుడు నంబియార్ కనుమరుగయ్యారు.

1941లో బోస్ భారతదేశం నుండి తప్పించుకున్న తర్వాత



స్పెయిన్ సరిహద్దులోని ఫోక్స్ ప్రాంతంలో ఆయనకు నంబియార్ మళ్లీ తారసపడ్డారు. బోస్ ఆయనను 1942 జనవరిలో పూర్తి దౌత్య హోదాతో బెర్లిన్‌లోని జర్మనీ విదేశాంగ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న 'ఆజాద్ హింద్ ఆఫీస్'కు తన డిప్యూటీగా నియమించుకున్నారు. తను బెర్లిన్ నుండి దూర ప్రాచ్యానికి వెళ్లిన తర్వాత ఐరోపాలోని కార్యకలాపాలకు ఆజాద్ హింద్ ఫౌజ్ తరఫున నాయకత్వం వహించడానికి ఆయనను ఎంచుకున్నట్లు కూడా నంబియార్‌తో బోస్ చెప్పారు. ఈ విషయం ప్రపంచానికి తెలీదు. అనంతరం 1943 ఫిబ్రవరి 8న బోస్ రహస్యంగా ఐరోపాను విడిచిపెట్టారు. బోస్‌తో నంబియార్ జర్మనీ, జపాన్‌లలోని ఫౌజ్ యంత్రాంగం ద్వారా మంతనాలు జరుపుతుండేవారు. బోస్‌కు ఆయన చివరి సమాచారం 1945 జనవరి 12న జర్మనీ పడవ యు–234 ద్వారా బట్వాడా అయింది. అయితే ఆ పడవ 1945 మే 14న అమెరికా నౌకాదళానికి పట్టుబడటంతో ఆ సమాచారం బోస్‌కు చేరలేదు.

గాంధీజీ ప్రబోధించిన మత సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకుని భావి స్వతంత్ర భారతావనిలో అన్ని పాలనా వ్యవస్థలను నిర్మించడం బోస్ పథకం అనీ, విదేశాల నుంచి జరిపిన స్వాతంత్య్ర పోరాటంలో సైతం బోస్ అదే పథకాన్ని అనుసరించారనీ నంబియార్ నాతో చెప్పారు. జర్మనీలో బోస్ చేపట్టిన ప్రారంభ కార్యకలాపాలలో ఒకటి, 1941 డిసెంబర్ నుంచి భారత సైనిక దళాన్ని పటిష్ఠం చేసుకుంటూ రావడం. అందుకోసం బోస్ ఉత్తర ఆఫ్రికాలో బ్రిటిష్ సైన్యంలో భాగంగా ఉండి అగ్రరాజ్యాలకు పట్టుబడిన భారతీయ యుద్ధ ఖైదీలను జర్మనీ సహకారంతో వాలంటీర్లుగా తీసుకున్నారు. ఒక్క ఏడాదిలోనే దాదాపు 4,000 మంది బోస్ దళ వాలంటీర్లుగా చేరారు.

''భారతదేశంలోని ప్రధాన సామాజిక వర్గాలతో బోస్ దళం సమీకృతంగా ఉండేది. ఆ వర్గాలలోని అల్పసంఖ్యాకులైన ముస్లిం, సిక్కు ప్రతినిధుల సంక్షేమం కోసం బోస్ శ్రద్ధ వహించారు. అంతే కాదు, బోస్ తన కొత్త సైన్యాన్ని మతం, కులం లేదా ప్రాంతం ఆధారంగా రెజిమెంట్లుగా విభజించాలని అనుకోలేదు. తన దళంలో మైనారిటీల మనోభావాలు దెబ్బతినకుండా జాతీయ గీతాన్ని, జాతీయ జెండాను బోస్ జాగ్రత్తగా ఎంపిక చేసుకున్నారు. ముస్లింలు నిరసించిన 'వందేమాతరం'కు బదులుగా రవీంద్రనాథ్ టాగూర్ 'జనగణమన'ను ఎంచుకున్నారు. మైసూర్‌కు చెందిన బ్రిటిష్ వ్యతిరేక యోధుడు టిప్పు సుల్తాన్ స్ఫూర్తిని సైన్యంలో ప్రేరేపించడానికి ఆజాద్ దళ త్రివర్ణ పతాకం మధ్యలో దుముకుతున్న పులిని చేర్చారు'' అని చరిత్రకారుడు సుగతా బోస్ తెలిపారు. తర్వాత పులి గుర్తుకు బదులుగా గాంధీజీ 'చరఖా' వచ్చింది.

ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని సైనికుల వేర్వేరు భాషల వల్ల కూడా సైనిక దళ ఐక్యతకు ముప్పు వాటిల్లుతుందని బోస్ బలంగా నమ్మారు. ఆ పరిస్థితిని నివారించేందుకు రోమన్ లిపిలో రాసిన హిందుస్థానీ భాషను దళాల ఉమ్మడి మాధ్యమంగా బోస్ స్వీకరించారని ఫౌజ్‌కు 1941–45 మధ్య హిందీ–జర్మన్ అనుసంధాన వ్యాఖ్యాతగా పనిచేసిన ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ విజిటింగ్ లెక్చరర్ రుడాల్ఫ్ హార్ట్గోగ్ తెలిపారు. హిందువులు, ముస్లిములు మాట్లాడే భాషలను హిందూస్థానీగా సమ్మిళితం చేయడం ద్వారా తన సైనిక దళంలో బోస్ భారతదేశంలోని రెండు ప్రముఖ సంస్కృతుల మధ్య సమైక్యతను సాధించారని హార్ట్గోగ్ రాశారు. 1939 తర్వాత కాంగ్రెస్‌లోని మితవాద నాయకులతో విభేదించిన కారణంగా గాంధీజీకి బోస్ దూరమైనప్పటికీ, అది ఆయన పట్ల బోస్‌కు ఉన్న గౌరవాన్ని ఏమాత్రం తగ్గించలేదు. 1942 క్విట్ ఇండియా ఉద్యమానికి గాంధీజీ పిలుపునిచ్చినప్పుడు బోస్ 'ఆజాద్ హింద్ రేడియో' ద్వారా గాంధీజీ ఆదేశాలను విధిగా పాటించాలని భారతీయులందరికీ స్పష్టమైన పిలుపునిచ్చారు. అకాలీదళ్, క్రిషక్ ప్రజా పార్టీ (బెంగాల్)లలోని పరస్పర విరుద్ధ వర్గాలను, ఆఖరికి ముస్లింలీగ్‌లోని ప్రగతిశీల శక్తులను సైతం గాంధీకి మద్దతు ఇవ్వలసిందిగా బోస్ కోరారని సుగతా బోస్ పేర్కొన్నారు.

1944 జూలై 6న బోస్ తన ఆజాద్ హింద్ ఫౌజ్‌కు గాంధీజీ ఆశీర్వాదం కోసం సింగపూర్ నుండి ప్రత్యేక రేడియో ప్రసంగం చేశారు. ''జాతిపితా, భారతదేశ విముక్తి కోసం ఈ పవిత్ర యుద్ధంలో మేము మీ ఆశీర్వాదాలను, శుభాకాంక్షలు కోరుతున్నాము'' అని బోస్ తన ప్రసంగంలో అన్నారు. 2012లో భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టం కింద ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానాన్ని బట్టి, గాంధీజీని ఎవరైనా 'జాతిపిత' అని సంబోధించిన తొలి సందర్భం అది! ప్రస్తుతం నరేంద్ర మోదీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి సుభాష్ చంద్రబోస్ ప్రాధాన్యాలను అనుసరించాలనుకుంటే కనుక దేశంలో మత సామరస్యాన్ని కాపాడాలి. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో పరిస్థితిని మెరుగు పరచాలి. లేదంటే, మత సామరస్యం అన్నది ఒక నినాదంలా మాత్రమే మిగిలిపోతుంది.

వ్యాసకర్త కేబినెట్ సెక్రటేరియట్ మాజీ ప్రత్యేక కార్యదర్శి
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

వాడకూడదు



ఎసిడిటీకి వేసుకునే రాన్‌టాక్ ట్యాబ్లెట్‌ను వాడకండి. అది క్యాన్సర్ కలిగించవచ్చు. ఇప్పటికే దాన్ని అమెరికాలో నిషేధించారు.

– రాహుల్ ఘులే, వైద్యుడు

దీన్నేమనాలో!



మరో మూడేళ్లపాటు ఒకాయన కార్యదర్శిగా కొనసాగే వీలు కల్పించేలా బీసీసీఐ (భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు) రాజ్యాంగాన్ని సవరించారు. అన్నట్టూ ఇది పూర్తిగా ప్రతిభ మీద ఆధారపడి జరుగుతుందనుకోండి! కుటుంబ పాలన? ఛీ– అది ఒక్క కాంగ్రెస్‌లోనే ఉంది.

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

చిట్టడవులతో పెద్ద మార్పు



నగరాల్లోని వన్యసంపదను తిరిగి పెంచి, వాతావరణ మార్పును ఎదుర్కోవడానికి 'నగర చిట్టడవులు' సాయం చేయగలవు. జపాన్ బొటానిస్ట్ అకీరా మియావకీ మానస పుత్రిక ఈ పద్ధతి. స్థానికంగా పెరిగే చెట్లను కొద్దిపాటి స్థలాల్లో దట్టంగా, చిన్న మొక్కలకు కూడా ఎండపొడ తగిలేలా నాటడం ఇందులో కీలకాంశం. ఈ పద్ధతిలో ఆసియా, యూరప్‌లో 1,700 చిట్టడవులు పెరుగుతున్నాయి.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

నచ్చని చేష్ట



నేను పరుషంగా మాట్లాడుతున్నానని అనుకున్నా సరే, తల్లిదండ్రులు తమ పిల్లల పెదవుల మీద ముద్దు పెట్టుకోవడం నాకు అస్సలు నచ్చదు.

– రచన, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ప్రజాస్వామ్యం కోసం...



ప్రపంచవ్యాప్తంగా, ప్రజాస్వామ్యం వెనక్కిజారుతోంది. సెన్సార్‌షిప్, నిర్బంధం, భౌతిక హింస, ఇంకా తరచుగా శిక్షలను మీడియా కార్మికులు ఎదుర్కొంటున్నారు. స్వేచ్ఛాయుతమైన మీడియా లేకుండా ప్రజాస్వామ్యం మనలేదు. ప్రజాస్వామిక సూత్రాలు, అందరి హక్కుల కోసం నిలబడాల్సిన సమయం ఇదే.

– ఆంటోనియో గుటేరస్, ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి

దిగ్గజానికి వీడ్కోలు



ఫ్రెంచ్ సినిమా దర్శక దిగ్గజం, సిద్ధాంతకర్త గొడార్డ్ నిష్క్రమణతో ప్రపంచ సినిమాలో పెద్ద శూన్యం ఏర్పడింది. మార్క్సిస్టు దృక్పథంతో కూడిన రాజకీయ సినిమాను గుర్తించడంలోనూ, సినిమా నిర్మాణానికి సంబంధించి అదివరకు ఉన్న పద్ధతులను వదిలించుకోవడంలోనూ ఆయన అత్యంత కీలకంగా నిలిచారు. ఫేర్‌వెల్ లెజెండ్!

– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

మాటలు వద్దు



ప్రియమైన పాశ్చాత్య సంస్థలకు – ఉక్రెయినియన్లు, రష్యన్ల మధ్య చర్చలను సులభతరం చేయాల్సిన అవసరం లేదు. ఒక పక్షం చంపుతూ పోతున్నప్పుడు ఇంకో పక్షం సరిగ్గా మాట్లాడటం సాధ్యం కాదు. మాకు చరిత్ర ఉంది. మీకంటే బాగా వాళ్లను అర్థం చేసుకోగలం. అవసరం అనుకుంటే మాకు మేమే వాళ్లను సంప్రదిస్తాం.

– ఇవాన్ వెర్బిత్‌స్కీ, ఉక్రెయిన్ విశ్లేషకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇది ఉత్తరాంధ్ర మనోభావాలపై దండయాత్ర!

సందర్భం




అట్టాడ అప్పల్నాయుడు

అధికార వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజాస్వామిక మౌలిక సూత్రాలు. ఏ కారణంతో రాజధాని వికేంద్రీకరణను వ్యతిరేకించినా సారంలో అది అప్రజాస్వామికం. గ్రామస్థాయి నుంచి కేంద్రం దాకా అధికార వికేంద్రీకరణ రాజ్యాంగ నిర్దేశనమే (అదెంత సజావుగా అమలవుతున్నదనేది వేరే చర్చనీయాంశం). ఒకానొక తొందరపాటు, తప్పుడు నిర్ణయం కారణంగా మన తెలుగునేల విభజన జరగాల్సినంత సజావుగా, సశాస్త్రీయంగా జరగలేదు. నదీజలాల పంపిణీ, ఆస్తుల పంపిణీ వంటి అనేకాంశాలను ఇరుపక్షాలతో విస్తృత చర్చలు జరిపి వారి అంగీకారంతో విభజన కార్యక్రమం పూర్తి చేయాల్సివుండగా అలా జరగలేదు. అలా జరిగితే ఇప్పటి స్థితి రెండు రాష్ట్రాలకూ వుండేది కాదు. అందులో ఆంధ్రప్రదేశ్‌గా మిగిలిన మన రాష్ట్రానికి తొలినాటి నుండీ అన్యాయం జరిగింది. అలా జరగటానికి నాటి కేంద్రపాలకులెంత కారణమో... విభజనను వ్యతిరేకిస్తున్నామంటూ డ్రామాలాడిన రాజకీయ పార్టీలన్నీ అంతే కారణం!

విభజన జరుగుతున్న సమయంలోనూ మన నేతలు... విభజన జరిగితే డిమాండ్ చేయాల్సిన అంశాలను గురించి ఆలోచించలేదు. ఆనాటికి రాజకీయంగా పలుకుబడి కలిగిన చంద్రబాబయితే విభజన రాష్ట్రానికి తాను ముఖ్యమంత్రి కావటం గురించే ఆలోచించారు తప్ప, రాష్ట్రానికి రావాల్సిన వాటిగురించి ఆలోచించలేదు. చివరికి ఆయనాశించినట్టే ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి అయిపోయారు. ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో వుంటూ రాజధాని నిర్మించాల్సినది పోయి, హఠాత్తుగా హైదరాబాద్ వదిలేసి తాత్కాలిక రాజధానిని నిర్మించి... శాశ్వత రాజధానిని ప్రపంచానికే ఆదర్శంగా నిర్మిస్తానన్నాడు. చంద్రబాబు రాజకీయనేత రూపంలో వున్న కార్పొరేట్ వ్యాపారి! ఆయనకు గల ఈ లక్షణ ఫలితాలే అమరావతి రాజధాని పేరిట భారీ భూసేకరణ, కార్పొరేట్ కంపెనీలతో బేరసారాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలూ! రాజధాని ఎంత పెట్టుబడితో ఎప్పటికి పూర్తవుతుందో, ఎలా పూర్తవుతుందో, పూర్తయితే ఎవరికి ప్రయోజనం అనేవి ప్రజలందరిలో కలిగిన ప్రశ్నలు! వాటికి జవాబు దొరక్కే వైసీపీ ప్రభుత్వాన్ని పజలు ఎన్నుకున్నారు.

అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తనదైన పంథాలో గత ప్రభుత్వ విధానాలన్నీటినీ పునః పరిశీలన చేస్తూనే, కొత్తవాటిని ప్రవేశపెడుతోంది. ఈ నేపథ్యంలోనే జగన్ ప్రభుత్వం రాజధాని వికేంద్రీకరణ నిర్ణయం తీసుకుంది. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గానీ, సచివాలయాలుగానీ, వలంటీర్ వ్యవస్థగానీ, ఇచ్చిన ఉద్యోగాలుగానీ (లోపాలుంటే సరిదిద్దే ఉద్యమాలు చేయొచ్చు) ప్రజావ్యతిరేకం అనగలమా? గ్రామస్థాయికి పాలనా వ్యవస్థను తీసుకొచ్చిన నేపథ్యమే రాజధానిని వికేంద్రీకరించి... పాలనా కేంద్రాలను వెనుకబడిన రాయలసీమకూ, ఉత్తరాంధ్రకూ దగ్గర చెయ్యాలనే ఆలోచనకు తెరలేపింది. ఉత్తరాంధ్ర ప్రజలందరికీ విశాఖపట్టణం దగ్గరగా ఉంటుంది. అక్కడి ప్రజలు ప్రభుత్వానికి సులువుగా తమ అవసరాలను నివేదించుకోగలరు. అలాగే నిరసనగళాలు విన్పించగలరు. ఇందుకోసం సుదూర అమరావతికి పోనవసరం ఉండదు.

పాలనా కేంద్రం ఒకటి వస్తోందంటే కేవలం పాలనా భవంతులే కావుగా, అనుబంధ శాఖలు కూడా వస్తాయిగా. అప్పటిదాకా లేనటువంటి అనేకానేక కార్యాలయాలు, వాటి అనుబంధ శాఖలు, వాటితో వాణిజ్య సంబంధ రంగాలు అనేకం కొత్తగా చేరుతాయి. వెనుకబాటుకు గురికాబడిన ఉత్తరాంధ్ర ముఖచిత్రానికి రూపుదిద్దుకోబోయే నూతన సౌభాగ్యరేఖను ఇవన్నీ నిర్దేశించేవే కదా! ఉత్తరాంధ్ర ప్రజలకు



విశాఖపట్నం పాలనాకేంద్రం కావటమనేది ఒక వరం లాంటిది. ఏ కారణంతో అయినా దీనిని వ్యతిరే కించడం ఉత్తరాంధ్రకు అన్యాయం చేయడమే. రాబోయే పాలనాకేంద్రం పనితీరును లాభదాయకం చేసుకోడానికీ, ప్రజాప్రయోజనకారి చేసుకోడానికీ నివేదనల నుంచి నిరసనలదాకా అన్నింటినీ వినియోగించే వీలు ఎలాగూ ఉత్తరాంధ్రులకు వుంటుంది. ఇంటి ముంగిటకు పాలనా కేంద్రం వస్తోన్న సమయంలో... దీనిని వ్యతిరేకిస్తే ఉత్తరాంధ్ర ప్రజలు అంగీకరించరు. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంటు కాదది, వారి కమిట్‌మెంట్!

ఈ సందర్భంలో అమరావతి రైతుల అరసవిల్లి యాత్ర (అందులో నిజమైన రైతులెందరు? ఆసాములెందరు? వెనకున్న రాజకీయపార్టీ యేమిటి అన్న ప్రశ్నలు వేరే చర్చ) ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను గాయపరచే యాత్ర అవుతుందే తప్ప వేరు కాదు. అమరావతిలో భూములిచ్చిన రైతులు తమకు నష్టం లేకుండా (ఇచ్చిన భూములకు తగ్గ విలువ) గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయమని డిమాండ్ చేయొచ్చు తప్ప, మరే ప్రాంతానికీ రాజధానినీ, పాలనా కేంద్రాలనూ వికేంద్రీకరించకూడదని అనగూడదు. రాయలసీమ కానీ, ఉత్తరాంధ్ర కానీ పాలనా కేంద్రాలకు చేరువగా వుండకూడదని అనకూడదు. ఇప్పటికే ప్రాంతాల మధ్య పాలకుల పుణ్యాన అసమానతలు ఏర్పడ్డాయి (ఇవే తెలంగాణ వేర్పాటుకూ కారణాలు). ఇంకా అదే నమూనా రాజకీయాలు నడపడం వెనుకబడిన ప్రాంతాల ఆందోళనలకు దారితీస్తాయి.

అమరావతి రైతులు కోర్టులకు వెళ్లారు, మంచిదే. తాత్కాలిక రాజధాని దగ్గర నిరసనోద్యమాలు నడిపారు. తమ ఆందోళనలను లోకానికి వెల్లడించారు. అది వారి హక్కు. కానీ, ఇప్పుడు అరసవిల్లి యాత్ర ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాల మీద దండయాత్ర! ఉత్తరాంధ్రులు కోరుకునే పాలనా కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తరాంధ్ర నేల మీద నినదిస్తూ యాత్ర నిర్వహించడం ఎవరి రాజకీయ క్రీడలో భాగమో కానీ... అది ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రేపడమే కాక ఎటువంటి విధ్వంసానికి దారి తీస్తుందోనని భయపడాల్సిన అవసరముంది. విజ్ఞతతో నడవాల్సిన ఉద్యమాలు ఇతరేతర ప్రయోజనాలతో నడవడం విషాదకరం!

వ్యాసకర్త ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక అధ్యక్షులు

పరబ్రహ్మ తత్వం

ఒకసారి జ్ఞాన యోగాన్ని తెలుపమని బృహస్పతిని కోరాడు మనువు. ''జ్ఞాన యోగానికి మూలం కర్మ మార్గమే. కోరికలు తీర్చుకోవడానికే కర్మలు చేస్తారు మానవులు. కానీ వారు సుఖాలనుకున్నవే దుఃఖాలై బాధిస్తాయి. ఫలాపేక్షతో కర్మలు చేయనివారే సుఖదుఃఖాలకు అతీతులై అరిషడ్వర్గాలు కలిగించే ఆపదలను తప్పించుకుంటారు. పరబ్రహ్మ తత్వమే ఆత్మ ఉనికికి ఆధారమైనది.

చెట్టులో అగ్ని కనబడకుండా ఉన్నట్టే శరీరంలో పరబ్రహ్మ తత్వం గుప్తంగా ఉంటుంది. దాన్ని సరైన మార్గంలో గ్రహించాలి తప్ప అడ్డదారులు లేవు. కర్రలో ఉన్న నిప్పును మరో కర్రతో మధిస్తేనే బయటపడుతుంది. గొడ్డలితో నరికితే కనిపించదు. పరతత్వమూ అంతే. సరైన మార్గంలోనే శోధించాలి. మనస్సుకు, ఇంద్రియాలకు అందనంత మాత్రాన శరీరంలో పరతత్వం లేదనుకోరాదు. ఒక వస్తువు ముందు భాగాన్ని మాత్రమే చూడగలిగినప్పుడు దానికి వెనుక భాగమే లేదనుకోవడం అవివేకమే.


పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకోడానికి తగిన ప్రయత్నం చెయ్యాలి. జంతువు కోసం వల, పక్షి కోసం ఉచ్చు, చేప కోసం గాలాన్ని వినియోగించినట్టే పరబ్రహ్మ తత్వాన్ని కూడా తగిన సాధనంతో గ్రహించాలి. బుద్ధిమంతుడు జ్ఞానవంతుడైతే పరబ్రహ్మ తత్వాన్ని గ్రహించగలడు. ఆత్మజ్ఞత, అనాత్మజ్ఞత అనేవి రెండూ మానసిక చర్యలే. మనసుని నిర్మలంగా ఉంచుకున్నప్పుడే ఆత్మజ్ఞుడవుతారు. మురికిగా ఉన్న నీటిలో ప్రతిబింబం చూడలేనట్టే క్షోభ చెందిన హృదయంతో ఆత్మజ్ఞానాన్ని పొందలేరు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకున్నప్పుడే సుఖసంతోషాలను పొందుతారు. ఇంద్రియాలనే దొంగల నుండి ఆత్మను కాపాడుకున్నప్పుడే పాపాలు నశించి జ్ఞానాన్ని పొందగలరు. అప్పుడే ఆత్మ మెరుగుటద్దంలాగా ప్రకాశిస్తుంది'' అని బృహస్పతి బోధించాడు.

జ్యోతిర్మయం

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

బ్రహ్మోత్సవాలకు తిరునగరి ముస్తాబు

శరవేగంగా జరుగుతోన్న ఏర్పాట్లు ✦ వాహన సేవ సమయాల్లో మార్పులు



తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరుమలలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండేళ్ల అనంతరం బ్రహ్మోత్సవాలను ఆలయం వెలుపల నిర్వహిస్తుండటం..ఈ ఏడాది ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 27 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 20వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని టీటీడీ సంకల్పించింది. శ్రీవారి వాహనసేవలు జరిగే ఆలయ మాడ వీధులతో పాటు తిరుమలను ఇప్పటికే సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. కళ్లు చెదిరే రంగులు, విద్యుత్ దీప కాంతులతో తిరు వీధులను దేదీప్యమానంగా అలంకరిస్తోంది. పటిష్టమైన బ్యారికేడ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. తిరుమలలోని ప్రధాన మార్గాల్లో పలు చోట్ల భారీ ఆర్చీలను నిర్మిస్తోంది. కాటేజీలు, కార్యాలయాలు, భక్తజన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు, లైటింగ్ కటౌట్లను ఏర్పాటు చేస్తోంది. బ్రహ్మోత్సవ వాహన సేవల్లో అపురూపమైన కళారూపాల ప్రదర్శనకు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈ కళారూపాలు భక్తులకు కనువిందు చేయనున్నాయి. ఉత్తరాదితో పాటు దక్షిణాదికి చెందిన 7 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి కళాకారులు వాహన సేవల్లో పాల్గొననున్నారు. వాహన సేవల సమయంలో విశిష్టతను తెలియజేసేందుకు ప్రముఖ పండితులు వ్యాఖ్యానం చేస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి 9 రోజుల పాటు 16 వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వాహన సేవ సమయాల్లో మార్పు..

ఈ ఏడాది వాహన సేవల సమయాల్లో టీటీడీ పలు మార్పులు చేసింది. గతంలో ప్రతి వాహన సేవ ఉదయం, రాత్రి వేళల్లో 9 గంటలకు ప్రారంభమయ్యేది. ఈ సారి నుంచి ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకే వాహన సేవలను ప్రారంభించాలని టీటీడీ నిర్ణయించింది. 26న సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. 27న సాయంత్రం 5.15 నుంచి 6.15 గంటల వరకు శ్రీవారికి ధ్వజారోహణ నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం 7గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం వైఎస్ జగన్ శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమయ్యే పెద్ద శేషవాహనంతో బ్రహ్మోత్సవ సంబరం మొదలవుతుంది.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంతో పాటు భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన టీటీడీ సీవీ ఎస్వో నరసింహ కిషోర్‌తో కలిసి మాడ వీధుల్లోని వివిధ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను, గ్యాలరీలను పరిశీలించారు.

ప్రధానికి 'బర్త్ డే పార్శిల్'

మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రత్యేక పోస్టల్ కార్డు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపేందుకు తపాల శాఖ 'బర్త్ డే పార్శిల్' పేరుతో ప్రత్యేక కార్డును తీసుకువచ్చినట్లు పోస్టల్ శాఖ విజయవాడ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ మల్లాది హరిప్రసాద్ చెప్పారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 17న మోదీ పుట్టిన రోజు సందర్భంగా దేశ ప్రజలు శుభాకాంక్షలు తెలిపేందుకు వీలుగా ప్రత్యేక కార్డును తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలు పోస్టాఫీస్‌కు వెళ్లి లేదా పోస్ట్‌మేన్‌ను కలిసి రూ.50 చెల్లించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఈ అవకాశం అక్టోబర్ రెండో తేదీ వరకు ఉంటుందన్నారు.

భక్తజన సంద్రంగా వెంకటగిరి

కనుల పండువగా పోలేరమ్మ జాతర



అశేష భక్తజనం మధ్య నగరోత్సవం

వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతర గురువారం భక్తజన సందోహం నడుమ వేడుకగా సాగింది. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారి మెట్టినిల్లు అయిన రజికుల ఇంట నుంచి స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేపాకుల మండపంలో అమ్మవారిని నిలుపు చేశారు. అప్పటి నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకూ సాగింది. రెండేళ్ల కరోనా సమయంలో అమ్మవారి జాతర భక్తులకు దర్శనం లేకుండా ఏకాంతంగా నిర్వహించారు. ఈ ఏడాది కరోనా వీడటంతో తెలుగు రాష్ట్రాలతోపాటు పలు ఇతర రాష్ట్రాల నుండి లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో జరిగిన పోలేరమ్మ జాతరలో అమ్మవారిని తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, తదితరులు దర్శించుకున్నారు.

అమరావతి పేరుతో బాబు డ్రామా

టీడీపీ బినామీల చేతుల్లో పేదల భూములు

- జోలితో సేకరించిన రూ.కోట్లు, బంగారం ఏమయ్యాయి?
- పాలనా రాజధానికి విశాఖ అన్ని విధాలా అనువైంది
- వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్



మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్ : అమరావతి రాజధాని పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేశ్ పెద్ద డ్రామా కంపెనీయే నడుపుతున్నారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని పేరుతో చంద్రబాబు అమరావతి చుట్టుపక్కల సామాన్య రైతుల వద్ద నుంచి వేలాది ఎకరాలను కారుచౌకగా లాక్కున్నారన్నారు. వాటిని తిరిగి టీడీపీ నేతల బినామీదారులు, గుత్తేదారుల చేతిలో పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీశారన్నారు. టీడీపీ తన ఐదేళ్ల పాలనలో అక్కడ రేకుల షెడ్లు మినహా ఏమీ కట్టలేదని ఎంపీ ఆరోపించారు. అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇద్దామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయిస్తే చంద్రబాబు కోర్టులో పిల్ వేయించారన్నారు.. ధనవంతులకు కేటాయించిన చోట పేదలు నివసించకూడదని చంద్రబాబు భావించడం వెనుక ఆయనలోని జాతి అహంకారం బయటపడుతోందన్నారు. అసైన్డ్ భూములను సైతం చంద్రబాబు, లోకేశ్ అనుయాయులు లాక్కున్నారని ఎంపీ భరత్‌రామ్ ఆరోపించారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో అన్ని నగరాలు అభివృద్ధి చెందాలన్నదే తమ నేత సీఎం జగన్ ఉద్దేశమన్నారు. వరల్డ్ క్లాస్ క్యాపిటల్ కావడానికి కావాల్సిన అన్ని రకాల హంగులూ విశాఖకు ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఆ నగరానికి గుర్తింపు వస్తుందన్నారు. పశ్చిమ తీరంలో ముంబై మాదిరిగా తూర్పు తీరాన విశాఖను అభివృద్ధి చేయాలని సీఎం జగన్ భావిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లా కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేయాలని సీఎం జగన్ ఆలోచిస్తున్నారన్నారు.

అమరావతి రైతులతో బాబు డ్రామాలు

అమరావతి రైతులను అడ్డుపెట్టుకుని బాబు డ్రామాలాడుతున్నారని మార్గాని భరత్ విమర్శించారు. ఇక అమరావతి పేరుతో జోలి పట్టుకుని సేకరించిన రూ.కోట్లు, బంగారం ఎవరి ఖజానాలోకి వెళ్లాయని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 2021–22లో వివిధ దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు రూ.లక్షా 71వేల కోట్లుట్ల పెట్టుబడులు వస్తే.. అందులో 45 శాతం ఒక్క ఏపీ, ఒడిశా రాష్ట్రాలకే వచ్చాయంటే మన రాష్ట్రంలో అవకాశాలెలా ఉన్నాయో అర్థంచేసుకోవచ్చన్నారు.

జగనన్న మేలు మర్చిపోలేనిది

అనలాగ్ ఆస్ట్రోనాట్ జాహ్నవి వెల్లడి

పాలకొల్లు సెంట్రల్: ఇచ్చిన మాట ప్రకారం వేగంగా స్పందించి తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 50 లక్షల సాయం అందజేయడంపై పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన అనలాగ్ ఆస్ట్రోనాట్ జాహ్నవి ఆనందం వ్యక్తం చేసింది. జగనన్న మేలు మర్చిపోలేనిదని పేర్కొంది. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల వరదల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజమండ్రి వచ్చినప్పుడు కలిశానని, "నీ విద్యకు ఆర్థిక ఇబ్బందులు రాకూడదు.. నీకు ఏ అవసరం ఉన్నా నేను సహకరిస్తా" అంటూ అప్పుడు ఆయన హామీ ఇచ్చారని పేర్కొంది. సీఎం భరోసాతో ఆస్ట్రోనాట్‌గా అవ్వాలన్న తన ఆశలు మరింత పెరిగాయని వివరించింది. తన ఎదుగుదలకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసింది. కాగా, బుధవారం అమరావతిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతులమీదుగా ప్రభుత్వం అందించిన రూ. 50 లక్షల చెక్కును జాహ్నవి అందుకుంది.



ఘనంగా గిరిజనోత్సవం

ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనుల సంప్రదాయ వంటకాలు, ఆచార వ్యవహారాలు, గిరిజన పండుగలకు సంబంధించిన అంశాలపై సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ గురువారం పాడేరు మండలం కుజ్జెలి పంచాయతీ దిగుమోదాపుట్టులో గిరిజన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. గ్రామంలో మహిళలు సంప్రదాయ వంటకాలను కుండల్లో కట్టెల పొయ్యలపై చేశారు. చిరు ధాన్యాలతో పాటు గిరిజన ప్రాంతాల్లో లభ్యమైన పలు ఆకుకూరలు, దుంప జాతులకు చెందిన వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఔషధ గుణాలున్న మొక్కలను కూడా సేకరించి ప్రదర్శించారు. గిరిజన యువతులకు ముగ్గుల పోటీలు కూడా నిర్వహించారు. థింసా నృత్యాలతో మహిళలు సందడి చేశారు. ఆచార సంప్రదాయాలు, పండుగలు, వ్యవసాయ ఉత్సవాలపై వీధి నాటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, మాజీ సర్పంచ్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మహిళ నేత బాడంగి సూర్యకళ, సీపీఎఫ్ సంస్థ ప్రతినిధులు లోకేశ్, గాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్, ఫిన్‌టెక్ రంగాల్లో కలిసి పనిచేద్దాం

ఇజ్రాయెల్ కాన్సుల్‌ను కోరిన ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



జోసఫ్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: స్టార్టప్, ఫిన్‌టెక్ రంగాల్లో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ కాన్సుల్ ఫర్ ట్రేడ్ (ఎకనమిక్స్) జోసఫ్ అబ్రహం చెప్పారు. గురువారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో ఆయన సమావేశమయ్యారు. వ్యవసాయ, నీటి నిర్వహణ రంగాల్లో తమ దేశం అత్యున్నత సాంకేతికతలను వినియోగిస్తోందని చెప్పారు. ఆహార ఉత్పత్తులను ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి ఇజ్రాయెల్ ఆసక్తి చూపుతోందని తెలిపారు. వీసీ మాట్లాడుతూ స్టార్టప్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు అత్యధిక ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి చేస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూలో జరుగుతోన్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని ప్రత్యక్షంగా వీక్షించాలని ఆహ్వానించారు. ఏయూలో అమెరికన్ కార్నర్, జపాన్ కార్నర్ ఉన్నాయని అదే విధంగా ఇజ్రాయెల్ కార్నర్‌ను కూడా నెలకొల్పాలని కోరారు. ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను ప్రారంభించామని దీనితో సమన్వయం చేస్తూ ఫిన్‌టెక్ రంగంలో పనిచేస్తామని వివరించారు. అనంతరం జోసఫ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి పెద్దపీట

- టీడీపీ హయాంలో తెలుగు అకాడమీని మూసేశారు
- దానిని మళ్లీ నెల్లూరులో తెరిపించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



పార్వతీపురం/పార్వతీపురంటౌన్ : తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ అమ్మ భాషను గౌరవించాలని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అధికార భాషా సంఘ ప్రతినిధులు గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో తెలుగు భాష అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మాతృభూమి, మాతృభాష, అమ్మ పవిత్రమైన పదాలు అని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని కోరారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తెలుగుకు ప్రాచీన భాషా హోదా వచ్చిందన్నారు. టీడీపీ హయాంలో మూసివేసిన తెలుగు అకాడమీని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తిరిగి నెల్లూరులో ప్రారంభించిందని తెలిపారు. తెలుగు అధికార భాష అమలుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఏదైనా సంస్థ పేరును తెలిపే ఫలకాన్ని తెలుగులో ప్రదర్శించకపోతే ఆ యజమానికి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. అధికార భాషగా తెలుగు అమలును సమీక్షించని శాఖాధిపతికి రూ.5 వేల వరకు జరిమానా విధించవచ్చన్నారు. బోధనా మాధ్యమంగా తెలుగును అమలు చేయని విద్యా సంస్థ అధిపతికి రూ.50 వేలు జరిమానా లేదా 6 నెలలకు మించకుండా జైలు శిక్షను విధించే అవకాశం ఉందన్నారు. డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, అధికార భాషా సంఘ కార్యదర్శి రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఏబీసీ నూతన చైర్మన్‌గా ప్రతాప్ పవార్



న్యూఢిల్లీ: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) నూతన చైర్మన్‌గా ప్రతాప్ పవార్ ఎన్నికయ్యారు. మరాఠీ దినపత్రిక 'సకల్'ను ప్రచురించే సకల్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. 2022–23 సంవత్సరానికి గాను ఏబీసీ చైర్మన్‌గా ఇటీవలే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మహ్రాత్తా చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ అండ్ అగ్రికల్చర్(పుణే) అధ్యక్షుడిగా సేవలందించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో బోర్డు సభ్యుడిగా పనిచేశారు. ప్రతాప్ పవార్‌ను భారత ప్రభుత్వం 2014లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా శ్రీనివాసన్ కె.స్వామి ఎన్నికయ్యారు.

మిత్రదేశాలు పాక్‌ను బిచ్చగాడిగా చూస్తున్నాయి

ఇస్లామాబాద్: నానాటికీ దిగజారుతున్న పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితిని దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కళ్లకు కట్టారు. మిత్రదేశాలు కూడా పాకిస్తాన్‌ను అడుక్కునే దేశంగానే చూడటం మొదలుపెట్టాయంటూ విచారం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో లాయర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. 'మనతో సన్నిహితంగా ఉండే ఏ దేశానికి వెళ్లినా, వారికి ఫోన్ చేసినా అడుక్కోటానికే అని అనుకుంటున్నారు. చాలా చిన్న దేశాలు కూడా అభివృద్ధిలో పాక్‌ను దాటేసి పోయాయి. మనం మాత్రం 75 ఏళ్లుగా జోలె పట్టుకుని తిరుగుతూ బిచ్చమెత్తుకుంటున్నాం' అని వ్యాఖ్యానించారు. ఇంతకు ముందు కూడా దేశం పరిస్థితి ఇదే, వరదలతో ఇప్పుడు మరింత తీవ్రంగా మారిందన్నారు.

అదే నిజమైతే నన్ను 4 రోజుల్లోనే అరెస్ట్ చేయాలి

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తాను అవినీతికి పాల్పడినట్లు ఆరోపిస్తూ బీజేపీ విడుదల చేసిన వీడియోపై మంత్రి మనీష్ సిసోడియా తీవ్రంగా స్పందించారు. 'ఈ వీడియోను సీబీఐకి వెంటనే అందజేయాలని బీజేపీని కోరుతున్నా. బీజేపీ బ్రాంచి కార్యాలయంగా మారిన సీబీఐ దీనిపై వెంటనే దర్యాప్తు చేపట్టి, అందులో ఏమైనా వాస్తవముంటే నాలుగు రోజుల్లోగా నన్ను అరెస్ట్ చేయాలి' అని పేర్కొన్నారు. తన నివాసం, బ్యాంకు ఖాతాల సోదాలతో ఫలితం లేకపోయేసరికి ఇటువంటి అసత్య ఆరోపణలకు పూనుకుందన్నారు. సోమవారం కల్లా తనను అరెస్ట్ చేయకుంటే ఆ వీడియో అబద్ధమని, కేజ్రీవాల్ సారథ్యంలో ఆప్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ, ప్రధాని మోదీ పన్నిన కుట్రలో భాగమని తేలిపోతుందని సిసోడియా పేర్కొన్నారు.

సుప్రీం, హైకోర్టు జడ్జీల రిటైర్మెంట్ వయస్సు పెంచాలి

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల రిటైర్మెంట్ వయస్సును పెంచాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) కోరుతోంది. ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రస్తుతం దిగువ కోర్టులు, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల పదవీ విరమణ వయస్సు వరుసగా 60, 62, 65 ఏళ్లుగా ఉన్నాయి. ముఖ్యంగా హైకోర్టులు, సుప్రీంకోర్టు జడ్జీల పదవీ విరమణ వయస్సులను 65, 67 ఏళ్లకు పెంచాలని బీసీఐ కోరుతోంది. వివిధ కమీషన్లు, ఫోరంలకు చైర్ పర్సన్లుగా అనుభవజ్ఞులైన న్యాయవాదులను నియమించేందుకు వీలుగా నిబంధనలను సవరించాలని పార్లమెంట్‌ను కోరుతూ తీర్మానించినట్లు వెల్లడించింది.

శివకుమార్‌కు ఈడీ సమన్లు

బెంగళూరు: మనీ లాండరింగ్ కేసులో తమ ముందు హాజరుకావాలని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశించింది. ఈడీ సమన్లు జారీచేయడంపై శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఇంకొద్ది రోజుల్లో కర్ణాటకలో ప్రారంభం కానుంది. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలున్నాయి. శాసన, రాజకీయ బాధ్యతలను నేను కచ్చితంగా నిర్వర్తించాలి. ఈడీకి సహకరించేందుకు నేను సిద్ధమే. కానీ, ఈ సమయంలో ఉద్దేశపూర్వకంగా ఈడీ సమన్లు పంపి వేధిస్తోంది' అని శివకుమార్ గురువారం ట్వీట్‌చేశారు. 'భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్‌కు వస్తున్న అపూర్వ ప్రజా మద్దతును చూసి ఓర్వలేక కర్ణాటకలో యాత్ర ఏర్పాట్లకు భంగం కల్గించేందుకే మోదీ సర్కార్ ఇలా ఈడీ(ఎలక్షన్ డిపార్ట్‌మెంట్) ఆఫ్ బీజేపీని రంగంలోకి దించింది' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా ఆరోపించారు.

నా ఎమ్మెల్యే పదవిపై త్వరగా తేల్చండి: హేమంత్

రాంచీ: జార్ఖండ్‌లో గత మూడు వారాలుగా కొనసాగుతున్న అనిశ్చితిని తొలగించాలని, తన ఎమ్మెల్యే పదవిపై స్పష్టత ఇవ్వాలని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాష్ట్ర గవర్నర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం గవర్నర్‌కు లేఖ రాశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమ ఎమ్మెల్యేలను కొనేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. గనుల లీజుల వ్యవహారంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని బీజేపీ ఆరోపించింది. దీనిపై ఎన్నికల సంఘం ఈ ఏడాది ఆగస్టు 25న తన అభిప్రాయాన్ని గవర్నర్‌కు పంపించింది. హేమంత్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయడంపై గవర్నర్ తన నిర్ణయాన్ని ప్రకటించలేదు.

చీతాలు.. ఎన్నాళ్లకెన్నాళ్లకు!



విమానం ముందుభాగానికి చీతాలా పెయింట్ వేసిన దృశ్యం

మొదలైన కౌంట్‌డౌన్

- ఇవాళ ఎనిమిది చీతాలతో నమీబియా నుంచి బయల్దేరనున్న ప్రత్యేక విమానం
- 17న కునో పార్కులో చీతాలను విడుదల చేయనున్న ప్రధాని

ఏడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత చీతాల మెరుపు కదలికల్ని చూడబోతున్నాం. అంతరించిపోయిన వన్యప్రాణుల్ని పునరుద్ధరించే ప్రాజెక్టులో భాగంగా నమీబియా నుంచి ఎనిమిది చీతాలను భారత్‌కు తీసుకువస్తున్నారు. ప్రధాని మోదీ తన పుట్టిన రోజైన శనివారం మధ్యప్రదేశ్‌లోని కునో–పాల్‌పూర్ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలోకి చీతాలను విడుదల చేస్తారు. రెండు నుంచి ఆరేళ్ల మధ్య వయసున్న మూడు మగ, అయిదు ఆడ చీతాలను తీసుకురావడానికి ఏర్పాట్లు చేశారు. నమీబియా రాజధాని విండ్‌హెక్ నుంచి శుక్రవారం రాత్రి ప్రత్యేక విమానం బయల్దేరి రాజస్తాన్‌లోని జైపూర్‌కి శనివారం ఉదయం చేరుకుంటుంది. అక్కడ్నుంచి హెలికాప్టర్‌లో మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్క్‌కి తరలిస్తారు. వీటిని తీసుకురావడానికి బీ747 జంబో జెట్‌కు మార్పులు చేశారు. దీని ముందు భాగంలో చీతా బొమ్మను పెయింట్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.

చీతాల క్షేమమే లక్ష్యంగా

ప్రయాణంలో చీతాలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. విమానాల్లో ప్రయాణించేటప్పుడు జంతువులకి కడుపులో తిప్పడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే వాటికి ఆహారం ఇవ్వకుండా ఖాళీ కడుపుతో తీసుకువస్తారు. విమానంలో చీతాలను ఉంచడానికి 114సెం.మీ X8సెం.మీ X84సెం.మీ బోనుల్ని ఏర్పాటు చేశారు. ప్రయాణంలో చీతాల బాగోగుల్ని చూడడానికి ముగ్గురు సంరక్షకులు వెంట ఉంటారు. వన్యప్రాణుల్ని ఖండాంతరాలకు తరలించాల్సి వస్తే ప్రయాణానికి ముందు తర్వాత నెల రోజులు క్వారంటైన్‌లో ఉంచాలి. ఆ నిబంధనలకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ చెప్పారు. కునో జాతీయ పార్కులో చీతాలను ఉంచడానికి భారీ ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేశారు. చీతాల నుంచి ఎలాంటి వ్యాధులు సంక్రమించకుండా ఇప్పటికే వాటికి వ్యాక్సిన్‌లు ఇచ్చారు. క్వారంటైన్ సమయం పూర్తయ్యాక కొత్త వాతావరణానికి చీతాలు అలవాటు పడడం కోసం కొన్నాళ్లు అవి స్వేచ్ఛగా విహరించడానికి వీలుగా వదిలేస్తారు. అందుకే కునో నేషనల్ పార్కు చుట్టుపక్కల ఉన్న 24 గ్రామాల ప్రజల్ని ఖాళీ చేయించి ఇతర ప్రాంతాలకు తరలించారు. నమీబియాలో వాతావరణానికి దగ్గరగా కునో పార్క్ ఉంటుంది. అందుకే అక్కడే వాటిని ఉంచాలని నిర్ణయించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

దశాబ్దాల ప్రయత్నాలు ఫలించిన వేళ

- భారత్‌లో చివరిసారిగా 1948లో చీతా కనిపించింది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌గా పిలుస్తున్న కొరియ ప్రాంతంలో వేటగాళ్ల చేతిలో ఆఖరి చీతా బలైంది. 1952లో కేంద్రం అంతరించిపోయిన వన్యప్రాణుల జాబితాలో చీతాలను చేరుస్తూ ప్రకటన చేసింది
- ఆసియా, ఆఫ్రికా ఖండంలో ఎక్కువగా కనిపించే చీతాలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 7,500 మాత్రమే ఉన్నాయి.
- 1960 నుంచి చీతాలను మళ్లీ దేశానికి తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. తొలుత ఆసియన్ చీతాలను తీసుకురావడానికి ఇరాన్‌తో సంప్రదింపులు జరిపారు. అయితే ఆ దేశంలో కూడా వాటి సంఖ్య తక్కువగా ఉండడంతో వాటిని ఇవ్వడానికి అక్కడ ప్రభుత్వం నిరాకరించింది
- 2009లో నాటి పర్యావరణ మంత్రి జైరామ్ రమేష్ ఆఫ్రికన్ చీతాలను తీసుకురావడానికి ప్రాజెక్టుని ప్రారంభించారు.
- 2020లో సుప్రీం కోర్టు ఈ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపింది. చీతాలను తెచ్చేందుకు నమీబియా, దక్షిణాఫ్రికాతో కేంద్రం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.
- అయిదేళ్లలో 50 చీతాలు తీసుకురావడానికి కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసింది
- తొలిదశగా నమీబియాకి చెందిన చీతా కన్జర్వేషన్ ఫౌండేషన్ (సీసీఎఫ్) ఎనిమిది చీతాలు తీసుకువస్తోంది. దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలు రానున్నాయి.

యూపీలో దారుణం

- లఖీంపూర్‌ఖేరిలో దళిత అక్కాచెల్లెళ్లపై అత్యాచారం, హత్య
- చున్నీ బిగించి.. చెట్టుకు వేలాడదీసి...
- ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



ఘటనాస్థలి

లఖీంపూర్‌ఖేరి: ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్‌ఖేరి జిల్లాలో మరో ఘోరం జరిగింది. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించారన్న ఆగ్రహంతో దళిత అక్కాచెల్లెళ్లు ఇద్దరిపై కొందరు యువకులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ తర్వాత వారు ధరించిన చున్నీలనే గొంతు బిగించి చంపేసి, చెరకు పొలాల సమీపంలో ఒక చెట్టుకు వేలాడ దీసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించారు. దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఈ ఘటనపై లఖీంపూర్ ఎస్పీ సంజీవ్ సుమన్ అందించిన వివరాల ప్రకారం.. లాల్‌పూర్ పూర్వా గ్రామానికి చెందిన దళిత బాలికలైన ఆ ఇద్దరూ అక్కాచెల్లెళ్లు. వారి వయసు 17, 15 ఉంటాయి. వీరితో జునైద్, సోహైల్ అనే ఇద్దరు యువకులు కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. పెళ్లి చేసుకోవాల్సిందిగా బాలికలు వీరిపై గత కొంత కాలంగా ఒత్తిడి తెస్తున్నారు. అది ఇష్టంలేని నిందితులు జునైద్, సోహైల్ ఒక పథకం ప్రకారం బుధవారం మధ్యాహ్నం తమ స్నేహితులతో కలిసి మోటార్‌బైక్‌ల మీద ఎక్కించుకొని ఊరికి దూరంగా చెరకు పొలాల్లోకి తీసుకువెళ్లారు. వారిపై అత్యాచారం చేశారు. స్నేహితుల సహకారంతో ఆ ఇద్దరు బాలికల్ని వారి చున్నీలనే గొంతుకు బిగించి హత్య చేశారు. తమ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి వారి శవాల్ని చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. బుధవారం రాత్రి అంతా నిందితుల కోసం గాలించిన పోలీసులు, సోహైల్, హఫీజూర్ రెహ్మాన్, కరీముద్దీన్, ఆరిఫ్, చోటూలను అరెస్ట్ చేశారు. జునైద్‌ని మాత్రం గురువారం ఉదయం ఒక ఎన్‌కౌంటర్ సందర్భంగా అరెస్ట్ చేశారు. ఆ ఎన్‌కౌంటర్‌లో జునైద్ కాలికి గాయమైంది. జునైద్, సోహైల్ పోలీసుల ఎదుట తమ నేరాన్ని అంగీకరించారు. బాలికలిద్దరిపై అత్యాచారం జరిగిందని, ఊపిరాడకే వారు మరణించారని పోస్టుమార్టమ్ నివేదికలో వెల్లడైంది. నిందితుల్లో చోటూ ఆ బాలికల ఇంటి పక్కనే ఉంటాడని అతని ద్వారా వారికి జునైద్, సుహైల్ పరిచయమయ్యారని పోలీసు కమిషనర్ సంజీవ్ వెల్లడించారు. మరోవైపు ఆ బాలికల తల్లి కథనం మరోలా ఉంది. తమ పొరుగునే ఉంటున్న చోటూ సాయంతో వారు తమ కూతుళ్లను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లారని, అడ్డుకోవడానికి ప్రయత్నించిన తనని కొట్టి మరీ మోటార్ సైకిళ్లపై తీసుకువెళ్లారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కిడ్నాపైన మూడు గంటల తర్వాత ఊరి శివార్లో చెట్టుకు వేళాడుతూ శవమై కనిపించారని చెబుతున్నారు. కానీ పోలీసులు మాత్రం ఆ బాలికలు ఇష్టపూర్వకంగానే వెళ్లారని అంటున్నారు.

మహిళల భద్రత ఏం పడుతుంది: రాహుల్

హత్రాస్ అత్యాచార ఘటన దగ్గర్నుంచి రాష్ట్రంలో ఎన్నో నేరాలు, ఘోరాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. రేపిస్టులను జైళ్ల నుంచి విడుదల చేసే వారి నుంచి మహిళల భద్రత ఎలా ఆశించగలమంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ కేసులో గుజరాత్ ప్రభుత్వం రేపిస్టులని విడుదల చేసిన అంశాన్ని గుర్తు చేస్తూ అలాంటి నేరస్తుల్ని బయటకు తెచ్చి స్వాగత సత్కారాలు చేసే ప్రభుత్వాలు మహిళల భద్రతను ఎందుకు పడుతుందని నిలదీశారు. రాష్ట్రంలో నేరస్తులు జంకు లేకుండా తిరుగుతున్నారని బీఎస్పీ చీఫ్ మాయావతి అన్నారు.

ఉక్రెయిన్ విద్యార్థులకు దేశీయంగా సీట్లు కల్పించలేం

- సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌నుంచి తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులకు దేశీయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించలేమని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఉక్రెయిన్ కళాశాలల అనుమతితో మరో దేశంలో వైద్య విద్య పూర్తి చేయడానికి అవకాశం కల్పిస్తామని తెలిపింది. ఈ మేరకు గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు విచారించింది. ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులను దేశీయ కళాశాలల్లో ప్రవేశం కల్పించడం చట్టపరంగా సాధ్యం కాదని అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది. 'నీట్‌లో తక్కువ మార్కులు రావడంతోనే వారంతా ఉక్రెయిన్ వెళ్లారు. నీట్‌లో తక్కువ మెరిట్ ఉన్న వీరికి ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తే ఆయా కాలేజీల్లో సీట్లు పొందలేకపోయిన అభ్యర్థుల నుంచి పిటిషన్లు వెల్లువెత్తే ప్రమాదముంది. ఉక్రెయిన్ యుద్ధంతో కోర్స్ పూర్తి చేయలేని విద్యార్థుల కోసం సెప్టెంబరు ఆరున నేషనల్ మెడికల్ కమిషన్ జారీ చేసిన పబ్లిక్ నోటీస్‌తో మాకు అభ్యంతరం లేదు. అయితే ఆ నోటీసు వీరికి ఇక్కడి కాలేజీల్లో బ్యాక్ డోర్ ఎంట్రీగా భావించరాదు' అని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'తిరిగొచ్చిన విద్యార్థుల్ని దేశీయ మెడికల్ కాలేజీలకు బదిలీ చేస్తే దేశంలో వైద్య విద్య ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది' అని కేంద్రం పేర్కొంది. ఉక్రెయిన్ నుంచి వచ్చిన వైద్య విద్యార్థులు అకడమిక్ మొబిలిటీ ప్రోగ్రామ్ కింద ఏయే దేశాల్లోని యూనివర్సిటీల్లో వైద్య విద్య పూర్తి చేయొచ్చో తెలిపే జాబితాను గురువారం నేషనల్ మెడికల్ కమిషన్ విడుదల చేసింది. అమెరికా, ఇటలీ, స్పెయిన్, బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, లిథువేనియా, పోలండ్, స్వీడన్, ఈజిప్టు, ఇజ్రాయెల్, గ్రీస్, ఇరాన్, చెక్ రిపబ్లిక్, జార్జియా, కజకిస్తాన్, స్లోవేకియా, హంగేరీ, ఉజ్బెకిస్తాన్, బెలారస్, లాత్వియాల్లో వైద్య విద్య పూర్తి చేయొచ్చని తెలిపింది.

పోలీసులను పాములు కాపాడిన వేళ..

ఇడక్కి(కేరళ): సమాజంలో శాంతిభద్రతలను కాపాడే రక్షక భటులను వానర దండు నుంచి కాపాడేవారే లేరు. తమిళనాడు సరిహద్దు ప్రాంతం వెంట కేరళలోని అటవీప్రాంతంలోని కుంబుమెట్టు పోలీస్ స్టేషన్‌పై కోతుల గుంపులు దూసుకొచ్చి నానా హంగామా చేయడం అక్కడ నిత్యకృత్యమైంది. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే పోలీసులకు తమ సమస్యకు ఎలా చెక్ పెట్టాలో తెలియక తెగ హైరానా పడ్డారు. వీరికి స్థానికంగా యాలకులు సాగు చేసే ఒక రైతు చక్కని ఉపాయం చెప్పి ఆదుకున్నాడు. చైనా తయారీ రబ్బర్ పాములను రంగంలోకి దించారు. కోతుల గుంపులు బీభత్సం సృష్టిస్తున్న పోలీస్‌స్టేషన్ పైకప్పుపై, స్టేషన్ ప్రాంగణంలోని కూరగాయల తోటలో, స్టేషన్ గ్రిల్స్‌కు, చెట్లకు ఇలా పలు చోట్ల రబ్బర్ పాములను ఉంచారు. దీంతో పాములను చూసి హడలిపోయిన కోతులు స్టేషన్ పరిసరాలకు రావడం మానేశాయని పోలీస్‌స్టేషన్ సబ్–ఇన్‌స్పెక్టర్ పీకే లాల్‌భాయ్ ఆనందం వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా స్టేషన్‌ను వేధిస్తున్న ఈ సమస్యకు సర్పాల రూపంలో పరిష్కారం దొరకడం సంతోషకరమని సునీశ్ అనే పోలీసు అన్నారు. అడవి జంతువులను హడలగొట్టేందుకే తమ సాగుభూమిలో అమలుచేస్తున్న చిట్కానే వీరికి చెప్పానని ఉదంబన్‌చోళ తాలూకాకు చెందిన ఒక రైతు వెల్లడించారు.

రాణి తుది వీడ్కోలు ఇలా..

లండన్: రాణి ఎలిజబెత్ మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం లండన్ వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో సోమవారం ఉదయం 6.30 గంటల వరకు ఉంచుతామని బకింగ్‌హామ్ ప్యాలెస్ తెలిపింది. అనంతరం 11 గంటలకు రాణి అధికారిక అంత్యక్రియల కార్యక్రమం ప్రారంభమై దేశవ్యాప్తంగా రెండు నిమిషాలు మౌనం పాటించడంతో ముగుస్తుందని గురువారం వివరించింది. అనంతరం రాణి పార్థివ దేహం ఉంచిన శవపేటికను వెస్ట్‌మినిస్టర్ అబేకు తరలిస్తారు. ఉదయం 8 గంటలకు వెస్ట్‌మినిస్టర్ అబే తలుపులు తెరుస్తారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా వివిధ దేశాధినేతలు, ప్రతినిధులు 500 మంది హాజరవుతారు. రాణి శవపేటికను వెస్ట్ మినిస్టర్ అబే నుంచి విండ్సర్ క్యాజిల్ సమీపంలోని సెయింట్ జార్జ్ చాపెల్ వద్ద జరిగే కార్యక్రమం కోసం తరలిస్తారు. ఇక్కడ సాయంత్రం 4 గంటలకు రాయల్ వాల్ట్‌లోకి శవపేటికను దించుతారు. ఆర్చ్ బిషప్ ఆఫ్ కాంటెర్‌బరీ జస్టిన్ ఆశీర్వచనాల మధ్య అక్కడ చేరిన వారంతా 'గాడ్ సేవ్ ది కింగ్'గీతాన్ని ఆలపిస్తారు. రాత్రి 7.30 గంటలకు జరిగే కార్యక్రమంలో భర్త ఫిలిప్ సమాధి పక్కనే రాణి పార్థివ దేహాన్ని ఖననం చేస్తారు.



రాణికి నివాళులర్పించేందుకు బారులు తీరిన వేలాది మంది జనం

దేశాభివృద్ధి పథంలో అమెరికా కీలకపాత్ర

అమెరికా పార్లమెంట్‌లో ఆజాదీ కా అమృత్ వేడుకలో మోదీ సందేశం


వాషింగ్టన్: వచ్చే పాతికేళ్ల భారత అభివృద్ధి పయనంలో అమెరికా కీలక పాత్ర పోషించగలదని ప్రధాని మోదీ అభిలషించారు. అమెరికా పార్లమెంట్‌లో భారత 75వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు.. ఇరు దేశాల మైత్రీబంధంలో మైలురాయిగా నిలిచిపోవాలని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. వాషింగ్టన్‌లోని యూఎస్ క్యాపిటల్‌లో ఆజాదీ అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని భారతీయ సంతతి అమెరికన్లకు ప్రధాని మోదీ సందేశం పంపారు. ప్రధాని సందేశంలోని ముఖ్యాంశాలు కొన్ని ఆయన మాటల్లో.. 'భారత్ అనే పదం వినగానే ఎన్నో అంశాలు స్ఫురిస్తాయి. అధునాతన ప్రజాస్వామ్య దేశం, భిన్నజాతులు, ప్రాచీన నాగరికతల ఇండియాను ప్రపంచం గుర్తుచేసుకుంటుంది. ఇదే రీతిలో భిన్న అంశాల్లో గ్లోబల్ ఇండియన్‌తో భారత్ మమేకమైంది. వచ్చే పాతికేళ్ల అమృతకాలంలో భారత సుస్థిరాభివృద్ధికి అమెరికా ఎంతగానో సాయపడనుందని భావిస్తున్నా. అమెరికాలో మీరంతా భారత్ తరఫున అత్యద్భుతమైన ప్రతినిధులుగా ఉంటారని ఆశిస్తున్నా' అని మోదీ అన్నారు. యూఎస్ ఇండియా రిలేషన్‌షిప్ కౌన్సిల్, సేవా ఇంటర్నేషనల్, హిందూ స్వయంసేవా సంఘ్, జీఓపీఐఓ సిలికాన్ వ్యాలీ, యూఎస్ ఇండియా ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్, సనాతన్ సంస్కృతి సర్దార్ పటేల్ ఫండ్ తదితర 75 భారతీయ అమెరికన్ సంఘాలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి.

బిహార్‌లో మద్య నిషేధం విఫలం: ప్రశాంత్

పట్నా: బిహార్ ప్రభుత్వం అమలు చేస్తున్న మద్య నిషేధ కార్యక్రమం పూర్తిగా విఫలమైందని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ చెప్పారు. ఈ విధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం నితీశ్‌కు సలహా ఇచ్చినట్లు వెల్లడించారు. నితీశ్‌ను మర్యాదపూర్వకంగానే కలిశానన్నారు. 'రాష్ట్రంలో మహిళల సంక్షేమం కోసమే మద్య నిషేధాన్ని ప్రకటించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే, వాస్తవానికి మహిళలే నిషేధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం కోసం అడ్డదారులు తొక్కి మగవాళ్లు జైలుపాలైతే వారి కోసం మహిళలు కాళ్లరిగేలా స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. పెచ్చుమీరిన అవినీతి కారణంగానే నిషేధం విఫలమైంది. అందుకే గొప్పలకు పోకుండా నిజాయతీగా ఈ విధానంపై సమీక్ష చేపట్టాలని సీఎంను కోరా'అని ఆయన వివరించారు. 'జన్‌సురాజ్' ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలో చేపట్టబోయే 3,500 కిలోమీటర్ల మేర పాదయాత్రకు ఏర్పాట్లను చంపారన్‌లో కిశోర్ సమీక్షించారు.

వెనుకబడిన అన్ని రాష్ట్రాలకు ప్రత్యేక హోదా

- కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం వస్తే ఇచ్చేస్తాం
- బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ హామీ
- ఇన్నాళ్లు బీజేపీతో కలిసి ఉండడం తప్పేనని వెల్లడి



పట్నా: కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం అధికారంలోకివస్తే దేశంలో వెనుకబడిన అన్ని రాష్ట్రాలకు ప్రత్యేక హోదా (స్పెషల్ కేటగిరీ స్టేటస్) కల్పిస్తామని జేడీ(యూ) నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ హామీ ఇచ్చారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం తమకు వస్తే వెనుకబడిన రాష్ట్రాలకు ఈ హోదా దక్కుతుందని, అలా జరగకపోవడానికి కారణమేదీ తనకు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. నితీశ్ గురువారం పాట్నాలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనేయడం దారుణమని బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను దూరం చేయడం తగదని అన్నారు. బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు సుశీల్‌కుమార్ మోదీ, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌పై నితీశ్ విమర్శలు గుప్పించారు. బీజేపీ పెద్దల ఆదేశాలతో వారిద్దరూ తనపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని, బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. బీజేపీతో తాము చాలాకాలం కలిసి ఉండడం తప్పేనని నితీశ్ అంగీకరించారు. ప్రత్యేక హోదా కోసం బిహార్ చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. బిహార్‌ను విభజించడం వల్ల రెవెన్యూ, గనుల ఆదాయం మొత్తం జార్ఖండ్‌కే వెళ్తోందని నితీశ్ కుమార్ చెబుతున్నారు. తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే చాలు కేంద్రంలో ఏ ప్రభుత్వానికైనా మద్దతిస్తామని వివిధ సందర్భాల్లో ప్రకటించారు. బిహార్‌లో నెల రోజుల క్రితమే బీజేపీ కూటమి నుంచి బయటకువచ్చి, ప్రతిపక్షాలతో చేతులు కలిపి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నితీశ్ కేంద్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటీవలే ఢిల్లీలో వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల ప్రధానమంత్రి అభ్యర్థిగా నితీశ్ కుమార్ బరిలోకి దిగుతారని జేడీ(యూ) నాయకులు ఉద్ఘాటిస్తున్నారు.

గోవా సీఎల్పీ విలీనానికి ఆమోదం

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో బెర్తులు!

పణజి: గోవా కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్‌పీ)ను అధికార బీజేపీలోకి విలీనం చేయాలన్న ప్రతిపాదనకు గోవా అసెంబ్లీ స్పీకర్ రమేశ్ ఆమోద ముద్రవేశారు. కాంగ్రెస్‌కు భారీ షాక్ ఇస్తూ బుధవారం ఎనిమిది మంది పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరిన విషయం తెల్సిందే. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం మూడుకు పడిపోయింది. బీజేపీలో కొత్తగా చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తారని వార్తలొచ్చాయి. ఈ వార్తలకు బలం చేకూరుస్తూ, ప్రమాణస్వీకార తేదీల ఖరారు కోసం చర్చించేందుకు గవర్నర్‌తో సీఎంసావంత్ భేటీ అయ్యారని మీడియాలో వార్తలు వినవచ్చాయి. ఈ వార్తలను సీఎం ఖండించారు. మోదీ పుట్టినరోజు వేడుకపై చర్చించానని చెప్పారు.

నేడే ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సు

సమర్‌ఖండ్: ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌ఖండ్ నగరంలో శుక్రవారం ప్రారంభం కానున్న షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత జిన్‌పింగ్ తదితర నేతలు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రాంతీయ భద్రతా సవాళ్లు, వ్యాపార–వాణిజ్యం, ఇంధన సరఫరా వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు. ఎస్సీఓ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ రష్యా అధినేత పుతిన్, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కాత్ మిర్జియోయెవ్‌తోపాటు ఇతర దేశాల నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై, ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అయితే, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అవుతారా? లేదా? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. 2001లో షాంఘైలో ఏర్పాటైన ఎస్సీఓలో చైనా, ఇండియా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, రష్యా, పాకిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సభ్యదేశాలుగా కొనసాగుతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, తైవాన్ జలసంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఉజ్బెకిస్తాన్‌లో ఎస్సీఓ సదస్సు జరుగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. సదస్సులో ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గురువారం ఉజ్బెకిస్తాన్‌కు బయలుదేరడానికి ముందు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



సమర్‌ఖండ్ చేరుకున్న ప్రధాని మోదీ

జిన్‌పింగ్, పుతిన్ సమావేశం

చైనా, రష్యా అధినేతలు షీ జిన్‌పింగ్, పుతిన్ గురువారం సమర్‌ఖండ్‌లో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలైన తర్వాత ఇరువురు నేతలు ముఖాముఖి భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా రష్యాకు జిన్‌పింగ్ మద్దతు ప్రకటించారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తామన్నారు. సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం రాత్రి ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌ఖండ్ సిటీకి చేరుకున్నారు. శుక్రవారం జరిగే సదస్సులో ఆయన పాలుపంచుకుంటారు.

సాక్షి విజయనగరం

శుక్రవారం । 16 । సెప్టెంబర్ । 2022

17,18 తేదీల్లో స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న 34వ అంతర్ జిల్లా ల స్కేటింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంటిరాజు గురువారం తెలిపారు. నగర శివారులోని విజ్జి స్టేడియం ప్రాంగణంలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అక్టోబర్ 24 నుంచి జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఆవుపై పులి పంజా



కొత్తవలస రూరల్: కొత్తవలస మండలం గులివిందాడలో ఆవులమందపై పులి పంజా విసిరింది. గ్రామానికి చెందిన గవర రవణమ్మ ఆవులను మేత కోసం గ్రామ శివారు వెంకన్న చెరువు వద్దకు గురువారం తోలికెళ్లింది. ఓ ఆవుపై పులిదాడిచేసింది. భయాందోళనతో మహిళ గట్టిగా కేకలు వేయడంతో పులి ఆవును విడిచిపెట్టి పారిపోయింది. గ్రామస్తుల సమాచారం మేరకు పులి దాడిచేసిన ప్రాంతాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు.

జిల్లాకు యార్లగడ్డ రాక నేడు

విజయనగరం అర్బన్: రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విజయనగరం జిల్లా కేంద్రంలో శుక్రవారం పర్యటించనున్నారు. ఆయన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుంటారు. జిల్లాలోని పాలన వ్యవహారాల్లో అధికారభాష అమలుపై కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులకు పలు సూచనలు చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సందర్శించి తెలుగుభాష అమలుతీరును పరిశీలిస్తారు. అనంతరం విశాఖ బయలుదేరి వెళ్తారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త జీతాలు

- చెల్లింపునకు ట్రెజరీ ఉద్యోగుల కసరత్తు



జీతాల బిల్లుల తయారీపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కలిగిస్తున్న ఎస్‌టీఓ సురేష్‌కుమార్

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 1న కొత్త వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీతాల చెల్లింపు ప్రక్రియలో ట్రెజరీ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ శాఖలో సంబంధిత ఆర్టీసీ పరిపాలన సిబ్బందితో ఎస్టీఓ ఎస్.సురేష్‌కుమార్ సమీక్షించారు. ఆర్టీసీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన విజయనగరం డిపో, జిల్లా డివిజనల్ మేనేజర్ కార్యాలయం, జోనల్ వర్క్‌షాప్, ఈడీ కార్యాలయాల సిబ్బంది సంఖ్యను సరిచూసుకున్నారు. ప్రతి ఉద్యోగికి కేటాయించిన ఐడీ నంబర్ ఆధారంగా జీతాల బిల్లులు కోడింగ్ చేయడంపై ఆర్టీసీ పరిపాలన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

రాములోరికి బంగారు ఆభరణాలు

- రూ.19.35 లక్షల విలువగల ఆభరణాల బహూకరించిన బొత్స దంపతులు
- బాండును అందజేసిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



దేవస్థాన ఈఓ ప్రసాదరావుకు ఆభరణాల బాండును అందజేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు బంగారు మకరతోరణాలు, ఆభరణాలను సమకూర్చారు. చెన్నై పట్టణంలో రూ.19.35 లక్షల విలువైన సంపూర్ణ కవచాలు, మకర తోరణాలు, ఆభరణాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. సిద్ధమైన వస్తువులన్నీ రామతీర్థం దేవస్థానం అధికారులకు అందజేశారు. గర్భగుడిలో ఉన్న ధృవమూర్తులతో పాటు, వెండి మండపంలో ఉన్న ఉత్సవమూర్తులకు దాతలు సమకూర్చిన బంగారు ఆభరణాలను అర్చకులు త్వరలో అలంకరించనున్నారు. ఆభరణాలకు సంబంధించిన బాండును సీతం కళాశాలలో ఈఓ ప్రసాదరావుకు బొత్స ఝాన్సీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ బొత్స గురునాయుడు, ఈశ్వరమ్మ, మజ్జి రామారావు, కళావతి దంపతుల జ్ఞాపకార్థం బొత్స దంపతులు బంగారు ఆభరణాలను రాములోరికి సమర్పించారని చెప్పారు. మంచి ముహూర్తం ఖరారు చేసి మంత్రి దంపతుల చేతుల మీదుగా ఆభరణాలను స్వామికి అలంకరిస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలకు కొత్త కళ



నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల

- జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- నాడు–నేడు పనుల కింద మౌలిక సదుపాయాల కల్పన
- తల్లిదండ్రుల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

నెల్లిమర్ల:

మనబడి నాడు–నేడు పథకం కింద ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ప్రభుత్వం రెండో విడతలో జూనియర్ కళాశాలల అభివృద్ధికి పూనుకుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరుచేసింది. మొత్తం 18 కళాశాలలుండగా వాటిలో సొంత భవనాల్లేని దత్తిరాజేరు కళాశాల మినహా మిగిలిన 17 కళాశాలలకు రూ 11.8 కోట్లు కేటాయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నిధులతో ఆయా కళాశాలల్లో రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగు నీటిని అందించే వాటర్ ప్లాంట్లు, కళాశాల క్యాంపస్ అంతటికీ పెయింటింగ్స్, విద్యుదీకరణ, తరగతి గదులకు అవసరమైన ఫర్నీచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, అదనపు భవనాలు, ప్రహరీల నిర్మాణం తదితర పనులు చేపట్టనుంది. పాఠశాలల వలే జూనియర్ కళాశాలలను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

చకచకా శంకుస్థాపనలు...

ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్న సర్కారు... ఆయా పాఠశాలలు, కళాశాలలకు కొత్త హంగులు అద్దుతోంది. దీనికోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. పేద కుటుంబాల పిల్లలు ఆహ్లాదకర వాతావరణంలో చదువులు సాగించేలా ప్రభుత్వ విద్యాలయాలను ముస్తాబుచేస్తోంది. నిధులు మంజూరు కావడంతో పనుల శంకుస్థాపనలు జిల్లాలో చకచకా సాగుతున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పనులన్నీ పూర్తిచేసుకుని, అన్ని హంగులతో కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి.

తల్లిదండ్రుల కమిటీల పర్యవేక్షణలో పనులు

కళాశాలల్లో నాడు–నేడు అభివృద్ధి పనులు అభివృద్ధి కమిటీల పర్యవేక్షణలో సాగనున్నాయి. పనుల నిర్వహణ కోసం ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా విద్యార్థుల తల్లిదండ్రులతో మొత్తం 8 మంది సభ్యులతో కళాశాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలి. ఇద్దరు విద్యార్థుల తల్లులు, ఒక విద్యార్థి తండ్రి, క్రియాశీలకంగా ఉండే ఇద్దరు అధ్యాపకులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్, ఇంజనీర్‌తో పాటు దాతలు ఎవరైనా ఉంటే కమిటీ సభ్యులుగా ఉంటారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంలో అభివృద్ధి కమిటీలు పనులు చేపట్టాల్సి ఉంటుంది. కమిటీ సభ్యుల పేరుతో జాయింట్ బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. చెక్కుల ద్వారానే బిల్లులు చెల్లించాలి. చెక్కులపై ప్రిన్సిపాల్‌తో పాటు మిగిలిన ఏడుగురు సభ్యుల సంతకాలు తప్పనిసరి. నాడు–నేడు కార్యక్రమంలో వినియోగించే మెటీరియల్ కనీసం 75 ఏళ్ల పాటు మన్నికతో ఉండేలా చర్యలు తీసుకోవాలి. పనులన్నీ ఏప్రిల్–2023 నాటికి పూర్తిచేయాలి.

విజయనగరం జిల్లాలో పనులు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల సంఖ్య: **18**

నాడు–నేడు పనులకు ఎంపికైనవి: **17**

ప్రభుత్వం మంజూరుచేసిన నిధులు: రూ **11.81** కోట్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు–నేడు పనులకు నిధులు మంజూరు ఇలా...

కళాశాల	మంజూరైన నిధులు
రాజాం	రూ 1.07 కోట్లు
రాజాం (బాలికలు)	రూ 57.7 లక్షలు
సంతకవిటి	రూ.83.5 లక్షలు
పూసపాటిరేగ	రూ.49.6 లక్షలు
డెంకాడ	రూ.31.25 లక్షలు
చీపురుపల్లి	రూ.85.8 లక్షలు
వేపాడ	రూ.37.8లక్షలు
బాడంగి	రూ.94.4 లక్షలు
గుర్ల	రూ.62.6 లక్షలు
నెల్లిమర్ల	రూ.80.7 లక్షలు
గజపతినగరం	రూ.71.7 లక్షలు
కొత్తవలస	రూ 55.7లక్షలు
గంట్యాడ	రూ.41.7 లక్షలు
విజయనగరం	రూ.66.9 లక్షలు
వంగర	రూ.85.4 లక్షలు
మెరకముడిదాం	రూ.33 లక్షలు
ఎస్.కోట	రూ.1.36 కోట్లు



చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.85.8 లక్షలతో చేపట్టనున్న నాడు–నేడు పనులకు గురువారం శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నాడు–నేడుతో కళాశాలల అభివృద్ధి

"జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా సొంత భవనాల్లేని దత్తిరాజేరు మినహా మిగిలిన 17 కళాశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాడు–నేడు రెండో ఫేజ్ కింద పనులు చేసేందుకు రూ.11.81 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో కళాశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలోనే పనులన్నీ చేపడతాం. – ఆర్.సురేష్‌కుమార్, డీవీఈఓ(ఎఫ్ఏసీ)

రాష్ట్రస్థాయి శాస్త్రీయ సంగీత, నృత్యపోటీలు

- మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి



విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి శాస్త్రీయ సంగీత, నృత్య పోటీలను నిర్వహించనున్నట్టు మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ ప్రసన్నకుమారి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె గురువారం మాట్లాడారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు అక్టోబర్ 9, 10, 11 తేదీల్లో జరగనున్న విజయనగర ఉత్సవాలు సందర్భంగా జూనియర్, సీనియర్ విభాగాల్లో శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యపోటీలను నిర్వహిస్తామని చెప్పారు. 10–20 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు జూనియర్స్‌గా, 21–40 ఏళ్ల మధ్య వయసున్న వారు సీనియర్స్‌గా పరిగణించబడతారన్నారు. ఒక్కో అభ్యర్థి ప్రదర్శనకు 10 నిమిషాల సమయం ఇస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి క్వార్టర్ ఫైనల్స్ వరకూ పోటీలు ఈ నెల 26న ఉదయం 9 గంటలకు మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రాజమండ్రి, విజయవాడ, కర్నూల్, నెల్లూరు, గుంటూరులోని సంగీత, నృత్యకళాశాలల్లో ఆయా జిల్లాలకు సంబంధించి క్వార్టర్‌ఫైనల్ పోటీలను నిర్వహిస్తారన్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో అర్హత పొందిన వారందరికీ తమ కళాశాలలో 29న సెమీ ఫైనల్స్, 30న ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 24లోగా తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు. వివరాలకు 08922–223751 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

లక్ష యూనిట్ల రక్తం సేకరణకు చర్యలు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాణి సంయుక్త, తదితరులు

- అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణి సంయుక్త

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో లక్ష యూనిట్ల రక్త సేకరణే లక్ష్యంగా ఈ నెల 17వ తేదీన జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాణిసంయుక్త తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని తొమ్మి రక్తనిధి కేంద్రాల సహాయంతో జిల్లా వ్యాప్తంగా 40 రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఒక్కోశిబిరం నుంచి కనీసం రెండువేల యూనిట్ల రక్తం సేకరించాలన్నది లక్ష్యమన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం అక్టోబర్ ఒకటో తేదీ వరకు రక్తదాన శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. మెగా రక్తదాన శిబిరంలో రక్తదానంచేసేవారు ఇ–రక్తకోష్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని కోరారు.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, సచివాలయ ఉద్యోగులు, యువేత, సామాజిక సంస్థల ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన శిబిరాల నిర్వహణకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ సెంటర్ల జిల్లా సూపర్‌వైజర్ నూక సాక్షి గోపాలరావు, పి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భీమాళి మామిడి తాండ్రకు మంచి గిరాకీ

- ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేయాలని సూచించిన కేంద్ర బృందం



భీమాళిలో తాండ్ర స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

లక్కవరపుకోట: మండలంలోని భీమాళి గ్రామంలో తయారుచేసే మామిడి తాండ్రకు మంచి గిరాకీ ఉందని, కొనుగోలు దారులను ఆకర్షించేలా ప్యాకింగ్ చేయాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యులు రాజు సరస్వత్, విజత్ ప్రకాష్‌భట్‌లు సూచించారు. భీమాళిలో మామిడి తాండ్ర తయారీ యూనిట్‌ను గురువారం సందర్శించారు. తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. పరిశ్రమ నిర్వహణకు బ్యాంకు రుణాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. మామిడి తాండ్రకు దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉందన్నారు. మరింత నాణ్యతగా తయారు చేయాలని తయారీదారులకు సూచించారు. గ్రామంలోని 80 శాతం మంది తాండ్ర తయారీ, విక్రయాలతో జీవనం సాగిస్తున్నామని, నిల్వ చేసేందుకు సరైన కోల్డుస్టోరేజ్ లేకపోవడంతో నష్టపోతున్నామని కేంద్ర బృందానికి వివరించారు. కోల్డుస్టోరేజీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని కేంద్ర బృందం పరిశీలించింది. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్, జిల్లా ఉద్యానవనశాఖ డీడీ జమదగ్ని, ఎంపీడీఓ కె.రూపేష్, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రాజధానికి టీడీపీ అనుకూలమా? కాదా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ఉత్తరాంధ్ర టీడీపీ నేతలు బహిరంగంగా వెల్లడించాలి
- ఉత్తరాంధ్రుల నాశనం కోరుతూ అమరావతి పెట్టుబడిదారుల దండయాత్ర
- చంద్రబాబూ.. ఉత్తరాంధ్ర ప్రజలు ఏం పాపం చేశారు..
- అభివృద్ధిపై అయ్యన్న మాటలు విడ్డూరం
- అశోక్‌గజపతిని అడగండి.. అభివృద్ధి ఏమిటో చెబుతారు..
- ఎవరి హయాంలో ఎంతెంత అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: విశాఖపట్టణంలో పరిపాలన రాజధాని ఏర్పాటుకు విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అనుకూలమో?కాదో? బహిరంగంగా వెల్లడించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చీపురుపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరిపోస్తున్నారన్నారు. విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పడితే ఉత్తరాంధ్ర అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అయితే, ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు, ఉత్తరాంధ్ర ప్రజలపై విషం చిమ్మేందుకు అమరావతి పెట్టుబడిదారులు చంద్రబాబునాయుడు ముసుగులో దండయాత్రకు దిగుతున్నారని వాపోయారు. ఈ ప్రాంత టీడీపీ నేతలు చంద్రబాబునాయుడు ఉచ్చులో పడొద్దని, గతంలో కూడా చంద్రబాబు ఉత్తరాంధ్రకు మోసం చేశారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఏం పాపం చేసారో చెప్పాలని, ఉత్తరాంధ్ర ప్రజలు, యువత, పిల్లలు ఎదగకూడదా, ఇంగ్లిష్ చదువులు చదువుకోకూడదా, విమానాలు ఎక్కి పెద్ద ఉద్యోగాలు చేయకూడదా అంటూ చంద్రబాబునాయుడిని ప్రశ్నించారు. సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన విశాఖలో ఎన్నో వనరులు ఉన్నాయని, వాటి ఆధారంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాలో ఉండే రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, యువత, పెద్దలు, పత్రికా సంఘాలు పరిపాలన రాజధాని కోసం మద్దతు పలికి ఉత్తరాంధ్ర అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని కోరారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం..

విజయనగరం జిల్లాలో అభివృద్ధిపై నర్సీపట్నం నుంచి వచ్చిన అయ్యన్నపాత్రుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో జరిగిన అభివృద్ధిపై ఆయన పక్కనే మౌనంగా కూర్చుని ఉన్న అశోక్‌గజపతిరాజును అడిగితే బాగుంటుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, టీడీపీ నేత అశోక్‌గజపతిరాజుల పరిపాలనలో ఎంతెంత అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని, టీడీపీ నేతలు సిద్ధమైతే సమయం, వేదిక చెప్పాలని సవాల్ విసిరారు. జిల్లా ప్రజల ఓట్లతో గెలిచి రాష్ట్ర, కేంద్ర మంత్రుల పదవులు పొందిన అశోక్‌గజపతిరాజు జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు తెచ్చారా, కనీసం ఒక్క విద్యా సంస్థ ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. మాన్సాస్ చైర్మన్‌గా ఉంటూ జిల్లాకు వైద్య కళాశాల వద్దని లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఘనత అశోక్‌గజపతిదేనన్నారు. గుర్లలో ఉన్న అతిచిన్న ఆయకట్టు రిజర్వాయర్ గడిగెడ్డ నుంచి విజయనగరం నియోజకవర్గ ప్రజలకు తాగునీరు తీసుకొస్తానని మాయమాటలు చెప్పి మోసం చేశారని ఎద్దేవా చేశారు. జిల్లాలో తోటపల్లి, జంఝావతి, ఆండ్ర, పెద్దగడ్డ వంటి ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా, బొత్స సత్యనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో నిర్మితమయ్యాయన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, శ్రీకాకుళం జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

18న ఉద్యోగ మేళా

విజయనగరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియట్ విద్యామండలి, ఏపీఐటీఏ, హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజులరేగ సమీపంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఉద్యోగ మేళాకు 2020–21, 2021–22 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో 60 శాతం మార్కులతో పాటు గణితంలో 60 శాతం మార్కులు సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ఏడాది పాటు ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేస్తారని, అనంతరం ఉద్యోగం కల్పిస్తారన్నారు. బిట్స్ పిలానీ, అమిట్ వంటి యూనివర్సిటీల్లో ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ 94411 09636, 63015 74739 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్రగాయాలు


బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు బహ్మాజీ

బాడంగి: మండలంలోని పిన్నవలస–బాడంగి జంక్షన్ సమీపంలో కోళ్లఫారం వద్ద గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో దత్తిరాజేరు మండలం శికారుగంజికి చెందిన బ్రహ్మాజీ తీవ్ర గాయాలపాలై స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్సపొంది మెరుగైన వైద్యంకోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి క్షతగాత్రుడి భార్య అనురాధ, తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మాజీ అత్తయ్య సింహాచలం ఆరోగ్య పరిస్థితి బాగోలేక స్థానిక ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతోంది. ఆమెకు సపర్యల నిమిత్తం కుమార్తె తల్లి దగ్గర ఉంది. వారిద్దరికీ మధ్యాహ్న భోజనం తీసుకువస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై బ్రహ్మాజీ వస్తుండగా వాహనం అదుపుతప్పి పడిపోగా మెడ, వెన్నుభాగం బాగా దెబ్బతిని కోమాలోకి చేరుకున్నాడు. దీంతో బాడంగిలో వైద్యులు ప్రథమచికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఇద్దరు ముద్దాయిలకు ఏడాది జైలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్లో నమోదైన ఇసుక అక్రమ రవాణా కేసులో తాడంగి బాబూరావు, బిడ్డిక విజయ్ కుమార్ అనే ఇద్దరు ముద్దాయిలకు ఒక సంవత్సరం జైలుశిక్ష విధిస్తూ కురుపాం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు గురువారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు ఎస్సై షన్ముఖరావు తెలిపారు. ముద్దాయిలకు జైలుశిక్షతో పాటు రూ.ఐదు వేలు చొప్పున జరిమానా కూడా విధించినట్లు చెప్పారు.

దాడి కేసు నమోదు


కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన యువకుడు సామాదుల ప్రశాంత్‌పై అదే కాలనీకి చెందిన మరో యువకుడు మాడుగుల అప్పలరాజు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై బి.మురళి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రిక్షాకాలనీలో ఇంటి బయట వంటపాత్రలు తోముతుండగా ఎదురింట్లో ఉన్న అప్పలరాజు అసభ్య పదజాలంతో కామెంట్ చేశాడని, సామాదుల ప్రశాంత్ భార్య సంధ్య భర్తకు బుధవారం చెప్పింది. దీంతో ఎదురింట్లో ఉన్న అప్పలరాజు దగ్గరికి ప్రశాంత్ వెళ్లి తన భార్యను ఎందుకు అసభ్యకరంగా మాట్లాడావని ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా అక్కడినుంచి నెట్టివేసి వెళ్లిపోయాడు. కొంతసేపటి తరువాత సాయంత్రం చీకటి పడ్డాక ప్రశాంత్ ఇంటి ముందర స్నానం చేస్తుండగా అప్పలరాజు కత్తి పట్టుకుని వచ్చి, ప్రశాంత్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో ఎడమవైపు తల, ఎడమచెవి వెనుక, ఎడమ దవడ, తలవెనుక భాగాన తీవ్రంగా గాయాలవడంతో కుటుబసభ్యులు ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మమ్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం చినబొండికి గ్రామానికి చెందిన కద్రక పద్మమ్మ పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పద్మమ్మకు పెళ్లయి 22సంవత్సరాలైంది. భార్యాభర్తలు అత్తమామలతో కలిసి ఉంటున్నారు. మామ కద్రక రౌతు రోజూ ఏదో ఒక నెపంతో ఆమెను తిడుతూ ఉంటాడు. దీంతో మనస్తాపం చెందిన పద్మమ్మ ఇంట్లో ఉన్న పురుగుమందు తాగేసింది. ఈ విషయం గమనించిన భర్త 108వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి ఆమెను తరలించగా చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క్యా. 10గ్రా.)	51,000–00
బంగారం(22క్యా. 10గ్రా.)	46,750–00
వెండి (కిలో)	60,400–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹ 280

ఇంజినీర్ల చేతిలోనే నవ సమాజ నిర్మాణం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- మోక్షంగుండం విశ్వేశ్వరయ్యకు ఘనంగా నివాళి


రక్తదానం చేస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ కృష్ణాజీ


ఇంజినీరింగ్ సిబ్బందిని సత్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్ తదితరులు

విజయనగరం గంటస్తంభం: ఇంజినీర్లే నవ సమాజ నిర్మాతలని, వారి చేతుల్లోనే భావి సమాజ నిర్మాణం ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భారతరత్న మోక్షంగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే వేడుకలు జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఇంజినీరింగ్ అధికారులు నివాళర్పించారు. అనంతరం జెడ్పీ సమావేశ భవనంలో ఇంజినీర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రక్తదానం చేశారు. అంతకుముందు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి జెడ్పీ చైర్మన్ నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన అంకితభావం, దూరదృష్టి ఇంజినీర్లకు ఆదర్శమన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఇంజినీరింగ్ అధికారులు సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ జి.ఆర్.గుప్త, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయశ్రీ, ట్రాన్స్ కో ఎస్ఈ బి.కోటేశ్వరరావు, జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: సమాజ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ఇంజినీర్ల సేవలు కీలకమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అభిప్రాయ పడ్డారు. పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన ఇంజినీర్స్ డే వేడుకలలో కలెక్టర్ నిషాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలదండవేసి నివాళులు అర్పించారు. అనంతరం సమాజ అభివృద్ధిలో భాగస్వాములైన ఇంజినీర్స్ అందరికీ ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు, నీతి, ప్రపంచ ఖ్యాతి పొందాయని, ఆయనను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్వీసులో విశేష సేవలందించిన విశ్రాంత ఇంజినీర్లు విజయకుమార్, లక్ష్మణరావులను ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన డిప్యూటీ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు , టెక్నికల్ అసిస్టెంట్లకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఇంజినీర్స్ డే వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీజీ కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకరరావు, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, గృహనిర్మాణ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన ఇంజినీర్లు పాల్గొనారు.

జేఎన్‌టీయూ జీవీలో..

విజయనగరం అర్బన్: భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య 162వ జయంతి వేడుకలను పురస్కరించుకుని స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనరం యూనివర్శిటీలో ఇంజినీర్స్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ విభాగం డీఈ పి.రమణ ప్రభాత్ మాట్లాడుతూ ఇంజినీర్లు ప్రొఫెషనల్‌గానే కాకుండా సోషల్ యాక్టివిటీస్‌లో కూడా పాల్గొనాలని కోరారు. ఎన్నో అద్భుత ప్రాజెక్టుల నిర్మాణంలో తన వంతు సేవలందించి దేశాభివృద్ధికి కృషి చేశారని ప్రశంసించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజినీరింగ్ వ్యవస్థ కీలకంగా నిలుస్తుందని అన్నారు. విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు సత్కరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 76వేల పశువులకు టీకాలు

- పశువుల్లో లంపి వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు
- పశు సంవర్ధక శాఖాధికారి వైవీ రమణ


రామతీర్థంలో లంపి వ్యాధి సోకిన పశువును పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వైవీ రమణ

నెల్లిమర్ల రూరల్: జిల్లా వ్యాప్తంగా పశువులకు సోకుతున్న లంపి వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వైవీ రమణ తెలిపారు. మండలంలోని రామతీర్థం, కొండవెలగాడ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించి పశువుల నుంచి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లంపి వ్యాధిని నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా 76వేల పశువులకు టీకాలు వేశామని, మిగిలిన పశువులకు టీకాలు వేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పశువుల చర్మంపై వాపులు, బొడిపెలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది ప్రత్యేక చొరవ చూపించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యాధి సోకిన పశువులను వేరు చేసి ఆరోగ్యవంతమైన పశువులతో కలవకుండా రైతులు చూసుకోవాలని హితవు పలికారు. జోరీగలు, గోమార్లు, గొడుసులు, దోమలు వంటి కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందని వాటిని నివారించే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు గ్రామాల్లోనూ 30 నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ చక్రవర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని 15 గొర్రెల మృతి

- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు


అంతర్రాష్ట్ర రహదారిపై మృతిచెందిన గొర్రెలు

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై గొర్రెలను మేతకు తీసుకు వెళ్తుండగా రాయగడ నుంచి వస్తున్న ఓ లారీ వేగంగా దూసుకు పోవడంతో మందలోని 15 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు లారీ వేగానికి గొర్రెల కళేబరాలు నుజ్జునుజ్జయి ఆ ప్రాంతమంతా రక్తం నిండి ఉంది. మృతి చెందిన గొర్రెలను పిట్ట తవుడు, గుడుపూరు పెంటయ్యలవిగా గుర్తించారు. గ్రామ సమీపంలో ప్రమాదం జరగడంతో గ్రామస్తులు అంతా రోడ్డుపైకి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్సై జగదీష్‌నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేయడంతో పాటు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మృతి చెందిన గొర్రెల యజమానులకు నష్టపరిహారం ఇచ్చేందుకు లారీ డ్రైవర్ అంగీకరించడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

నాటుబండిని ఢీకొన్న లారీ: ఎద్దుమృతి, వ్యక్తికి గాయాలు



సంఘటనాస్థలంలో మృతిచెందిన ఎద్దు, (ఇన్‌సెట్లో) క్షతగాత్రుడిని తరలిస్తున్న 108 సిబ్బంది

సీతానగరం: మండలంలోని రాష్ట్రీయ రహదారిలో కాశీపేట–చినభోగిలి గ్రామాల మధ్య సోమవారం జరిగిన ప్రమాదంలో ఎద్దు మృతి చెందగా ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పణుకుపేట గ్రామానికి చెందిన పి. సింహాచలం సువర్ణముఖి నదిలో ఇసుక లోడుచేసి తరలించడానికి నాటు బండితో స్వగ్రామం నుంచి సీతానగరం రేవుకు వస్తున్నాడు. ఆదేసమయంలో వెనుకగా బొబ్బిలి నుంచి పార్వతీపురం వస్తున్న లారీ కాశీపేట–చినభోగిలి గ్రామాల మధ్య ఢీకొనడంతో నాటుబండితో వస్తున్న రైతు సింహాచలం గాయాలపాలయ్యాడు. నాటుబండి లాగుతున్న ఓ ఎద్దు మృతి చెందగా మరోఎద్దు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాయాల పాలైన సింహాచలాన్ని చికిత్స నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి 108 సిబ్బంది తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. క్షతగాత్రుడు సింహాచలం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ సాంబమూర్తి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా జాబ్ మేళా


జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం మెగా జాబ్‌మేళాను శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. జాబ్ మేళాలో సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, సినాఫిక్ట్ ల్యాబ్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ కార్డ్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, అవంటెల్ లిమిటెడ్, ఓపీమమ్‌లాబ్స్, శ్రీ రంగమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో, ఎస్‌టీఎస్, హెల్త్‌మేనేజ్‌మెంట్, రసపూర్ణఫుడ్స్ ప్రైవేట్‌లిమిటెడ్, బాల్‌బెవరేజ్ ప్యాకింగ్ (ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్ వంటి 13 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయి కుమార్ చెప్పారు. 775 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారని వివరించారు. కంపెనీలు ట్రైనీ ఉద్యోగుల నుంచి ఫార్మసిస్ట్, ఎగ్జిక్యూటివ్, తదితర ఉద్యోగాలలో నియామకాలు చేపట్టనున్నాయన్నారు. రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వేతనాలు లభించే ఉద్యోగాలున్నాయని పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సుగల పురుషులు, మహిళలు జాబ్ మేళాకు అర్హులని చెప్పారు.10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఇందుకు అర్హులని ఆయనన్నారు. ఉద్యోగాలు విశాఖపట్నం హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించాలని ఆయన సూచించారు. అర్హత ,ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 6305110947, 9700569561, 8555909899, 9703696328 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని మన్యం జిల్లా నిరుద్యోగయువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా భూ కమతాల గణన


బాడంగిలో మాట్లాడుతున్న జిల్లా ఉపగణాంకాధికారి వేణునాయుడు

బాడంగి: భూ కమతాల గణన పారదర్శకంగా చేపట్టాలని అప్పుడే అర్హులైన వారికి పథకాలు అందుతాయని విజయనగరం జిల్లా ఉపగణాంక అధికారి డి.వేణు గోపాలనాయుడు అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో 11వ కమతాల గణనపై వీఆర్‌ఓలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి ఈ గణన జరుగుతుందని దీని ద్వారా జాతీయ స్థాయిలో పథకాల అమలు కోసం కొలమానంగా తీసుకుంటారన్నారు. గతంలో జరిగిన సర్వేకు ఇప్పటికి మార్పులు, చేర్పుల తేడాలను పరిగణనలోకి తీసుకుంటారన్నారు. కమతాల పరిమాణం పెరిగితే ఆర్థికస్థితి పెరిగినట్టు తగ్గితే ఎందుకు తగ్గిందో కమతాల గణనలో పొందు పరచాలని దీనినిబట్టే పంటదిగుబడులు అమ్ముకునే సౌకర్యం, వ్యవసాయ పనిముట్లు, ఎరువుల కేటాయింపు, ఎగుమతులు, దిగుమతులు ఉంటాయన్నారు. ఈసర్వేపై ఎవ్వరికీ లీగల్ పరంగా హక్కులేదని. దీన్ని ఆధారంగా ఎవరు కోర్టుకువెళ్లినా చెల్లదన్నారు. కుంటుంబంలో ఎందరికి భూములున్నప్పటికీ ఒకే కమతంగా పిలుస్తామన్నారు. వీఆర్‌ఓలకు కేటాయించిన గ్రామాలు మాత్రమే ఆన్‌లైన్‌లో ఓపెన్ అయి సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో ఆయనతోపాటు తహసీల్దార్ బాలమురళీకృష్ణ, హెచ్‌డీటీ చిన్నారావు, ఏఎస్ఓ రజని, ఎంఆర్ఐ శివశంకర్, వీఆర్‌ఒలు పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో పలువురి మృతి

విజయనగరం జిల్లాలో జరిగిన వేర్వేరు సంఘటనలలో పలువురు గురువారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి.


చికిత్స పొందుతూ మృతి చెందిన సీతంనాయుడు

బాడంగి: మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన గొట్టాపు సీతంనాయుడు (48) విజయనగరం ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి చనిపోయినట్లు ఎస్సై అర్.జయంతి చెప్పారు. ఈ విషయమై ఆయన భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నాలుగేళ్లక్రితం జరిగిన ప్రమాదం వల్ల సీతంనాయుడు పనిపాటు చేయలేక పిల్లల్ని చదివించే ఆర్థిక స్తోమతలేక మంచంపై ఉండడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం పురుగు మందు తాగేశాడు. హుటాహుటిన కుటుంబసభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయనగరం తరలించారని చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

దత్తిరాజేరు: మండలంలోని ఎస్ బూర్జవలస పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వద్ద లారీ వెనుక టైర్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ గురువారం తెలిపారు. గడిచిన ఐదు నెలలుగా మతిస్థిమితం లేని వ్యక్తి ఇక్కడి పరిసర ప్రాంతాలలో తిరుగుతూ బొబ్బిలి నుంచి వైజాగ్ వెళ్తున్న లారీ(కంటైనర్) కింద పడి మృతి చెందినట్లు తెలిపారు.

రైలుఢీకొని యువకుడు..


పదనాపు జగదీష్(ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని పాతరైల్వేట్రాక్ (ఫ్లెటైవర్) సమీపంలో గురువారం రైలుఢీకొని పార్వతీపురం మన్యంజిల్లా పాచిపెంట మండలం తోటపాలెం గ్రామానికి చెందిన పదనాపు జగదీష్(24) మృతిచెందాడు.ఈ ప్రమాదంపై రైల్వే ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తల్లి చిన్నతనంలోనే మృతిచెందడంతో పెద్దమ్మ రూపవతి వద్ద పెరిగిన జగదీష్ హైదరాబాద్‌లో పనిచేసుకుంటున్నాడు. ఇటీవల గ్రామంలో వినాయకచవితి సంబరాలకు హాజరై హైదరాబాద్‌కు తిరుగుప్రయాణంలో బొబ్బిలిలో ఆగి కాలకృత్యాలు తీర్చుకునే నిమిత్తం ట్రాక్ దాటుతుండగా, రైలుఢీకొని మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

జిందాల్‌లో కార్మికుడు..


సరపురపు రాంబాబు (ఫైల్)

కొత్తవలస రూరల్: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీలో గల జిందాల్ హిస్సార్ లిమిటెడ్‌లో విధి నిర్వహణలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు గురువారం మృతి చెందాడు. కంపెనీ హెచ్‌ఆర్ గోపాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన సిరపురపు రాంబాబు (51) కర్మాగారాంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోవడంతో కొత్తవలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి పరీక్షలు నిర్వహించి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి కుటుంబానికి అండగా వైఎస్ఆర్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో పరిశ్రమ యాజమాన్యంతో జరిగిన చర్చలలో మృతుని కుటుంబానికి రూ.10 లక్షల నగదు, కుటుంబంలో ఒకరికి కర్మాగారంలో పని, న్యాయబద్ధంగా అందించాల్సినవి అందించేందుకు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో షిఫ్ట్ ఆపరేటర్..


ప్రమాదంలో మృతిచెందిన సంజీవరావు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బొబ్బిలి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ శంబంగి సంజీవరావు (44) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. సంజీవరావు కుటుంబం రాజాంలోని వస్త్రపురి కాలనీ సమీపంలోని బాలాజీనగర్‌లో నివసిస్తోంది. ఆయన బొబ్బిలి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పట్టణంలోకి వచ్చిన ఆయన తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్కెట్ యార్డు సమీపంలో ఎదురుగా రాజాం వైపు వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన సంజీవరావుపై వెనుక నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న ట్రాక్టర్ వెళ్లడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు స్పందించి 108 ద్వారా రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రమణి, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో జారిపడి యువకుడు..


వెంకటేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

రేగిడి: మండలంలోని ఏవీపురంలో జరిగిన ఓ శుభకార్యక్రమానికి వచ్చిన యువకుడు కాలువలో జారిపడి మృతి చెందాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై రేగిడి పోలీసులు, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన చెరుకూరి వెంకటేష్(19) ఏవీపురంలోని బంధువుల ఇంటికి శుభ కార్యక్రమం నిమిత్తం ఈనెల 13న తల్లిదండ్రులతో వచ్చాడు. ఈ నెల14న మరుభూమికి వెళ్తానని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో తగరపువలస వెళ్లి ఉంటాడని భావించిన తల్లిదండ్రులు కూడా వెళ్లిపోయారు. అయితే వెంకటేష్ అక్కడ లేకపోవడంతో ఇక్కడివారికి సమాచారం ఇచ్చారు. దీంతో ఏవీపురం గ్రామానికి చెందిన బంధువులు వెతకడం ప్రారంభించగా, గురువారం కాలువలో మృతదేహం ఉన్నట్లు కొంతమంది గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించారు. దీంతో వారు రేగిడి పోలీసులకు తెలియజేయగా ఎస్సై శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కాలువలోని మృతదేహాన్ని బయటకు తీయించగా చెరుకూరి వెంకటేష్‌గా బంధువులు గుర్తించి, మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంకటేష్ తండ్రి బంగారుశెట్టి ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదుచేసి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించారు. కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం శుభ్రంచేసుకునేందుకు కాలువలో దిగుతుండగా ప్రమాదం జరిగి ఉంటుందని ఎస్సై అభిప్రాయ పడ్డారు. వెంకటేష్ మానసిక స్థితి కూడా ఒక్కోసారి బాగోదని కుటుంబసభ్యులు చెప్పినట్లు మీడియాకు ఎస్సై వివరించారు.

క్లుప్తంగా

అవార్డుగ్రహీతలకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తిరుపతి నాయుడు, తదితరులు

నెల్లిమర్ల: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ప్రభుత్వ డైట్ అధ్యాపకుడు దత్తి అప్పలనాయుడు, మోడల్ పాఠశాల హెచ్ఎం ఎ. గోవిందరావును గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. తిరుపతినాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు ఇరువురికీ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు, స్టాఫ్ సెక్రటరీ డి. ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల తనిఖీ



దత్తిరాజేరు మండలం కేకే వలస జ్యోతిరావు పూలే బాలుర గురుకులంలో విద్యుత్ కనెక్షన్ తనిఖీ చేస్తున్న జూనియర్ లైన్‌మన్

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ కేంద్రాలు, వసతిగృహాల్లో ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారులు విద్యుత్ కనెక్షన్లను గురువారం తనిఖీ చేశారు. లూజ్ కనెక్షన్లు, వేలాడే తీగెలను సిబ్బంది సరిచేశారు. భోగాపురం కేజీబీవీలో బుధవారం జరిగిన విద్యుత్ షాక్ సంఘటన దృష్ట్యా కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు సిబ్బంది తనిఖీలు చేపట్టి సమస్యలు పరిష్కరించారు.

కేజీబీవీ, మోడల్ స్కూల్ పరిశీలన



అక్కివరం మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎంపీడీఓ స్వరూపారాణి

డెంకాడ: అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఏపీ మోడల్ స్కూల్, మోపాడలోని కేజీబీవీలను ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి గురువారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ఉన్న అసౌకర్యాలు, విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు.

పంచరంగుల ఆహారం మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు తెలుపు, పసుపు, ఆకుపచ్చ, ఎరుపు, గోధుమ రంగు (పంచరంగులు) ఆహారం ప్రతి రోజూ తిని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా 30వ సచివాలయంలో తల్లుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మనం తినే ఆహారం శరీరంలోని రక్తంలో కలవాలి కాబట్టి విటమిన్ సి కలిగిన జామ, ఉసిరి తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో భాగ్య, సచివాలయ సిబ్బంది భారతి, సతీష్ , ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



విద్యార్థులు రూపొందించిన అంబేడ్కర్ చిత్రం

పూసపాటిరేగ: చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస ఆచార్య అన్నారు. మండలంలోని కొప్పెర్ల అంబేడ్కర్ గురుకులంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ ఆకృతిలో చిత్రాన్ని విద్యార్థులు కూరగాయలతో రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు క్రమపద్ధతిలో ఆహారం తీసుకోవాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ ప్రతినిధి రమణమ్మతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగించుకుంటే... ఉపయోగం..!



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల మీ సేవా భవనం

- నిరుపయోగంగా కార్పొరేషన్ భవనాలు
- గతంలో మీ సేవల నిర్వహణ కోసం రూ.30 లక్షలతో 3 భవనాలు నిర్మాణం
- 2020 నుంచి సేవలు నిలిపివేయడంతో నిరుపయోగంగా మారిన వైనం
- సచివాలయ నిర్వహణకు భవనాలు కేటాయిస్తే ప్రయోజనం



రింగ్‌రోడ్ మీ సేవా కేంద్రం పరిస్థితి ఇలా..

విజయనగరం: విలువైన కార్పొరేషన్ ఆస్తులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఏడాది కాలంగా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న భవనాల్లో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. 2004 – 05 సంవత్సరంలో మీ సేవల నిర్వహణ కోసం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో 3 భవనాలు నిర్మించింది. కార్పొరేషన్‌కు చెందిన స్థలాల్లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున మొత్తంగా రూ.30 లక్షలతో ఆ భవనాలు నిర్మించి జిల్లా యంత్రాంగానికి అప్పగించగా... వారు సిబ్బందిని నియమించి ప్రజలకు మీ సేవల ద్వారా సేవలందించేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సేవలన్నీ క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను ప్రారంభించడంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మీ సేవా కేంద్రాలను నిలిపివేశారు. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద మీ సేవా కేంద్రం భవన ప్రాంగణం ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తుల వాహనాల పార్కింగ్‌కు, అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. రింగ్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన మరో కేంద్రం ముందు భాగంలో చిన్న చిన్న దుకాణాలు వేసుకుని స్థానికులు వ్యాపారాలు సాగించుకుంటున్నారు. అదేవిధంగా పాత బస్టాండ్ ప్రాంతంలో మరో కేంద్రం వినియోగానికి నోచుకోలేదు. మరి కొన్నాళ్ల పాటు ఈ భవనాలను వినియోగించకపోతే త్వరగా శిథిలావస్థకు చేరుకుంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సచివాలయాలకు కేటాయిస్తే...!

నిరుపయోగంగా ఉన్న మూడు విలువైన భవనాలు నగరంలో నిర్వహిస్తున్న సచివాలయాలకు కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లు ఉండగా... 61 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటిలో అధికారిక లెక్కల ప్రకారం 53 సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి ప్రతి నెలా రూ.10,000 చొప్పున రూ.5.30 లక్షల మొత్తాన్ని అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో భవనంలో సమీప డివిజన్‌కు చెందిన రెండు సచివాలయాలు ఏర్పాటు చేసుకుంటే కార్పొరేషన్‌పై ఆర్థిక భారం తగ్గుతుంది. ఇదే విషయమై కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా... కార్పొరేషన్‌కు చెందిన భవనాలు ఖాళీగా ఉండడంపై పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతానికి ఆ భవనాలు జిల్లా యంత్రాంగం ఆధీనంలో ఉన్నాయని చెప్పారు. వారు అప్పగిస్తే తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.



ఆర్ శ్రీరాములనాయుడు

'స్వచ్ఛతే సేవ'ను విజయవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు త్రినాథ్

విజయనగరం రూరల్: స్వచ్ఛ గ్రామాల సాధనే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛతే – సేవ కార్యక్రమం విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్ అన్నారు. మండలంలోని దుప్పాడలో గురువారం నుంచి చేపడుతున్న స్వచ్ఛతే – సేవ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పీఏసీఎస్ అధ్యక్షుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్యమే ముఖ్యంగా పల్లెల్లో సుమారు 17 రోజుల పాటు స్వచ్ఛతే – సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బోడికొండపై పనులు వేగవంతం

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం బోడికొండపై కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన మిగులు పనులను వేగవంతం చేయాలని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ నగేష్ అన్నారు. రామతీర్థం దేవస్థానాన్ని గురువారం సందర్శించిన ఆయన బోడికొండపై జరుగుతున్న మిగుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోదండ రామాలయంలో యాగశాల, మంటపం, మెట్లు, ఫ్లోరింగ్, తదితర పనులను నిర్దేశిత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో ఎటువంటి లోటు రాకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణ, ఏఈ భానుచంద్, ఈఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

30 ఎకరాల్లో భూ సర్వే

భోగాపురం రూరల్: మండలంలోని సవరవిల్లి సచివాలయ పరిధిలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గురువారం భూసర్వే చేపట్టినట్లు ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 ఎకరాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీపీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపు రెన్యువల్ చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ చిరంజీవి

డెంకాడ: బ్యాంక్‌ల ద్వారా రైతులు తీసుకున్న పంట రుణాలను ఏడాది లోపు రెన్యువల్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే ఏడు శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ చిరంజీవి అన్నారు. చింతలవలస గ్రామీణ వికాస్ బ్యాంక్ అధికారులు రఘుమండ గ్రామంలో పంట రుణాలు పొందడం, తిరిగి సకాలంలో చెల్లించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ చిరంజీవి, మేనేజర్ దివ్యనాగ సౌందర్య మాట్లాడుతూ, సకాలంలో పంట రుణాలు రెన్యువల్ చేసుకోవడం వల్ల వడ్డీ రాయితీతో పాటు పంట బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడేల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు వెలకట్టలేనివి

- ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ కేదారనాథ్



లెండిలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ కేదారనాథ్

డెంకాడ: ఇంజినీరింగ్ విభాగంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ కేదారనాథ్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత డిఫెన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలను రూపొందించడానికి ఎన్ఎస్‌టీఎల్ చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పరాంకుశం, ఐఈ సమన్వయకర్త బి.శ్రీధర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో..

చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సమీర్ ఈ–3 ప్రోగ్రాం డైరెక్టర్ బి.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్ రాజు, తదితరులు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి మోక్షగుండం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, విభాగాధిపతులు, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న సమీర్ ఈ–3 ప్రోగ్రాం డైరెక్టర్ బి.సుబ్బారావు

సమాజంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

విజయనగరం ఫోర్ట్: సమాజంలో ఇంజినీర్ల పాత్ర చాలా కీలకమని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన ఇంజినీర్స్ డే సందర్భంగా ఎస్ఈ నాగేశ్వరావు, ఈఈ కృష్ణమూర్తి, త్రినాథ్‌తో పాటు పలువురు ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యుత్ ఇంజినీర్లు సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి పసుమర్తి పద్మ, వెంపడాపు రమణ, జి. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఈ నాగేశ్వరావును సన్మానిస్తున్న ప్రసాదరావు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం..

విజయనగరం టౌన్: రాష్ట్ర స్థాయిలో మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఖ్యాతిని ఇనుమడింపజేయడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌వీ ప్రసన్నకుమారి అన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా కళాశాలకు చెందిన కేవీఎల్ఎన్ శాస్త్రి ఇటీవల విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో శాస్త్రి దంపతులను గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కళాశాల అధ్యాపకుడిగా శాస్త్రి చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలోవిద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



శాస్త్రి దంపతులను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ ప్రసన్నకుమారి, తదితరులు

దేశ ప్రగతికి మూలం ఇంజనీర్లే..

భోగాపురం: ఇంజినీర్లే దేశ ప్రగతికి మూలమని మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు అన్నారు. ముంజేరు సమీపంలో ఉన్న మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్‌గెస్ట్ కేపీఎస్ఆర్ ప్రసాద్, కళాశాల డీన్ బెహర శ్రీనివాసరావు, సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ దుర్గాప్రసాద్, చల్లా త్రినాథరావు, సివిల్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు

నెల్లిమర్ల రూరల్: బహుముఖ ప్రజ్ఞాశీలి విశ్వేశ్వరయ్య అందరికీ ఆదర్శప్రాయుడని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో ఇంజినీరింగ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి కోరే ఇంజినీర్లు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు.అనంతరం ఇంజినీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సన్నీడి యోవేల్‌కు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, రిజిస్ట్రార్ రమణారావు, కృష్ణమూర్తి, ఆచార్యులు, శాంతమ్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్ట్‌ల ప్రదర్శన

విజయనగరం అర్బన్: నగరంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా జలవనరుల శాఖ డీఈ జె.స్వామినాయుడు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆయన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. డీఈ చరణ్, ఇస్రో శాస్త్రవేత్తలు మధు, ఆదినారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వంటల పోటీలకు స్పందన



వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

విజయనగరం: రోటరీ క్లబ్, రోటరీ విజయనగరం సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజనోత్సవాలు ఉత్సాహభరితమైన వాతావరణంలో కొనసాగుతున్నాయి. యువత, మహిళల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా నగరంలోని హోటల్ ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో గురువారం నిర్వహించిన వంటల తయారీ పోటీలకు స్పందన లభించింది. పోటీల్లో పాల్గొన్న మహిళలు వివిధ రకాల వంటలు తయారు చేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ముగింపు ఉత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కృష్ణగోపాల్ అగర్వాల్, కార్యదర్శి కొల్లా మనోజ్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ కేఆర్‌కే రాజు, చైర్మన్ అశోక్, ప్రోగ్రాం చైర్మన్ అస్మాభాను, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీలత, కార్యదర్శి శిరీష, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఖోఖో క్రీడాకారులు

- ఈనెల 26 నుంచి 28 వరకు ఇచ్ఛాపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న 32వ సబ్ జూనియర్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం రాజీవ్ క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలకు చెందిన 200 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు పర్యవేక్షణలో జరిగిన ఎంపిక పోటీల్లో 30 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన అనంతరం తుది జట్టును ఎంపిక చేస్తామని ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ అధ్యక్షురాలు పెనుమజ్జి విజయలక్ష్మి, కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, ఏఎస్ఎం కమలనాభరావు, రామకృష్ణ, శ్రీను, ప్రసన్న, హరీష్, ఆదిలక్ష్మి, కొండమ్మ, దమయంతి తదితరులు పర్యవేక్షించారు.

'చిట్టి గురువులు' విజయవంతానికి సహకరించండి

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నగరపంచాయతీలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి రూపొందించిన చిట్టి గురువులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన చిట్టి గురువులు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని 20 వార్డుల్లో 15 నుంచి 50 సంవత్సరాల వయసు గల నిరక్షరాస్యులను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం విజయవంతానికి సచివాలయ కార్యదర్శులు, వార్డు వలంటీర్లతో పాటు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమం అమలు, లక్ష్యాలను లిటరసీ అధికారి ఆల్తి మురళీకృష్ణ ప్రజాప్రతినిధులకు, సచివాలయ సిబ్బందికి వివరించారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, మేనేజర్ విశ్వేశ్వరరావు, మెప్మా సీఎంఎం దన్నాన గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రైతులకు ప్రజా మద్దతు

- టీడీపీ నేత బుద్ధా వెంకన్న

విజయనగరం గంటస్తంభం: అమరావతి రైతులకు ప్రజా మద్దతు ఉందని, ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటోందని టీడీపీ నాయకుడు బుద్ధా వెంకన్న అన్నారు. విజయనగరంలో టీడీపీ నాయకులు చింతకాయల అయన్నపాత్రుడు, అశోక్‌గజపతిరాజు, ఇతర నాయకులతో కలిసి గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకన్న మాట్లాడారు. విజయగనరంలో అశోక్‌బంగ్లాయే టీడీపీ కార్యాలయమని, వేరే కార్యాలయం పెడితే మంచిది కాదన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులను కాపాడుకోవడానికి లీగల్‌సెల్ పటిష్టం చేస్తామని చెప్పారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలు మద్దతు కోరడానికి రాజధాని రైతులు వస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిపోతుందన్న మంత్రులు.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదన్నారు. అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రాజధాని రైతులు త్యాగమూర్తులుగా పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధిని ఆపేయడం ఆదా కాదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు కిమిడి నాగార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

రికార్డుల పరిశీలన



సారిక పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ తిరుపతినాయుడు

విజయనగరం రూరల్: పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో అధికారులు రికార్డుల పరిశీలనకు గురువారం నుంచి శ్రీకారం చుట్టారు. మూడేళ్ల కాలంలో గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు, ఇతరత్రా పనులకు చేసిన ఖర్చులు నిబంధనల మేర జరిగాయా, లేదా, ముందస్తు చెల్లింపులు, చలానాలు, పన్నుల వసూలు, తదితర అంశాలపై రికార్డులను పరిశీలిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని దుప్పాడ, సారిక గ్రామాల్లో పరిశీలన చేసి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపించామన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరుపై ఎంపీడీఓ ఆగ్రహం

భోగాపురం: విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఎలా అంటూ ఎంపీడీఓ దాసరి బంగారయ్య సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు తమ పరిధిలో ఉన్న పాఠశాలలను ఎందుకు పర్యవేక్షించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకంతో పాటు విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆకట్టుకున్న బ్రహ్మ గణపతి



విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రంగాలవీధిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద కమిటీ సభ్యులు గురువారం బ్రహ్మ గణపతిని తీర్చిదిద్దారు. ఉప్పుతో 30 అడుగుల గణపతి బొమ్మను బ్రహ్మ రూపంలో రూపొందించగా.. మహిళా భక్తులు సుమారు 500 దీపాలు వెలిగించారు. దీపాల వెలుగులో బ్రహ్మ గణపతి భక్తులను అలరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.రవి, నాయుడు, సురేష్, సతీష్, బి.కుమార్, శ్రీను, సంతోష్‌కుమార్, వి.గోవింద్ పాల్గొన్నారు.

హిందీ భాషపై ప్రత్యేక దృష్టి

భోగాపురం రూరల్: విద్యార్థులు ఇంగ్లిష్‌తో పాటు హిందీ భాషపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని పోలిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి. ఇందిరాదేవి అన్నారు. పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హిందీ భాషపై పట్టు ఏర్పడితే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చన్నారు. అనంతరం హిందీ ఉపాధ్యాయురాలు గీతాంజలి రామారావుతో పాటు విశ్రాంత ఉపాధ్యాయురాలు భానుమతిలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభా సమయం



తొలిరోజు నాలుగు బిల్లులు

అసెంబ్లీ సమావేశాల తొలి రోజున గురువారం శాసనసభలో నాలుగు బిల్లులను మంత్రులు ప్రవేశపెట్టారు. ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లును ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రవేశపెట్టగా, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లును రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఏపీ అగ్రికల్చర్ ప్రొడ్యూస్ అండ్ లైవ్‌స్టాక్ మార్కెటింగ్ సవరణ బిల్లును వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి సభలో ప్రవేశపెట్టారు. అలాగే ఏపీ సివిల్ సర్వీసెస్ డిసిప్లినరీ ట్రిబ్యునల్ ప్రొసీజర్ బిల్లును సీఎం జగన్ తరఫున మంత్రి కాకాణి సభలో ప్రవేశపెట్టారు. వీటిని సభలో చర్చకు ప్రవేశపెడుతున్నట్టు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు.

– సాక్షి, అమరావతి



మండలి ప్యానల్ వైస్ చైర్మన్ల నియామకం

సాక్షి, అమరావతి: ప్రస్తుతం జరుగుతున్న శాసనమండలి సమావేశాలకు ప్యానల్ వైస్ చైర్మన్లను నియమిస్తూ మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటన చేశారు. గురువారం సమావేశం ప్రారంభం కాగానే డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, కృష్ణ రాఘవ జయేంద్ర భరత్, తలశిల రఘురాం, చిక్కాల రామచంద్రరావును ప్యానల్ వైస్ చైర్మన్లుగా నియమిస్తున్నట్లు మండలి చైర్మన్ ప్రకటించారు.

దివంగత సభ్యులకు సంతాపం

సాక్షి, అమరావతి: ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు శాసన సభ గురువారం సంతాపం తెలిపింది. శత్రుచర్ల చంద్రశేఖరరాజు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, జేఆర్ పుష్పరాజ్, పులపర్తి నారాయణమూర్తి, నల్లమిల్లి మూలారెడ్డి కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా దివంగత సభ్యులు చేసిన కృషిని స్పీకర్ తమ్మినేని కొనియాడారు. అనంతరం సీఎం జగన్‌తో పాటు సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.



చంద్రబాబుకు సిగ్గుందా..

• ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



రాష్ట్రం ప్రభుత్వం లక్షలాది మందికి సచివాలయ, పారా మెడికల్ ఉద్యోగాలిస్తే జాబు కావాలంటే జగన్ పోవాలని అసెంబ్లీ, మండలిలో నినదించడానికి ప్రతిపక్ష పార్టీ నేతలకు, ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు సిగ్గుందా? జాబు కావాలంటే బాబు రావాలని టీడీపీ ప్రచారం చేసింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, ఆలోగా రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఆయన కొడుకు లోకేశ్ ఒక్కడికే ఉద్యోగమిచ్చి అందరికీ ఇచ్చేసినట్టుగా అనుకోమన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీని ప్రజలు విశ్వసించరు.

మూడు ప్రాంతాల అభివృద్ధి కావాలా? అమరావతి కావాలా?

• మంత్రి ఆర్‌కే రోజా



సాక్షి, అమరావతి: మూడు ప్రాంతాల అభివృద్ధి కావాలా? అమరావతి ఒక్కటే చాలా అని టీడీపీ వాళ్లు ప్రజల్లోకి వెళితే ఏం కావాలో వారే చెబుతారు. 29 గ్రామాల్లో టీడీపీ నేతలు, వారి బినామీలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు 26 జిల్లాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఈ ప్రాంతాన్ని వాళ్ల స్వార్థం కోసం వాడుకున్నారు. మూడు రాజధానుల ప్రకటన తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో ప్రజలు మా పార్టీకి ఎంతలా బ్రహ్మరథం పట్టారో మరిచిపోయారా? అసెంబ్లీకి రాలేని చంద్రబాబు, ప్రజల్లోకి వెళ్లలేని లోకేశ్ మాపై విమర్శలు చేస్తారా? లోకేశ్ ఓ పిల్లిబిత్తిరి. అలాంటి వాడు సీఎంను ఏకవచనంలో మాట్లాడతాడా? వైఎస్ జగన్ సీఎం కాగానే ఒకే నోటిఫికేషన్‌తో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాలు ఇచ్చారు. మరో 2.60 లక్షల మందిని వలంటీర్లుగా తీసుకుని ప్రజలకు సేవలందిస్తున్నారు. వైద్య రంగంలోనూ నియామకాలు చేపట్టారు. కొడాలి నాని ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. ఆడవాళ్లను ఇళ్ల మీదకు పంపిస్తారా? ఎమ్మెల్యేల ఇళ్లపైకి వెళ్లి భయపెడతామంటే సహించం.

చూస్తూ ఊరుకోం..

• మంత్రి సీదిరి అప్పలరాజు



ఉత్తరాంధ్రపై ద్వేషంతో, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలనే కుట్రతో విశాఖపై దండెత్తి వస్తే చూస్తూ ఊరుకోం. పాదయాత్ర పేరుతో రైతుల ముసుగులో టీడీపీ వారు లక్షల్లో వచ్చినా అంతకు రెట్టింపుగా వచ్చి ఉత్తరాంధ్ర ప్రజలు వారిని వెనక్కు పంపుతారు. అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తామంటే సామాజిక అసమతుల్యత అంటూ కోర్టుల్లో వాదిస్తారా? అలాంటి ప్రాంతంలో కొన్ని గ్రామాల వారి కోసమే రాజధాని కట్టడానికి వెనుకబడ్డ వర్గాలు ఎందుకు అంగీకరించాలి? ల్యాండ్ పూలింగ్ స్కీం కింద 54 వేల ఎకరాల్లో రైతులకు 11 వేల ఎకరాలు ఇవ్వాలి. అభివృద్ధి కోసం 30 వేల ఎకరాలు ఖర్చవుతుంది. ప్రభుత్వం చేతిలో 10 వేల ఎకరాలే ఉంటుంది. ఇది ఏ రకంగా త్యాగమవుతుంది.

పెత్తందారులను ఎదుర్కోవడానికి ముందుకు రావాలి

• చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



రాజధాని పేరుతో రైతుల ముసుగులో టీడీపీకి చెందిన పెత్తందారులు అశాంతిని సృష్టించాలనుకుంటే వారిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలను కోరుతున్నాం. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా, సభలో కనీసం ప్రభుత్వం చెబుతున్న విషయాలను కూడా వినకుండా ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరును ఎవరూ చూస్తూ ఊరుకోరు. మూడు ప్రాంతాలూ అభివృద్ధి జరగాలని పాలన వికేంద్రీకరణ చేపట్టాం. దానికి కట్టుబడి ఉన్నాం.

ఉత్తరాంధ్రపై విషం చిమ్ముతున్న టీడీపీ

• ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సభ సజావుగా జరగకూడదనే టీడీపీ సభ్యులు నిర్ణయించుకున్నారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతామన్నా వారి తీరు మారడం లేదు. ఉత్తరాంధ్రపై విషం చిమ్మేందుకు, అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. మమ్మల్ని రాజీనామా చేయమనడం ఏమిటి? మీ సభ్యులు రాజీనామా చేసి ఎన్నికలకు వెళదాం. మేం మూడు రాజధానులు అని, మీరు అమరావతి అని చెప్పాక ప్రజలు ఏం కోరుకుంటారో దాన్నే పాటిద్దాం.

బాబు ఎందరికి ఉద్యోగాలిచ్చాడు?

• ఎమ్మెల్సీ పోతుల సునీత



టీడీపీ సభ్యులు కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై చర్చించనీయడం లేదు. వారు అడిగిన ప్రశ్నలపై కూడా చర్చ జరగనీయడం లేదు. సీఎంగా చంద్రబాబు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు? ఇప్పుడు మా ప్రభుత్వంలో ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తున్నారు. జగన్ సీఎం అవగానే లక్షలాది ఉద్యోగాలు ఇచ్చారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు లేకుండా రాజధాని అయిపోతుందా? మా ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.1.65 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు ఇచ్చింది.

అడ్డుకోవడమే విపక్షం అజెండా

నిబంధనలకు విరుద్ధంగా వాయిదా తీర్మానానికి పట్టు

- ప్లకార్డులు చేత పట్టుకుని టీడీపీ ఎమ్మెల్యేల నినాదాలు
- పోడియం బల్ల చరుస్తూ అరుపులు.. వాయిదా అనంతరం కూడా అదే గోల



పోడియంపైకి ఎక్కి స్పీకర్ తమ్మినేనిని చుట్టుముట్టిన టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి : సమావేశాలు ప్రారంభం అయిన తొలి నిమిషం నుంచే శాసనసభ కార్యకలాపాలను స్తంభింపజేసేలా టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించారు. వాయిదా తీర్మానాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తూ, సభ సంప్రదాయాలకు విరుద్ధంగా ఆందోళనకు దిగారు. గురువారం ఉదయం 9 గంటలకు ప్రశ్నోత్తరాలు ప్రారంభమైన వెంటనే.. నిరుద్యోగ సమస్యపై వాయిదా తీర్మానాన్ని అనుమతించాలంటూ టీడీపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేయడం మొదలు పెట్టారు. బీఏసీ సమావేశం నిర్వహించకుండానే వాయిదా తీర్మానానికి ఎలా డిమాండ్ చేస్తారని స్పీకర్ వారిని ప్రశ్నించారు. ఏయే అంశాలపై చర్చించాలనే దానిపై బీఏసీ సమావేశంలో నిర్ణయిస్తామని, వాటిలో టీడీపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్న అంశం లేకపోతే వాయిదా తీర్మానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. స్పీకర్ ఎంత చెబుతున్నా వినకుండా టీడీపీ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానానికే పట్టుబట్టారు. నినాదాలు చేసుకుంటూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. పోడియం బల్లను చరుస్తూ నినాదాలు చేశారు. మంత్రులు సమాధానం ఇస్తుండగానే పదేపదే అంతరాయం కలిగించారు. ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయ స్వామి, గద్దె రామ్మోహన్, వెలగపూడి రామకృష్ణబాబు, అశోక్ తదితరులు స్పీకర్ పోడియం మీదకు వెళ్లి స్పీకర్ చైర్ వద్ద నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. టీడీపీ సభ్యుల తీరు పట్ల స్పీకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెళ్లి తమ స్థానాల్లో కూర్చోవాలని పలు మార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో స్పీకర్ 10 నిమిషాలు సభను వాయిదా వేశారు. అనంతరం సభ తిరిగి సమావేశమయ్యాక కూడా వారు వాయిదా తీర్మానానికే పట్టుబట్టి, స్పీకర్ చైర్ వైపు దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో స్పీకర్.. మార్షల్స్‌ను పిలిపించి వారు తన వద్దకు రాకుండా అడ్డుగా ఉంచారు. టీడీపీ సభ్యుల నినాదాలు, గందరగోళ పరిస్థితుల మధ్యే మంత్రులు సమాధానాలు ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేల మృతికి స్పీకర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సంతాపం తెలిపిన అనంతరం టీడీపీ ఎమ్మెల్యేల వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ సభను వాయిదా వేశారు. టీడీపీ నాయకులు నిరుద్యోగ సమస్యపై వాయిదా తీర్మానానికి డిమాండ్ చేయడం పట్ల అధికార పక్షం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సభలో మాటల యుద్ధం నడిచింది.

లక్షలాది ఉద్యోగాల ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ అన్నారు. కరోనా కష్ట పరిస్థితుల్లోనూ 2.60 లక్షల మందికి వలంటీర్లు, 1.35 లక్షల మందికి సచివాలయాల ఉద్యోగాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగానే సభ కార్యకలాపాలను స్తంభింపజేయాలని వ్యవహరిస్తున్నారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. వాళ్లే ప్రశ్నలు అడిగి.. ఆ ప్రశ్నలకు తాము సమాధానాలిచ్చే సమయంలోనే ఆందోళనకు దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలు పెట్టండని డిమాండ్ చేసి.. ఇప్పుడు అడుగడుగునా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని శాసనసభ వ్యవహారాల కో–ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. నిరుద్యోగుల గురించి టీడీపీ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు విమర్శించారు.

టీడీపీ సభ్యుల రచ్చ

సాక్షి, అమరావతి: శాసన సభ సమావేశాల తొలి రోజే ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యేలు రచ్చకు దిగారు. స్పీకర్ పోడియం వద్ద ఘర్షణ వాతావరణం సృష్టించారు. మార్షల్స్‌తో దురుసుగా ప్రవర్తించారు. స్పీకర్ ఎంతగా సర్ది చెప్పినా వినకపోవడంతో చివరకు వారిని ఒక రోజు సభ నుంచి సస్పెండ్ చేశారు. గురువారం శాసన సభలో వికేంద్రీకరణపై స్వల్ప కాలిక చర్చ చేపట్టిన సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలు అడుగడుగునా అడ్డు తగిలారు. సభకు విఘాతం కలిగించారు. టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వికేంద్రీకరణపై మాట్లాడుతుండగా.. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మైక్ తీసుకుని ప్రతిపక్ష నాయకులు అవాస్తవాలతో సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అమరావతిలో భూములు కొన్న టీడీపీ నాయకుల జాబితా చదివి వినిపించారు. ఇందులో టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేరు ఉండటంతో ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ వెల్‌లోకి దూసుకెళ్లారు. సమయాన్నిబట్టి అవకాశం ఇస్తానని స్పీకర్ చెప్పడంతో పయ్యావుల సీట్లో కూర్చున్నారు. రామానాయుడు ప్రసంగం అనంతరం మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతుండగా మరోసారి పయ్యావుల కేశవ్ వెల్‌లోకి వెళ్లారు. ఆయన వెంట ఇతర టీడీపీ సభ్యులు కూడా వెళ్లి పోడియం వద్ద గందరగోళం సృష్టించారు. చైర్ మాటకు విలువలేదంటూ స్పీకర్‌నుద్దేశించి పయ్యావుల వ్యాఖ్యానించగా... చైర్‌కు టీడీపీ సభ్యులు ఎంత విలువ ఇస్తున్నారో పద్ధతిని చూస్తే తెలుస్తుందని స్పీకర్ బదులిచ్చారు. కన్నబాబు ప్రసంగానికి ఆదిలోనే పదేపదే బ్రేక్ పడింది. పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో కేశవ్‌కు మైక్ ఇవ్వడంతో రాజధాని ప్రకటన తర్వాతే తన కుటుంబ సభ్యులు భూములు కొన్నారని, దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధమేనంటూ పయ్యావుల సవాల్ చేశారు. దీంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆధారాలతో సహా ఎప్పుడెప్పుడు టీడీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యులు, బినామీల పేర్లతో భూములు కొన్నారో వివరిస్తుండగా.. వాస్తవాలు ప్రజల్లోకి వెళ్తాయనే భయంతో టీడీపీ సభ్యులందరూ మరోసారి స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి సభను అడ్డుకొన్నారు. సీట్లలో కూర్చోవాలని వారిని స్పీకర్ కోరినా వినిపించుకోలేదు. సీట్లలో కూర్చోకుంటే.. తీసుకెళ్లి కూర్చోబెడతాం అంటూ స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్షల్స్‌ను సభలోకి పిలిచారు. పోడియం వద్ద టీడీపీ సభ్యులకు మార్షల్స్ అడ్డుగా నిల్చున్నారు. టీడీపీ ఎమ్మెల్యే రామకృష్ణబాబు విధి నిర్వహణలో ఉన్న మార్షల్స్‌ను పదేపదే తోసేస్తూ దురుసుగా ప్రవర్తించారు. మరో ఎమ్మెల్యే రామానాయుడు మార్షల్స్‌ను ఉద్దేశించి ఇదేమీ లోటస్ పాండ్ వైఎస్సార్‌సీపీ కార్యాలయం.. కాదంటూ వాగ్వాదానికి దిగారు. చీఫ్ మార్షల్‌తో నువ్వేమన్నా స్పీకర్‌వా.. మమ్మల్ని ముట్టుకోవద్దు... అంటూ గొడవకు దిగారు. ఇలా పోడియం వద్ద ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. అక్కడే నినాదాలు చేస్తూ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకుని.. వాటిని షేర్ చేసుకున్నారు. ఎంతకీ పరిస్థితి దారికి రాకపోవడంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ టీడీపీ సభ్యుల సస్పెన్షన్‌కు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభ్యుల ఆమోదంతో స్పీకర్ ఆ తీర్మానాన్ని పాస్ చేశారు. టీడీపీ సభ్యులు అశోక్ బెందాళం, అచ్చెన్నాయుడు, చినరాజప్ప, ఆదిరెడ్డి భవాని, బుచ్చయ్య చౌదరి, వెంకటరెడ్డినాయుడు, జోగేశ్వరరావు, పయ్యావుల కేశవ్, గద్దె రామ్మోహన్, రామకృష్ణబాబు, నిమ్మల రామానాయుడు, రామరాజు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు, అనగాని సత్యప్రసాద్‌ను ఒక్క రోజు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

మండలిలో అదే గొడవ

సాక్షి, అమరావతి: శాసనమండలిలో టీడీపీ సభ్యులు సభాసంప్రదాయాలకు విరుద్ధంగా చైర్మన్ పోడియంను చుట్టుముట్టి సభాకార్యక్రమాలను అడ్డుకున్నారు. జాబ్ క్యాలెండర్– రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యపై తెలుగుదేశం సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలుపెట్టగానే వారు అడ్డుతగిలారు. తొలుత వారి స్థానాల్లో నిలబడి ప్లకార్డులు, నినాదాలతో నిరసన తెలిపిన సభ్యులు తర్వాత పోడియం ముందుకు వచ్చారు. కొందరు చైర్మన్ మోషేన్ రాజు సీటు వద్దకు వెళ్లి సభాకార్యక్రమాలను అడ్డుకున్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, సీనియర్ సభ్యుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలుగుదేశం సభ్యుల తీరును తప్పుబట్టారు. చంద్రబాబు డైరెక్షన్‌లో సభ్యులు గలాటా చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం సభ్యులపై చర్యలు తీసుకుని సభను ఆర్డర్‌లో పెట్టాలని కోరారు. చైర్మన్ పదేపదే హెచ్చరించగా టీడీపీ సభ్యులు పోడియం దిగి ముందు నిలబడి నినాదాలు కొనసాగించడంతో టీ బ్రేక్ ఇస్తూ సభను వాయిదా వేశారు.

పట్టుబడ్డ పయ్యావుల!

• ఆధారాలతో బయటపెట్టిన బుగ్గన

సాక్షి, అమరావతి: రాజధాని ముసుగులో జరిగిన అక్రమాలు, టీడీపీ నాయకుల రియల్ ఎస్టేట్ దందాలు అసెంబ్లీ సాక్షిగా బట్టబయలయ్యాయి. రాజధాని ఎక్కడనే విషయాన్ని అధికారికంగా ప్రకటించకముందే ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేయడం ద్వారా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు టీడీపీ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ పాల్పడినట్లు తేటతెల్లమైంది. పయ్యావుల కుటుంబ సభ్యుల పేరుతో ఎక్కడెక్కడ భూములు కొన్నారో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చిట్టా బయటపెట్టారు.

తప్పేముంది.. స్వాధీనం చేసుకోండి!

అసెంబ్లీలో గురువారం అమరావతి భూముల కొనుగోళ్లపై చర్చ సందర్భంగా తాను రాజధాని ప్రాంతంలో అక్రమంగా భూములు కొనుగోలు చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పయ్యావుల తొలుత ఖండించారు. 'రాజధానిని ప్రకటించాక భూములు కొన్నాం.. తప్పేముంది?' అంటూ ప్రశ్నించారు. చట్ట విరుద్ధంగా భూములను కొనుగోలు చేస్తే కేంద్రం తెచ్చిన బినామీ ఆస్తుల స్వాధీనం చట్టం ప్రకారం తన భూములు తీసేసుకోవాలంటూ సవాల్ విసిరారు. దీంతో ఆర్థిక మంత్రి బుగ్గన స్పందిస్తూ గత ప్రభుత్వం రాజధాని ప్రకటన ఎప్పుడు చేసిందో చెప్పాలని సూచించగా.. 4-9-2014న ప్రకటించారని, నెల తర్వాత నవంబర్‌లో భూములు కొన్నట్లు పయ్యావుల పేర్కొన్నారు.

ముందే భూములు కొన్న పయ్యావుల

'రాజధానిపై టీడీపీ పెద్దలు తొలుత నాగార్జున వర్సిటీ ప్రాంతమని, తర్వాత నూజివీడు అని ప్రచారం చేయడంతో ఆయా చోట్ల చాలామంది సామాన్యులు భూములు కొన్నారు. టీడీపీ నేతలు మాత్రం తుళ్లూరు ప్రాంతంలో పనులు చక్కబెట్టుకున్నారు. వాస్తవానికి రాజధానికి నోటిఫికేషన్ ఇచ్చింది 2014, డిసెంబర్ 30న. పయ్యావుల కేశవ్ తన కుమార్తె హారిక పేరిట 2014 ఫిబ్రవరి 28న, కుమారుడు పయ్యావుల విక్రమ్‌సింహ పేరిట 13-10-2014న రెండెకరాలు, 03-11-2014న మరో రెండున్నర ఎకరాలు తుళ్లూరు ప్రాంతంలో కొనుగోలు చేశారు. ఆ తర్వాత అదే ఏడాది డిసెంబర్ చివరిలో అక్కడ రాజధాని వస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది' అని బుగ్గన డాక్యుమెంట్ల నంబర్లతో సహా వెల్లడించడంతో పయ్యావుల కంగుతిన్నారు.

హెరిటేజ్ ఫుడ్స్ పేరుతోనూ కొనుగోలు

రాజధాని ప్రకటన వెలువడటానికి (2014 డిసెంబర్ 30న) ముందే చంద్రబాబు కుటుంబ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ పేరుతో తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినట్టు బుగ్గన రాజేంద్రనాథ్ నిరూపించారు. 'ఈ సంస్థ పేరిట 07-07-2014న పెదకాకాని, కంతేరు, తాడికొండలో సర్వే నంబర్ 56లో ఎకరా 15 సెంట్లు (డాక్యుమెంట్ నం.5869), ఇదే తేదీన (డాక్యుమెంట్ నం.5866) మరో ఎకరా 11 సెంట్లు, తాడికొండలోని సర్వే నం.63/1లో 45 సెంట్లు (డాక్యుమెంట్ నం.5867), 8 సెప్టెంబర్ 2014న తాడికొండ సర్వే నం.56లో ఎకరా 11 సెంట్లు (డాక్యుమెంట్ నం.8024), ఇదే తేదీన సర్వే నం. 63/2బిలో ఎకరా 35 సెంట్లు (డాక్యుమెంట్ నం.8025), ఇక్కడే మరో ఎకరా 35 సెంట్లు (డాక్యుమెంట్ నం.8026), సర్వే నం.57లో 2.20 సెంట్లు (డాక్యుమెంట్ నం.8027).. ఇలా భారీగా భూములు హెరిటేజ్ ఫుడ్స్ పేరుతో కొనుగోలు చేశారు' అని బుగ్గన తెలిపారు.

ముందుగానే ఒప్పందం..

'రాజధాని ప్రకటన తేదీకి రెండు నెలలు ముందు, రెండు నెలల వెనుక భారీగా భూములు కొనుగోలు చేశారు. రాజధాని ప్రకటన చేసింది 30 డిసెంబర్ 2014 (జీఓ ఎంఎస్ నం.254) కాగా, టీడీపీ నాయకులు మాత్రం అంతకుముందే స్థానిక రైతులతో ఒప్పందం చేసుకుని వేలాది ఎకరాలు కొన్నారు. ఇదంతా వారికి ముందే తెలిసి ఇన్‌సైడ్ ట్రేడింగ్ ద్వారా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారమే, ఇన్నివేల ఎకరాలు రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్లు అయిపోవు. ఇదంతా ముందే ఒప్పందం చేసుకుని జరిగిన వ్యాపారం' అని బుగ్గన తెలిపారు.

శాసనసభలో ప్రశ్నోత్తరాలు

విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు సేవలు



సాక్షి, అమరావతి: విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట కొనుగోలు వరకు అనేక రకాల సేవలను అన్నదాతలకు రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకొచ్చామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. విత్తన దశ నుంచి ఉత్పత్తుల అమ్మకం వరకు ఆర్బీకేల పాత్రపై గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, రఘురామిరెడ్డి, ప్రతాప్‌కుమార్ రెడ్డి, పుప్పాల శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఆర్బీకేల ద్వారా సేవల పంపిణీ, నాణ్యమైన ఉత్పాదకాల సరఫరా, రైతుల్లో సామర్థ్యాల పెంపుదల.. విజ్ఞానవ్యాప్తి, సేకరణ కార్యకలాపాలు వంటివి మూలస్తంభాలుగా రైతులకు విశేష సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ సర్కార్ ఆర్బీకేల ద్వారా అందిస్తున్న విశేష సేవలను తెలుసుకుని వివిధ రాష్ట్రాల మంత్రులు, అధికారులు, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు వచ్చి ఆర్బీకేలను సందర్శించారని తెలిపారు. రైతులకు సంబంధించిన అన్ని రకాల సేవలకు వన్‌స్టాప్ సెంటర్‌గా ఆర్బీకేలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ–క్రాప్ విధానాన్ని దేశంలో సమర్థంగా నిర్వహిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు.

ఎస్సీ విద్యార్థుల బాగుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి

సాంఘిక సంక్షేమ స్టడీ సర్కిళ్ల ద్వారా ఎస్సీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారి బాగుకోసం సీఎం వైఎస్ జగన్ కృషిచేస్తున్నారని ఆ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. 2014–19 మధ్య స్టడీ సర్కిళ్లను టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. స్టడీ సర్కిళ్లపై ఎమ్మెల్యేలు జగన్మోహనరావు, పద్మావతి, బాబురావు, జోగారావు, ఎలీజా అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖ, విజయవాడ, తిరుపతిల్లో సాంఘిక సంక్షేమ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలకు విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. విశాఖలోని సివిల్స్‌కు 100 మంది, విజయవాడలో గ్రూప్–1 కోసం 100 మంది, తిరుపతిలో బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం 100 మంది ప్రస్తుతం శిక్షణ పొందుతున్నట్టు వివరించారు. నందిగామ ఎమ్మెల్యే ఎం.జగన్మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్‌లోని ఏపీ స్టడీ సర్కిల్‌ను మన రాష్ట్రానికి కేటాయించినా గత ప్రభుత్వం ఒక్క విద్యార్థిని కూడా అక్కడికి పంపించలేదని చెప్పారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ గతంలో 1,400 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉంటే టీడీపీ ప్రభుత్వం 900 హాస్టళ్లను మూసేసిందని తెలిపారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబురావు మాట్లాడుతూ దళితులు, అణగారిన వర్గాలపై అభిమానం ఉంటే వారికి సంబంధించిన అంశాలపై సభలో చర్చ జరిగేటప్పుడు అడ్డుకోరాదని టీడీపీ ఎమ్మెల్యేలకు సూచించారు.

శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రతకు చర్యలు



శ్రీశైలం ప్రాజెక్ట్ భద్రత కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. స్పిల్‌వే కింద భాగంలో ఏర్పడిన గొయ్యిని పూడ్చి, శాశ్వత మరమ్మతులకు ఉపక్రమిస్తున్నామన్నారు. శ్రీశైలం డ్యామ్ భద్రతపై టీడీపీ ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, సాంబశివరావు, వీరాంజనేయస్వామి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం స్పిల్‌వే కింద ఏర్పడిన గొయ్యిని పూడ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. 1998లో డ్యామ్‌కు భారీగా వరదలు పోటెత్తినప్పుడు పెద్ద గొయ్యి పడిందన్నారు. దాన్ని 2002లో గమనించి 2002–04 మధ్య రూ.15 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారని తెలిపారు. 2018లో రూ.5 కోట్లతో తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారని చెప్పారు. 2019లో తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం జగన్ ఆదేశాల మేరకు గోతిని పూర్తిగా పూడ్చేందుకు చర్యలు మొదలు పెట్టామన్నారు. డ్యామ్ భద్రత సమీక్ష ప్యానల్ సూచన ప్రకారం రూ.45 కోట్లతో దిగువ కుడిపక్క ప్రాంతానికి సంరక్షణ పనులు, రూ.55 కోట్లతో ప్రస్తుతమున్న యాప్రాన్ ముందుభాగం పరిరక్షణ కోసం అంచనాను తయారు చేసి కేంద్ర జలసంఘానికి సమర్పించినట్లు చెప్పారు. రూ.722.5 కోట్ల అంచనాతో దిగువ ప్రవాహ ప్లంజ్ పూల్ భద్రతను కాపాడటం కోసం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

శాసనమండలిలో...

రూ.18,897.34 కోట్లతో తీరప్రాంత అభివృద్ధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సుదీర్ఘ తీరప్రాంతం 974 కిలోమీటర్లను అభివృద్ధి చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధికల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా నిర్దేశించుకున్నారని, ఇందుకోసం ఏ దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.18,897 కోట్లతో నాలుగుపోర్టులు, ఐదు ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ఆయన గురువారం శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ.. రూ.15,376.78 కోట్లతో రామాయపట్నం పోర్టు, భావనపాడు, మచిలీపట్నంతో పాటు పీపీపీ విధానంలో కేసెజ్ పోర్టును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రామాయపట్నం పోర్టు పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే భావనపాడు, మచిలీపట్నం పోర్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రెండు దశల్లో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని మూడు పారిశ్రామిక కారిడార్లలో ఏపీఐఐసీ వివిధ పారిశ్రామిక హబ్స్‌ను అభివృద్ధి చేస్తోందని, ఇప్పటివరకు 99,645 మందికి ఉపాధి లభించిందని చెప్పారు.

ధరల కట్టడికి చర్యలు



వంటనూనెల ధరలు అరికట్టడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బహిరంగ మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతుబజార్లలో 3,86,046 లీటర్ల వంటనూనెలను విక్రయించినట్లు చెప్పారు. అక్రమ నిల్వలపై ఎప్పటికప్పుడు దాడులు చేయడం ద్వారా ధరలు తగ్గేలా చూశామన్నారు.

నెలాఖరుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు



అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెలాఖరుకు స్మార్ట్‌ఫోన్లు ఇస్తామని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ చెప్పారు. రాష్ట్రంలో 55,607 అంగన్ వాడీ కేంద్రాలు మహిళా, శిశు సంరక్షణలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పోషకాహారాన్ని అందించే కార్యక్రమం సమర్థంగా జరుగుతోందని చెప్పారు.

గత ప్రభుత్వ బకాయిలు చెల్లించాం



ప్రజలందరికీ ఉచితంగా పూర్తిస్థాయి వైద్య సేవలను అందించాలన్న దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని తెలిపారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో చికిత్స చేయించుకున్న బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.632 కోట్లను తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఆరోగ్యశ్రీలో చికిత్స చేసే ప్రొసీజర్స్‌ను 3వేలకు పెంచనున్నట్లు తెలిపారు. అక్టోబర్ నెలాఖరులోపు తమ శాఖలో ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు.

రాష్ట్రంలో 86.84 కోట్ల పనిదినాలు



ఉపాధిహామీ పథకంలో 2019–20 నుంచి ఇప్పటివరకు కేంద్రం 83.68 కోట్ల పనిదినాలు కేటాయిస్తే రాష్ట్రంలో 86.84 కోట్ల పనిదినాలు కల్పించినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు.

ఇలా బతకడం బాగుంది

వారం రోజులుగా ఈ 'దాదీజీ (అవ్వ) వీడియో వైరల్ అవుతోంది.
దానికి కారణం ముంబై మెట్రో రైళ్లల్లో
ఈ దాదీజీ చాక్లెట్లు అమ్ముతూ కనిపించడమే.
ఆమె కథ ఏమిటో. పిల్లలు చూస్తున్నారో లేదో.
కాని తన జీవితం తాను బతకడానికి చక్కని నవ్వుతో
తియ్యని చాక్లెట్లు అమ్ముతోంది. ఒక ప్రయాణికుడు ఆమె వీడియో
సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్తా వైరల్ అయ్యింది.
చాలామంది సాయం చేస్తామని వచ్చారు. 'చాక్లెట్లు కొనండి చాలు'
అని సున్నితంగా, ఆత్మగౌరవంతో తిరస్కరించిందామె.



ముంబై లోకల్ ట్రైన్‌లలో చక్కగా నవ్వుతూ, చుడీదార్‌లో చలాకీగా నడుస్తూ, చాక్లెట్లు అమ్మే ఆ పెద్దావిడను చూసి ఎవరో వారం క్రితం సోషల్ మీడియాలో పెట్టారు. ఆ వయసులో కూడా జీవించడానికి శ్రమ పడుతున్న ఆమెను అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ అయితే ఆ వీడియోను ట్వీట్ చేసి అందరూ ఆమె దగ్గర చాక్లెట్లు కొనండి అని వినతి చేశారు. ఆ తర్వాత 'హేమ్‌కుంట్ ఫౌండేషన్'కు చెందిన అహ్లూవాలియా అనే వ్యక్తి ఆమెకు పెద్ద ఎత్తున సాయం చేస్తాము ఆమె ఎక్కడ ఉంటుందో గుర్తించండి అని ముంబై వాసులను ఉద్దేశించి ట్వీట్లు చేశారు. ఆ ట్వీట్లను బాలీవుడ్ స్టార్లు కూడా రీట్వీట్ చేశారు. చాలామంది ముంబైవాసులు 'మేము ఫలానా ట్రైన్‌లో చూశాం. ఆ స్టేషన్‌లో చూశాం' అని స్పందనలు పెట్టారు. చివరకు వెతికీ వెతికి ఆమెను పట్టుకున్నారు అహ్లూవాలియా మనుషులు.

ఆమె పేరు వజ్జీ...

'నా కుటుంబంలో సమస్య వచ్చింది. అప్పటినుంచి చాక్లెట్లు అమ్ముతున్నా' అని ఆమె చెప్పింది వజ్జీ. ఫౌండేషన్ సభ్యులు ఆమెకు వెంటనే పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. 'నాకేం వద్దు. నాకు ఇలా బతకడమే బాగుంది' అని చెప్పిందామె. 'నా మనుషులు ఆమె చాక్లెట్లను రెట్టింపు రేటు ఇచ్చి కొందామన్నా ఆమె ఇవ్వలేదు. మామూలు రేటుకే ఇచ్చింది. ఇకపై ప్రతి వారం ఆమె చాక్లెట్లు మొత్తం మేము కొంటాం. ఎందుకంటే ఆ ఒక్క రోజు ఆమె అన్ని రైళ్లు తిరిగే అవస్థ తప్పుతుంది' అని ట్వీట్ చేశాడు అహ్లూవాలియా.

'ఆమె ఆత్మగౌరవం చూసి మేమందరం ఆమెకు మరింత అభిమానులం అయ్యాం' అని నెటిజన్లు వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరికీ ఏవో సమస్యలు వస్తాయి. కాని వజ్జీలా నవ్వుతూ హుందాగా వాటిని ఎదుర్కొనడం తెలియాలి. వజ్జీ నుంచి గ్రహించాల్సిన పాఠం అదే.

ఫ్యాషన్







చుట్టేస్తున్నాయి...

చూపులను ఇట్టే చుట్టేసుకునే
పాదరక్షల్లో బోలెడన్ని డిజైన్లు
ఇప్పుడు మన మదిని పట్టేస్తున్నాయి.
పాము కుబుసంలాంటి స్ట్రాప్స్‌తో
పువ్వులు, సీతాకోకచిలుకలు
అల్లుకునే తీరుతో
లెదర్, ఫైబర్, ఫ్యాబ్రిక్
మెటీరియల్ లెక్కింపు లేకుండా
క్రిస్టల్స్, స్వరోస్కి, కుందన్స్, మువ్వలు..
పాదం నుంచి మోకాలి వరకు
డ్రెస్ డిజైన్‌ను మరింత పెంచేలా
నడకలో రాజసం కదిలేలా
పార్టీవేర్ ఫుట్‌వేర్
కొత్తగా మెరిసిపోతుంది.











నడకలోనే కాదు కాలికి ధరించే పాదరక్షల్లోనూ అందం ఉండాలనుకుంటారు. స్టైలిష్‌గా కనిపించడంతో పాటు నడక కూడా అంతే దీటుగా ఉండాలనుకునేవారికి సరైన సమాధానంలా ఉంటున్నాయి ఈ ఈవెనింగ్ శాండల్స్. స్ప్రింగ్‌లా ఉండే స్ట్రాప్స్ కాలిని చుట్టుకుపోతూ, చివరి భాగం పాము తలను పోలిన డిజైన్‌తో ఉంటుంది. ఈవెనింగ్ శాండల్స్ అని పేరున్న ఇవి పార్టీవేర్‌గా వెలిగిపోతున్నాయి.

* * *

లాంగ్ ఫ్రాక్స్ లేదా జీన్స్ ధరించినప్పుడు ప్లెయిన్ స్పైరల్ స్ట్రాప్స్ శాండల్స్ క్యాజువల్ వేర్‌గా నప్పుతాయి. రిసెప్షన్ వంటి సాయంకాలపు వేడుకలలో ధరించే డ్రెస్సులకు షాండ్లియర్ రోప్ స్ట్రాప్ ఫుట్‌వేర్ స్టైలిష్ లుక్‌ని పెంచుతుంది. వీటిలో స్టోన్స్‌తో తీర్చిన పువ్వులు, లతలు ఉన్న డిజైన్స్‌ని ఎంచుకోవచ్చు.







ప్రయోగ జీవనం

కొన్ని అలలు కాసిన్ని నక్షత్రాలు

మన దేశంలో బతుకు బాదరబందీ
కోసం చాలామంది కష్టపడుతుంటారు.
కాని నెదర్లాండ్స్‌కు చెందిన ఒక అమ్మాయి
చాలా సింపుల్‌గా సంవత్సర కాలంగా జీవిస్తోంది.
ఒక వ్యాన్‌నే ఇల్లుగా చేసుకొని దేశమంతా తిరుగుతోంది.
సముద్రం ఒడ్డున బస... నక్షత్రాల కింద నిద్ర...
చాలదా జీవితానికి అని ప్రశ్నిస్తుంది?
తమిళనాడు మహాబలిపురం దగ్గర
వ్యాన్ నిలబెట్టుకుని సముద్రంతో కబుర్లు చెప్పే
ఈ అమ్మాయిని అంతా వింతగా చూస్తుంటారు.
ఆమె అందరినీ వింతగా. ఎవరి బతుకు ఎవరికి వింత?





తన వ్యాన్‌తో మారియా



సర్ఫింగ్ చేస్తూ...

చెన్నై దగ్గర ఉన్న మహాబలిపురం నుంచి ఇంకో ఇరవై ముప్పై కిలోమీటర్లు ఉంటుంది మామళ్లపురం. చిన్న ఊరు అది. సముద్రం ఘోష. దాని ఒడ్డునే ఒక వ్యాన్‌ని చూడవచ్చు. పూలు, లతలు, మత్స్యకన్యలు గీసి ఆకర్షణీయంగా ఉండే ఆ వ్యాన్ గత సంవత్సర కాలంగా మారియా ఉండెరింక్ ఇల్లు. అదే ఆమె వాహనం కూడా. వ్యాన్ నెత్తి మీద సర్ఫ్ బోర్డ్, స్కేట్‌బోర్డ్‌ను కట్టి ఉంచుకుంటుంది. వ్యాన్ లోపల పడుకునే స్థలం, పుస్తకాల ర్యాకు, బట్టలు పెట్టుకునే చోటు, పాటలు వినడానికి స్పీకర్లు... ఇవన్నీ ఉంటాయి.

నెదర్లాండ్స్‌కు చెందిన మారియా సంవత్సర కాలంగా దేశంలో ఉంటోంది. రెండేళ్ల క్రితం ఆమె 'జంపా క్రియేషన్స్' పేరుతో చిన్న ఆన్‌లైన్ బిజినెస్ మొదలెట్టింది. ఆర్గానిక్‌గా తయారు చేసిన అగరు బత్తీలు, పరిమళ తైలాలు విక్రయిస్తుంది. వాటికేం ఆఫీసు అక్కర్లేదు కనుక ఆన్‌లైన్‌లో వచ్చిన ఆర్డర్లను కొరియర్ ద్వారా పంపిస్తుంది. వాటి మీద వచ్చే డబ్బులే ఆమె ఆదాయం. మరి మిగిలిన సమయమో? ఆమెనే అడుగుదాం.

ఎక్కడ నచ్చితే అక్కడే

సంవత్సరం క్రితం ఇండియా వచ్చిన మారియా మొదట చేసిన పని ఢిల్లీలో ఒక సెకండ్ హ్యాండ్ వ్యాన్ కొనడం. దానిని తనకు తగినట్టుగా చిన్న చిన్న మార్పులు చేసుకోవడం. ఆ తర్వాత దానిని తీసుకొని దేశం చూడటానికి బయలుదేరడం. 'మొదట రాజస్థాన్ వెళ్లాను. అక్కడ చాలా రోజులు ఉన్నాను. ఆ తర్వాత గోవాలో కొన్నాళ్లు. ఈ ఊరిలో సర్ఫింగ్ పోటీలు ఉన్నాయంటే మొన్నటి జూలైలో వచ్చాను. పోటీలో సెమీ ఫైనల్స్ దాకా వెళ్లాను. గెలవలేదు. కాని నాకు ఈ ఊరు చాలా నచ్చింది. అందుకే ఇక్కడ ఉండిపోయాను' అంటుంది మారియా. మామళ్లపురం బెస్తవాళ్లు ఆమెను వింతగా చూస్తారు తప్ప అంతరాయం కలిగించరు. తోచినప్పుడల్లా సర్ఫ్‌బోర్డ్ తీసుకొని సముద్ర అలల మీద తేలుతుంటుంది మారియా. లేదంటే వ్యాన్‌లో కూచుని పుస్తకాలు చదువుకుంటూ ఉంటుంది. ఎప్పుడైనా ల్యాప్‌టాప్‌లో పని.

కొన్ని జాగ్రత్తలు

ప్రయాణంలో పెట్రోల్ బంకులనే తన కాలకృత్యాల కోసం ఉపయోగించుకుంటుంది. ఫోన్, ల్యాప్‌టాప్ చార్జింగ్ కావాలంటే ఏదో ఒక కాఫీ షాప్‌కు వెళుతుంది. మిగిలిన అన్ని పనులకు వ్యాన్ ఉంటుంది. 'వ్యాన్‌ను ఎప్పుడూ నీట్‌గా పెట్టుకుంటాను. ఎందుకంటే అది నేను ఉండాల్సిన చోటు కదా' అంటుంది. వ్యాన్‌లో ఆమె అమ్మే వస్తువులు సువాసన వ్యాపింపచేస్తుంటాయి. 'సోలార్ ప్యానల్స్ బిగించిన మెటాడర్ వ్యాన్ కొనుక్కోవాలని ఉంది. అదైతే ఇంకా సౌకర్యంగా ఉంటుంది' అంటుంది మారియా. 'జీవితం ఇలా బాగుంది. సింపుల్‌గా' అంటుంది.

'కొన్ని గ్రిల్ చేసిన కూరగాయల భోజనం. రాత్రిళ్లు నక్షత్రాల కింద పడక. ఇంతకు మించి ఏం కావాలి?' అంటుంది మారియా. ఏం కావాలో తెలియక నాగరీకులు ఉదయం లేచి ఉరుకుల పరుగుల మీద అన్వేషిస్తూ ఉంటారు. వారికి మారియా ఒక వింత. వారు మారియాకు.

బ్యూటిప్

మజ్జిగ... జుట్టుకు చల్లగా

ఆరోగ్యానికి మజ్జిగ మంచిదని రోజుకి కనీసం ఒకగ్లాసు అయినా తాగుతుంటాం. అయితే మజ్జిగ జుట్టు, చర్మ సంరక్షణలో చక్కగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. చుండ్రుని తగ్గించి, జుట్టుని ఒత్తుగా పెంచడం, మొటిమలను మాయంచేసి చర్మాన్ని మెరిపించడంలో మజ్జిగ చక్కగా పనిచేస్తుంది. ఈ ప్రయోజనాలన్నీ పొందాలంటే మజ్జిగను ఈ విధంగా వాడాలి.. ● చుండ్రు సమస్య తీవ్రంగా ఉండి పదేపదే విసిగిస్తుంటే ..పుల్లటి మజ్జిగను కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి అరగంట తరవాత కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేయడం వల్ల మాడుకు తేమ అంది చుండ్రు సమస్య తగ్గుతుంది. ● జుట్టు పలుచగా నిర్జీవంగా అనిపిస్తే... శనగపిండిలో ఆలివ్ ఆయిల్, మజ్జిగ వేసి కలిపి జుట్టు కుదుళ్ల నుంచి చివర్లవరకు పట్టించి మర్దన చేయాలి. అరగంట తరువాత షాంపు, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.



అదే ఇడ్లీ... అదే దోశ చట్నీలైనా మారుద్దాం!

వంటిల్లు

నోటికి రుచికరమైన చట్నీ లేకపోతే బ్రేక్‌ఫాస్ట్ కూడా బోర్ కొడుతుంది. ఇడ్లీ, దోశలతోపాటు రోజూ తినే పల్లీ, కొబ్బరి, పుట్నాలు, టొమాటో పచ్చడి కాకుండా కాస్త విభిన్నంగా, హెల్దీగా ఉండే వివిధ రకాల చట్నీలు ఎలా చేసుకోవాలో చూద్దాం...



మొరింగా చట్నీ

కావలసినవి: నూనె – టీస్పూను, ములగ ఆకులు – అరకప్పు, పచ్చిమిర్చి – మూడు, పచ్చికొబ్బరి తురుము – అరకప్పు, అల్లం తురుము – టీస్పూను, నిమ్మరసం – టీస్పూను, ఉప్పు – రుచికి సరిపడా.

తాలింపు కోసం: నూనె – టీస్పూను, ఆవాలు – అరటీస్పూను, జీలకర్ర – పావు టీస్పూను, కరివేపాకు – రెండు రెమ్మలు.

తయారీ: ● బాణలిలో నూనె వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నూనెలో పచ్చిమిర్చి, ములగ ఆకులు వేసి దోరగా వేయించాలి ● ఇప్పుడు మిక్సీజార్‌లో కొబ్బరి తురుము, వేయించిన ములగ ఆకులు, పచ్చిమిర్చి, నిమ్మరసం, అల్లం, రుచికి సరిపడా ఉప్పు, అరప్పు నీళ్లపోసి మెత్తగా రుబ్బుకుని గిన్నెలో వేసుకోవాలి ● తాలింపు వేసుకుని ఈ మిశ్రమాన్ని చట్నీలో కలిపితే రుచికరమైన మొరింగా చట్నీ రెడీ. దోశ, చపాతీల్లోకి ఇది మంచి సైడ్ డిష్. చట్నీలో నిమ్మరసానికి బదులు చింతపండు లేదా పెరుగు కూడా వేసుకోవచ్చు.



వాల్‌నట్ చట్నీ

కావలసినవి: పచ్చికొబ్బరి తురుము – అరకప్పు, వాల్‌నట్స్ – పావు కప్పు, పచ్చిమిర్చి – మూడు, అల్లం – అరంగుళం ముక్క, చింతపండు – గోలీకాయంత, కరివేపాకు – రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను, ఉప్పు– రుచికి సరిపడా.

తాలింపు దినుసులు: నూనె – టీస్పూను, ఆవాలు – పావు టీస్పూను, మినపగుళ్లు –పావు టీస్పూను, ఇంగువ – చిటికెడు.

తయారీ: ● కొబ్బరి తురుము, వాల్‌నట్స్, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర తరుగు, కరివేపాకు రుచికి సరిపడా ఉప్పు వేసి, అవసరాన్ని బట్టి కొద్దిగా వేడి నీళ్ల పోసి మెత్తగా రుబ్బుకోవాలి. ● ఇప్పుడు తాలింపు దినుసులతో తాలింపు వేసి రుబ్బిన పచ్చడిలో కలిపితే వాల్‌నట్ చట్నీ రెడీ. ఇడ్లీ, దోశ, ఉప్మా, పన్యారంలలో ఈ చట్నీ చాలా బావుంటుంది.



క్యాప్సికం చట్నీ

కావలసినవి: ఎర్రక్యాప్సికం – పెద్దది ఒకటి, ఉల్లిపాయ – సగం, వెల్లుల్లి రెబ్బలు – రెండు, కరివేపాకు – రెండు రెమ్మలు, ఎండుమిర్చి – ఐదు, చింతపండు –గోళికాయంత, పల్లీలు – పావు కప్పు, బెల్లం తురుము – అటీస్పూను, నూనె – రెండు టీస్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా.

తాలింపు కోసం: నూనె – అరటీస్పూను, ఆవాలు – అరటీస్పూను, ఇంగువ – చిటికెడు, కరివేపాకు – ఒక రెమ్మ.

తయారీ: ● ముందుగా స్టవ్ మీద బాణలిపెట్టి రెండు టీస్పూన్ల నూనె వేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో వెల్లుల్లి, ఎండు మిర్చి, కరివేపాకు, తరిగిన ఉల్లిపాయను వేసి రెండు నిమిషాలు వేయించాలి ● ఇప్పుడు క్యాప్సికంను ముక్కలుగా తరిగి వేసి మగ్గాక స్టవ్ ఆపేసేయాలి ● మరో బాణలిలో పల్లీలు వేసి చక్కగా వేయించి పెట్టుకోవాలి ● ఇప్పుడు వేయించి పెట్టుకున్న క్యాప్సికం, ఉల్లిపాయ మిశ్రమం, పల్లీలు, చింతపండు, బెల్లం, రుచికి ఉప్పును మిక్సీజార్‌లో వేసుకుని మెత్తగా రుబ్బుకోవాలి. అవసరాన్ని బట్టి కొద్దిగా వేడి నీళ్ల పోసుకోవాలి ● తాలింపు పెట్టుకుని రబ్బుకున్న పచ్చడిలో కలిపితే క్యాప్సికం చట్నీ రెడీ. ఇది ఇడ్లీ, దోశ, చపాతీలోకేగాక ఇతర స్నాక్స్, అన్నంలోకి కూడా చాలా బావుంటుంది.





అవిసె గింజల చట్నీ పొడి

కావలసినవి: అవిసె గింజలు – అరకప్పు, పచ్చిశనగపప్పు – పావు కప్పు, మినపగుళ్లు –పావు కప్పు, ఎండుకొబ్బరి తురుము – పావు కప్పు, ఎండు మిర్చి – పన్నెండు, కరివేపాకు – రెండు రెబ్బలు, చింతపండు – చిన్నసైజు నిమ్మకాయంత, ఇంగువ – పావు టీస్పూను, బెల్లం తురుము – టీస్పూను, నూనె – టీస్పూను.

తయారీ: ● ముందుగా అవిసెగింజలు, శనగపప్పు, మినపగుళ్లను సన్నని మంటమీద దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి ● ఎండుకొబ్బరిని కూడా దోరగా వేయించి తీసుకోవాలి ● ఇప్పుడు టీస్పూను ఆయిల్‌లో ఎండు మిర్చి, కరివేపాకు వేసి చక్కగా వేయించుకోవాలి ● వేయించిన పదార్థాలన్నీ చల్లారాక మిక్సీజార్‌లో వేయాలి. దీనిలో బెల్లం, ఇంగువ, రుచికి సరిపడా ఉప్పువేసి పొడిలా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన పొడిని గిన్నెలో వేసి చేతితో చక్కగా కలుపుకుని ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేసుకోవాలి. అన్నం, రోటీ, చపాతీ, దోశల్లోకి ఈ పొడి చాలా బావుంటుంది.



ప్రపంచంలోని ఎత్తైన చెట్టు హైపరియన్ (కోస్ట్ రెడ్‌వుడ్) కాలిఫోర్నియాలోని 'రెడ్‌వుడ్ నేషనల్ పార్క్'లో ఒక మారుమూల ప్రాంతంలో ఉంది. దీని ఎత్తు 380 అడుగులు. ఈ చెట్టు ఎక్కడ ఉందనేది రహస్యంగా ఉంచారు. ఎవరైనా ఇక్కడ కనిపిస్తే ఆరునెలల జైలు శిక్ష విధిస్తారు.

ENGLISH ఇడియమ్స్

మేక్ నో బోన్స్ ఎబౌట్ ఇట్

ఏదైనా విషయంపై ఊగిసలాట ధోరణి లేకుండా అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పడం, నిష్కర్షగా కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం, నేను సాధించగలను...అనే గట్టి ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించడం...మొదలైన సందర్భాల్లో ఉపయోగించే ఇడియమ్ ఇది. ఉదా: 1. ది పేరెంట్స్ ఆర్ మేకింగ్ నో బోన్స్ ఎబౌట్ దేర్ డిస్‌ప్లెజర్ వోవర్ ఆన్‌లైన్ టీచింగ్ డూరింగ్ ది పాండమిక్ 2. మేక్ నో బోన్స్ ఎబౌట్ ఇట్. వుయ్ ఆర్ గోయింగ్ టు విన్

ఇక దీన్ని మూలాల్లోకి వెళితే...15వ శతాబ్దం ఇంగ్లాండ్‌లో విందులో భాగంగా ఇచ్చే సూప్‌లో ఎముకలు కనిపిస్తే చాలు ఏం ఆలోచించకుండా ముఖం మీద నిలదీసేవారు. మనసులో ఉన్నది ఉన్నట్లు మాట్లాడేవారు. బోన్స్ లేని సూప్ ఉత్తమం అని, బోన్స్ ఉన్న సూప్ చెత్త అని నమ్మకం ఉండేది. ఈ నేపథ్యం నుంచి పుట్టిందే...మేక్ నో బోన్స్ ఎబౌట్ ఇట్.

● ఆర్ట్ అండ్ కల్చర్


రారా... చోరా



'బర్త్ డే విషెస్ ఇలాగే చెప్పాలి' అనే రూల్ ఏమీ లేదు. ఎప్పుడైనా, ఎలాగైనా చెప్పవచ్చు. ఇట్టి విషయం చోరాగ్రేసరులకు తెలియకుండా ఉంటుందా. తమ సాటి చోరుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు ఎలా తెలియజేశారో చూశారు కదా! బర్త్ డే రోజు స్వీట్ ముక్కకు బదులుగా 'సర్‌ప్రైజ్ షాక్ మైసూర్‌పాక్' తినిపించారన్నమాట. ఇరాన్ కార్టూనిస్ట్ మహ్నాజ్ యజ్దానీ గీసిన కార్టూన్ ఇది. యానిమేషన్ కార్టూనిస్ట్, స్క్రీన్ రైటర్, డైరెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్న మహ్నాజ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు సొంతం చేసుకుంది. యూనివర్శిటీలో యానిమేషన్ పాఠాలు బోధిస్తుంది.

● గేమింగ్

కత్తిర్నాక్ ఆట




పాయింట్ అండ్ క్లిక్ ఎడ్వెంచర్ గేమ్ 'రిటర్న్ టూ మంకీ లాండ్' రేపు విడుదలవుతుంది. మంకీ ఐలాండ్ సిరీస్‌లో వస్తున్న ఆరో గేమ్ ఇది. ఈ గేమ్ లక్ష్యం విషయానికి వస్తే నెరేటివ్ ఛేజ్‌డ్ పజిల్స్ ఛేదిస్తూ ముందుకువెళ్లాలి. గతంలో వచ్చిన 2డీ గేమ్స్‌తో పోల్చితే ఈ గేమ్ ప్లేయర్స్‌కు భిన్నమైనది. గతంలో ఎడ్వెంచర్‌గేమ్స్‌లో అనుభవం లేని వారి కోసం సింప్లీఫైడ్ మోడ్ అందుబాటులో ఉంది. గత గేమ్స్‌లో ఉన్న ప్రధాన పాత్రలు మళ్లీ పలకరిస్తాయి. అమెరికన్ వీడియో గేమ్ డిజైనర్, ప్రోగ్రామర్. ప్రొడ్యూసర్ రాన్ గిల్బర్ట్ ఈ గేమ్‌కు డైరెక్టర్.

ప్లాట్‌ఫామ్స్: విండోస్, నిన్‌టెండో స్విచ్ **జానర్:** గ్రాఫిక్ ఎడ్వెంచర్ **మోడ్:** సింగిల్ ప్లేయర్

● సృజన

ఒక కథ చెబుతా వింటారా...

సచిన్ చెప్పేవి రాజులు, రాణుల కాల్పనిక కథలు కావు. సామాన్యుల కథలు. కదలించే కథలు. డాక్టర్ కాబోయి యాక్టర్ కాలేదు...ఇంజనీరింగ్ చదివి ఫిల్మ్‌మేకర్ అయ్యాడు సచిన్ ధీరజ్ ముదిగొండ. 'అట్టడుగున పడి కనిపించని కథలు కావాలిప్పుడు' అంటూ కెమెరాను బలమైన మాధ్యమం చేసుకున్నాడు. చిన్న వయసులోనే ఫిల్మ్‌మేకర్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు....





● సచిన్ ధీరజ్

యూనివర్శిటీ ఆఫ్ ఆస్టిన్ ఫిల్మ్ అండ్ మీడియా ప్రొడక్షన్ స్టూడెంట్ సచిన్ ధీరజ్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే చెప్పలేనంత పిచ్చి. ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కూడా పాఠాల కంటే ప్రముఖ సినిమాలలోని గొప్ప సీన్‌ల గురించే స్నేహితులతో చర్చిస్తూ కనిపించేవాడు.

సత్యజిత్ రే నుంచి మణిరత్నం వరకు తనకు ఇష్టమైన దర్శకులు ఎందరో ఉన్నారు. నిద్రలో నుంచి లేపి టక్కుమని అడిగినా వారి సినిమాలోని సీన్‌ల గురించి వివరంగా చెప్పగలడు. సినిమాల మీద ఆసక్తి ఉన్న కుర్రాళ్లు పక్కా కమర్శియల్ కథతో టాలీవుడ్‌లోనో, బాలీవుడ్‌లోనో ల్యాండ్ అవుతారు. కానీ హైదరాబాద్‌కు చెందిన సచిన్ ధీరజ్‌లో కమర్శియల్ కలలు కనిపించవు.

తనను కదిలించేదే కథ!

శాన్‌మార్కోస్(యూఎస్)లో 'ది బబుల్‌మ్యాన్'గా పిలవబడే వ్యక్తి ఒకరు ఉన్నారు. క్యాంపస్‌లో పిల్లల్ని ఆనందంలో ముంచెత్తడం నుంచి జీవితం పట్ల అతని దృక్పథం వరకు ఎన్నో ఆకర్షించాయి. 'ది బబుల్ మ్యాన్' నచ్చడంతో షార్ట్ ఫిల్మ్ తీశాడు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఎన్నో ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో ప్రదర్శించారు. తన ఫిల్మ్‌ను ప్రేక్షకులతో కలిసి చూస్తున్నప్పుడు వారి స్పందన చూసిన తరువాత ఇక సినిమాతోనే ఉండిపోవాలని బలంగా అనుకున్నాడు.

మంచి సినిమాలు చూడడం మాత్రమే కాదు, పాలగుమ్మి సాయినాథ్ రాసిన 'ఎవ్రీబడీ లవ్స్ ఏ గుడ్ డ్రాట్'లాంటి పుస్తకాలు చదవడం అంటే కూడా సచిన్ ధీరజ్‌కు ఎంతో ఇష్టం. ఈ పుస్తకం తన ఫిల్మ్ మేకింగ్‌పై బలమైన ప్రభావం చూపించిందని చెబుతాడు ధీరజ్.

గుజరాత్‌లోని గిరిజన మహిళ అనాబెన్ పవర్‌ను మంత్రగత్తె అనే ముద్ర వేసిన గ్రామస్థులు రకరకాలుగా హింసించారు. చంపే ప్రయత్నం చేశారు. వేరొకరైతే భయపడి వణికిపోయి పారిపోయేవారు. కాని అనాబెన్ భయపడలేదు. ధైర్యంగా నిలబడి న్యాయపోరాటం చేస్తోంది.

అనాబెన్ పోరాటం ధీరజ్‌ను ఆకట్టుకుంది. ఆమె మీద షార్ట్ డాక్యుమెంటరీ తీయాలనుకొని సంప్రదించాడు. అయితే అనాబెన్ మొదట ధీరజ్‌ను నమ్మలేదు. చాలా అనుమానంగా చూసింది. శత్రువుల పన్నాగం అనుకుంది. 'నేను మీ కథను ప్రపంచానికి వినిపించడానికి వచ్చాను' అని నమ్మించడానికి కష్టపడాల్సి వచ్చింది. అయితే అతడి కష్టం వృథా పోలేదు.

మెల్లగా మనసు విప్పింది బెన్.

అలా ఆమె కష్టాలు, కన్నీళ్లు, పోరాటం 'టెస్టిమనీ ఆఫ్ అనా' పేరుతో షార్ట్ డాక్యుమెంటరీగా రూపుదిద్దుకుంది. ఇది బెస్ట్-నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నేషనల్ అవార్డ్ అందుకుంది. కేరళలో జరిగిన ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో టాప్ ప్రైజ్ గెలుచుకుంది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడింది.

ఈ ఫిల్మ్ ద్వారా వచ్చిన డబ్బులను కోర్ట్ ఖర్చుల కోసం అనాబెన్‌కు ఇవ్వనున్నారు.

మంచి సినిమాలు చూడడం మాత్రమే కాదు, పాలగుమ్మి సాయినాథ్ రాసిన 'ఎవ్రీబడీ లవ్స్ ఏ గుడ్ డ్రాట్'లాంటి పుస్తకాలు చదవడం అంటే కూడా సచిన్ ధీరజ్‌కు ఎంతో ఇష్టం. ఈ పుస్తకం తన ఫిల్మ్‌మేకింగ్‌పై బలమైన ప్రభావం చూపించిందని చెబుతాడు ధీరజ్.

'ప్రతి ఫిల్మ్‌మేకర్‌కు తనదైన సొంత ప్రయాణం ఉటంంది' అంటాడు ధీరజ్.

మరి అతడి ప్రయాణ అనుభవాలు మరిన్ని మంచి చిత్రాలకు ప్రేరణ అవుతాయనడంలో సందేహం లేదు.

● యంగ్ టాలెంట్

సూపర్ సింగర్



● భువనేష్

ఎన్నిసార్లైనా 'శబ్బాష్' అంటూ మెచ్చుకోవచ్చు భువనేష్‌ను.

ఒకే గొంతుపై ఎంతోమంది గాయకులను తీసుకు వస్తూ తీయని పాటలు వినిపిస్తున్నందుకు, జటిలమైన శ్లోకాలను అలవోకగా వల్లిస్తున్నందుకు, హుషారెత్తేలా గిటార్ వాయిస్తున్నందుకు, మైమరిచిపోయేలా వేణుగానం వినిపిస్తున్నందుకు, వాయిద్యాలతోనే కాదు నోటితో కూడా వాయిద్యాల ధ్వనిని అద్భుతంగా పలికిస్తున్నందుకు, మెరుపు వేగంతో నృత్యాలు చేస్తున్నందుకు, మిమిక్రీ చేస్తూ నవ్విస్తున్నందుకు....మన భువనేష్‌ను ఎన్నిసార్లైనా మెచ్చుకోవచ్చు.

స్టార్‌మా రియల్టీ షో సూపర్ సింగర్ జూనియర్‌లో థర్డ్ ప్లేస్‌లో నిలిచి సంగీతాభిమానులను ఆకట్టుకున్న భువనేష్ విజయనగరంలోని ద్వారకామాయి అంధుల పాఠశాల విద్యార్థి. పాఠాలైన, పాటలైనా బ్రెయిల్‌లిపిలో రాసుకుంటాడు. చిన్నప్పుడెప్పుడో ఒక టీవీ సీరియల్ ప్రోమో సాంగ్ విని అచ్చంగా అలా పాడేశాడు. నిజానికి ఆ పాటలో కష్టతరమైన పదాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు కష్టం అనిపించలేదు. అమ్మానాన్నలకు సంగీతం తెలియదు. తనకు సంగీతం నేర్పించే గురువు అంటూ లేరు. యూట్యూబ్‌నే గురువుగా చేసుకొని రకరకాల జానర్స్‌లో పాటలు నేర్చేసుకున్నాడు.

విజయనగరం నుంచి హైదరాబాద్‌కు వచ్చి పాడి సామాన్యప్రేక్షకుల నుంచి సంగీత ఉద్దండుల వరకు ఎంతోమంది ప్రశంసలు అందుకున్నాడు. పెద్దల ఆశీర్వాదబలం ఊరకే పోదు. ఆ బలం ఈ సూపర్‌సింగర్‌ను మరింత స్పీడ్‌గా ముందుకు తీసుకువెళుతుంది.

● టెక్..టాక్

గూగుల్ న్యూ ఇమోజీ బోనాంజా

కమ్యూనికేషన్‌లో ఇమోజీలు ఇప్పుడు నిత్యావసరం అయ్యాయి. కొత్త ఇమోజీలపై ఎప్పుడూ ఆసక్తి ఉంటుంది. తాజా వార్త ఏమిటంటే గూగుల్ యానిమేటెడ్ ఇమోజీలు త్వరలో ఆండ్రాయిడ్ డివైజ్, గెలాక్సీలలోకి రానున్నాయి. షేకింగ్ ఫేస్, జెల్లీఫిష్, అల్లం, దుప్పి, బాతు, గాడిద, పిల్లనగ్రోవి, హేయిర్ పిక్, రైట్ హ్యాండ్, లెఫ్ట్ హ్యాండ్, పింక్, ఎల్లో, గ్రే కలర్ హార్ట్...మొదలైన 31 ఇమోజీలు ఉన్నాయి. జీ-బోర్డ్ బేస్డ్ ఇమోజీ కిచెన్ ద్వారా ఇమోజీ కలర్స్‌ను తమకు ఇష్టం వచ్చిన రంగులో మార్చుకోవచ్చు.



ఇన్‌స్టాగ్రామ్ 'గిఫ్ట్స్'

కొన్నిసార్లు మన ఫెవరెట్ కంటెంట్ క్రియేటర్‌ను అభినందించడానికి 'లైక్'లు మాత్రమే చాలవు అనిపిస్తుంది. 'గిఫ్ట్' ఇవ్వాలనిపిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్లాట్‌ఫామ్స్ టిప్ లేదా డొనేట్ సిస్టంను ప్రవేశ పెట్టాయి. ఫోటో అండ్ షేరింగ్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్‌ల కోసం కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తుంది. ఈ టెస్ట్ ఫీచర్ పేరు గిఫ్ట్స్. దీని ద్వారా కంటెంట్ క్రియేటర్స్ అభిమానుల నుంచి 'గిఫ్ట్స్' అందుకోవచ్చు.

సినిమా

"దర్శకులు ఒక హిట్ తర్వాత పెద్ద స్టార్ కోసం ఎదురు చూస్తారు.. అందుకు తగ్గట్టు కథలు రాస్తారు. కానీ ఇంద్రగంటిగారు మాత్రం కథ రాసుకొన్న తర్వాత సరిపోయేవారిని ఎంచుకుంటారు. ఆయనతో వరుసగా సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అని హీరో సుధీర్ బాబు అన్నారు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో సుధీర్ బాబు, కృతీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి'. గాజులపల్లె సుధీర్ బాబు సమర్పణలో బి. మహేంద్రబాబు, కిరణ్ బళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు పంచుకున్న విశేషాలు.

ఈ సినిమానే మమ్మల్ని ఎంపిక చేసింది - సుధీర్ బాబు


● 'సమ్మోహనం, వి' చిత్రాల తర్వాత ఇంద్రగంటిగారితో నేను నటించిన మూడో చిత్రం 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి'. మా కాంబినేషన్ వల్ల ఈ సినిమా సెట్ కాలేదు.. సినిమానే మమ్మల్ని ఎంపిక చేసుకుంది. ఆయన నాలోని యాక్టర్‌ని నమ్మారు.. ఆయన కథల్ని నేను నమ్మాను.

● ఇంద్రగంటిగారి సినిమాల్లో ఎమోషన్ గొప్పగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆ పాత్రలతో ప్రయాణిస్తారు. ఈ సినిమాలో కమర్షియల్ మూవీ డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. కుటుంబాల మధ్య సంఘర్షణని చాలా వైవిధ్యంగా చూపించారు.

● 'ఉప్పెన' చిత్రానికి ముందే కృతీ శెట్టిని ఎంపిక చేశాం. ఈ సినిమాతో తను ఏ పాత్ర అయినా చేయగలదనే నమ్మకం వస్తుంది. నిర్మాతలు మహేంద్రబాబు, కిరణ్‌లకు గుర్తుండి పోయే సినిమా అవుతుంది. వివేక్ సాగర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. పీజీ విందాగారి విజువల్స్ అందంగా ఉంటాయి.

● నాకు అనుకోకుండానే దర్శకత్వం వైపు ఆసక్తి ఏర్పడింది. అయితే దర్శకత్వం ఎప్పుడు చేస్తానో తెలియదు. ఇప్పుడు నా దృష్టి నటనపైనే ఉంది. నా ఫస్ట్ సినిమా 'ఏమాయ చేసావె'లో నాగ చైతన్యతో నటించాను. తను మాట్లాడుతున్నపుడు చాలా పాజిటివ్ వైబ్ ఉంటుంది. ప్రీ రిలీజ్ వేడుకలో 'సుధీర్ ఆల్ రౌండర్' అని చైతు అనడం చాలా ఆనందంగా ఉంది. ఇన్నేళ్ల కెరీర్‌లో నటుడిగా తృప్తిగా ఉన్నాను.

● బాలీవుడ్‌లో 'బ్రహ్మాస్త్ర' సినిమా చాన్స్ వచ్చింది. ఆ టైమ్‌లో 'సమ్మోహనం' చేస్తున్నాను. అలాగే తెలుగు, హిందీ భాషల్లో పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చర్చల్లో ఉండటంతో 'బ్రహ్మాస్త్ర' చేయలేకపోయాను. ప్రస్తుతం 'హంట్, మామా మశ్చీంద్ర, యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా, 'సెహరి' దర్శకుడు జ్ఞానసాగర్‌తో ఓ సినిమా చేస్తున్నాను.



భారీ యాక్షన్ ప్లాన్


ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి సంబంధించి ఓ వార్త ప్రచారంలోకొచ్చింది. అదేంటంటే.. ఈ సినిమాలో ఐదు భారీ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయట. మూడో ప్రపంచం యుద్ధం నేపథ్యంలో ఈ సుదీర్ఘ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయని సమాచారం. ఇందు కోసం హాలీవుడ్‌కి చెందిన ఐదుగురు ఫైట్ మాస్టర్స్‌ని నియమించారట. ఒక్కో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ ఒక్కో ఫైట్ మాస్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని టాక్. అలాగే 'అవెంజర్స్', 'గాడ్జిల్లా', 'కింగ్ కాంగ్' వంటి హాలీవుడ్ చిత్రాలకు ఉపయోగించిన కెమెరాలను ఈ చిత్రానికి వాడుతున్నారట. ఇక ఈ చిత్రంలో ప్రభాస్ సరసన దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తుండగా అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వైజయంతి మూవీస్ పతాకంపై అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



● ప్రభాస్

పద్నాలుగు భాషలు.. పది నిమిషాల డైలాగ్!

సంభాషణలను అలవోకగా చెప్పగల నటుల్లో కమల్‌హాసన్ ముందు వరుసలో ఉంటారు. పాత్రకు తగ్గట్టు నటనలో, ఆహార్యంలో వ్యత్యాసం చూపించడం, సంభాషణలు పలకడంలో కమల్ సూపర్. ఇప్పుడు 65ఏళ్లకు పై బడిన వయసులోనూ కమల్ ఒకప్పటిలా సుదీర్ఘ సంభాషణలు చెప్పడం విశేషం. ఇటీవల 'ఇండియన్ 2' (భారతీయుడు 2) కోసం కమల్ పది నిమిషాల డైలాగ్ చెప్పారట. సింగిల్ టేక్‌లో కమల్ ఈ డైలాగ్ చెప్పడం, అది కూడా పద్నాలుగు భాషలు ఉన్న డైలాగ్ కావడంతో యూనిట్ సభ్యులు ఆశ్చర్య పోయారని కోలీవుడ్ టాక్. ఈ హై ఓల్టేజ్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందట. గతంలో శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా రూపొందిన 'ఇండియన్' (1996)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న విషయం తెలిసిందే. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. కొంత గ్యాప్ తర్వాత ఈ చిత్రం షూటింగ్‌ని ఇటీవలే ఆరంభించారు.



● కమల్‌హాసన్

వరలక్ష్మి చేజింగ్

అన్యాయాలను ఎదిరించడానికి సిన్సియర్ పోలీసాఫీసర్‌గా రంగంలోకి దిగారు వరలక్ష్మీ శరత్‌కుమార్. ఆమె లీడ్ రోల్‌లో రూపొందిన చిత్రం 'చేజింగ్'. ఈ తమిళ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ బ్యానర్ పై ఏఎన్ బాలాజీ తెలుగులో విడుదల చేస్తున్నారు. ''మా బేనర్లో 'ఒరేయ్ బామ్మర్ది, మై డియర్ భూతం' వంటి హిట్ చిత్రాలను అందించాం. 'చేజింగ్' మంచి యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్. ఇప్పటికే డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. వచ్చే నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని ఏఎన్ బాలాజీ అన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: కె. వీరకుమార్.



● వరలక్ష్మి

ఆ బ్యానర్‌లో సినిమా అంటే ఎగిరి గంతేస్తాం

- దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి

''నేను మీకు బాగా కావాల్సినవాడిని' షూటింగ్‌లో ఏ సమస్యనూ ఎవరి ముందూ పెట్టకుండా దివ్య దీప్తి గారు చేసుకుంటూ వెళ్లిపోయారని విన్నాను. దీనికి మూల కారణం కోడి రామకృష్ణగారు. వాళ్ల బ్యానర్‌లో సినిమా అంటే ఎగిరి గంతేసి ఒప్పుకుంటాం.. నేను కూడా అదే చేశాను'' అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. కిరణ్ అబ్బవరం, సంజనా ఆనంద్ జంటగా శ్రీధర్ గాదె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నేను మీకు బాగా కావాల్సిన వాడిని'. కోడి దివ్య దీప్తి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో చిత్ర దర్శకుడు శ్రీధర్ గాదె మాట్లాడుతూ- ''లెజెండరీ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డిగారితో వర్క్ చేయడం హ్యాపీ. నా రెండో సినిమానే మణిశర్మగారితో చేయడం నా అదృష్టం'' అన్నారు. ''ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఈ వేడుకలో కోడి దివ్య దీప్తి, కిరణ్ అబ్బవరం, సంజనా ఆనంద్, సోనాల్ ఠాకూర్ పాల్గొన్నారు.



● వశిష్ట, కృష్ణారెడ్డి, శ్రీధర్, సాయి శ్రీనివాస్, కిరణ్

దొంగలొస్తున్నారు జాగ్రత్త!



● ప్రీతి అస్రాణి, శ్రీ సింహా

శ్రీ సింహా కోడూరి, ప్రీతి అస్రాణి జంటగా సముద్ర ఖని కీలక పాత్రలో నటించిన చిత్రం 'దొంగలున్నారు జాగ్రత్త'. సతీష్ త్రిపుర దర్శకత్వం వహించారు. సురేష్ ప్రొడక్షన్స్, గురు ఫిలింస్‌పై డి. సురేష్‌బాబు, సునీత తాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. శ్రీ సింహా మాట్లాడుతూ- ''యూనిక్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'దొంగలున్నారు జాగ్రత్త'. నా కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి గొప్ప కాన్సెప్ట్ ఉన్న చిత్రంలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు. ''మా చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇస్తుంది'' అన్నారు సునీత తాటి. ''దర్శకునిగా అవకాశం ఇచ్చిన సురేష్‌బాబు, సునీతగార్లకు థ్యాంక్స్. తెలుగులో వస్తున్న మొదటి సర్వైవల్ థ్రిల్లర్ మూవీ ఇది'' అన్నారు సతీష్ త్రిపుర. ఈ కార్యక్రమంలో నటుడు శ్రీకాంత్ అయ్యంగార్, కెమెరామేన్ యశ్వంత్, సంగీత దర్శకుడు కాల భైరవ, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ నడి కుడికర్ మాట్లాడారు. ఈ చిత్రానికి సహనిర్మాతలు: యువరాజ్ కార్తికేయన్, చిత్రా సుబ్రమణ్యం, వంశీ బండారు, లైన్ ప్రొడ్యూసర్: డి. రామ బాలాజీ.

శ్రీ మహావిష్ణు మహిమలు



● వినయ్ రాజ్

నేటి యువతకు శ్రీ మహావిష్ణు మహత్యం తెలియజేయాలనే సంకల్పంతో రూపొందించిన చిత్రం 'శ్రీ రంగనాయక'. దుండిగల్ వినయ్ రాజ్ లీడ్ రోల్‌లో నటించిన ఈ చిత్రానికి నంది వెంకట్ రెడ్డి దర్శకత్వం వహించారు. గోవింద రాజ్ విష్ణు ఫిలింస్ బ్యానర్‌పై రామావత్ మంగమ్మ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించడంతో పాటు డ్రమ్స్ రాము సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను విడుదల చేశారు. ''శ్రీ రంగనాయక' చిత్రంలో శ్రీ మహావిష్ణు పాత్రలో నటించడం పూర్వజన్మ సుకృతం'' అన్నారు దుండిగల్ వినయ్ రాజ్. ''మా చిత్రం హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు రమావత్ మంగమ్మ. ఈ వేడుకలో ఏవీ కాలేజ్ ప్రిన్సిపల్ సీహెచ్ రాజలింగం, నటులు కుప్పిలి శ్రీనివాస్, గబ్బర్ సింగ్ సాయి పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: యాదగిరి.

సినీ కార్మికుల వేతనాలు పెంపు

తెలుగు సినీ కార్మికుల వేతనాల పెంపునకు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి నిర్ణయం తీసుకున్నాయి. కార్మికుల డిమాండ్ మేరకు 30శాతం వేతనాలు పెంచుతున్నట్లు నిర్మాతల మండలి, ఫిల్మ్ ఛాంబర్, ఫిలిం ఫెడరేషన్ ప్రకటన విడుదల చేశాయి. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి 2018లో చేసిన వేతనాల ఒప్పందాన్ని అనుసరించి పెద్ద చిత్రాలకు 30 శాతం, చిన్న సినిమాలకు 15 శాతం పెంచేందుకు అంగీకరించారు. పెంచిన వేతనాలు 01-07-2022 నుండి 30-06-2025 వరకు అమలులో ఉంటాయి. అయితే ఏది పెద్ద సినిమా? ఏది చిన్న సినిమా అనేది చలన చిత్ర వాణిజ్య మండలి, ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లతో కూడిన కమిటీ నిర్ణయిస్తుంది. ఈ చర్చల్లో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్' 'దిల్' రాజు, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు బసిరెడ్డి, గౌరవ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, ప్రొడ్యూసర్స్ సెక్టార్ కౌన్సిల్ చైర్మన్ యేలూరు సురేందర్ రెడ్డి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కల్యాణ్, గౌరవ కార్యదర్శి ప్రసన్న కుమార్, తెలంగాణ స్టేట్ చలన చిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి కె. అనుపమ్ రెడ్డి, తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	413	59,866
నిఫ్టీ ▽	126	17,877

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,679	▽	40
డోజోన్స్	31,262	▽	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,282	△	5
డాక్స్	12,957	▽	71
షాంఘై	3,199	▽	38
నికాయ్	27,876	△	57

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

60 వేల దిగువకు సెన్సెక్స్

- 17,900 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- ఐటీ, ఫార్మా షేర్లలో అమ్మకాలు
- రెండో రోజూ సూచీలు డీలా



ముంబై: స్టాక్ సూచీలు రెండోరోజూ డీలాపడ్డాయి. సెన్సెక్స్ 413 పాయింట్లు నష్టపోయి 60 వేల దిగువన 59,866 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 18 వేల స్థాయిని కోల్పోయింది. చివరికి 126 పాయింట్లు పతనమై 17,877 వద్ద నిలిచింది. డెరివేటివ్స్ వీక్లీ ఎక్స్‌పైరీ నేపథ్యంలో పలు రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్(3%), రిలయన్స్(ఒకశాతం) పతనమై సూచీలను ఏదశలోనూ కోలుకోనివ్వలేదు. అయితే ఆటో, మెటల్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు క్షీణించి రూ.79.71 వద్ద స్థిరపడింది. ఆయిల్ కంపెనీల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడంతో రూపాయిపై ఒత్తిడి పడిందని నిపుణులు తెలిపారు.

లాభాల్లోంచి నష్టాల్లోకి...

సెన్సెక్స్ 108 పాయింట్ల లాభంతో 60,454 వద్ద, నిఫ్టీ 42 పాయింట్లు పెరిగి 18,046 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఒక దశలో సెన్సెక్స్ 329 పాయింట్లు, నిఫ్టీ 92 పాయింట్లను ఆర్జించాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో సూచీలు నష్టాల బాట పట్టాయి.

మెప్పించని తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిస్టింగ్

తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ షేరు లిస్టింగ్ తొలి రోజే నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.510తో పోలిస్తే ఫ్లాటుగా రూ.510 వద్దే లిస్టయ్యింది. రూ.484.5 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో 0.5శాతం స్వల్ప నష్టంతో రూ.508 వద్ద ముగిసింది.

పీవీఆర్ షేర్ల అమ్మకం

మూడు ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ ఈక్విటీ ఫండ్లు మల్టీప్లెక్స్ వ్యాపార సంస్థ పీవీఆర్‌కు చెందిన 40.45 లక్షల ఈక్విటీ షేర్లను ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించాయి. ఈ లావాదేవీ విలువ రూ.759.14 కోట్లుగా ఉంది. ఫలితంగా బీఎస్ఈలో పీవీఆర్ షేరు 4.40 శాతం నష్టపోయి రూ.1,844 వద్ద స్థిరపడింది.

కొనసాగిన ఎస్‌బీఐ రికార్డు

రెండోరోజూ ఎస్‌బీఐ షేరు జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. ట్రేడింగ్‌లోనూ ఒకశాతానికి పైగా లాభపడి రూ.579 వద్ద ఆల్‌టైం హై స్థాయిని తాకింది. చివరికి క్రితం ముగింపు(రూ.572)తో పోలిస్తే ఎలాంటి లాభ, నష్టానికి లోనవకుండా రూ.572 వద్ద స్థిరపడింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుల తర్వాత మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు చేరిన మూడో బ్యాంకు, తొలి ప్రభుత్వరంగ బ్యాంకుగా అవతరించింది.
■ ఆటో షేర్లలో భాగంగా మారుతీ సుజుకీ షేరు ట్రేడింగ్‌లో నాలుగు శాతం లాభపడి రూ.9,351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 3% పెరిగి రూ.9,245 వద్ద నిలిచింది.

భారత్ వృద్ధి రేటు 7 శాతానికి పరిమితం: ఫిచ్ అంచనా తగ్గింపు



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ వృద్ధి రేటు ఏప్రిల్‌తో ప్రారంభమైన 2022–23 ఆర్థిక సంవత్సరంలో 7 శాతానికి పరిమితం అవుతుందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ– ఫిచ్ అంచనావేసింది. ఈ మేరకు జూన్‌లో వేసిన తొలి 7.8 శాతం వృద్ధి అంచనాలకు 80 బేసిస్ పాయింట్లు లేదా 0.80 శాతం (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) కోతపెట్టింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్లు తమ తాజా అంచనాలకు కారణంగా చూపింది. 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి అంచనా 7.4 శాతాన్ని తాజాగా 6.7 శాతానికి కుదిస్తున్నట్లు కూడా ఫిచ్ తాజా గ్లోబల్ ఎకనమిక్ అవుట్‌లుక్ పేర్కొంది. కాగా, 2022లో ప్రపంచ వృద్ధి రేటు 2.4 శాతానికి పరిమితం అవుతుందని ఫిచ్ పేర్కొంది. తొలి అంచనాలకన్నా ఇది అరశాతం (0.5 శాతం) తక్కువ.

ఫైనాన్షియల్ రంగంపై నిరంతర అప్రమత్తత: ఎఫ్‌ఎస్‌డీసీ



ముంబై: అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో ఎటువంటి ప్రతికూల పరిస్థితులనైనా నిలువరించడానికి ఫైనాన్షియల్ రంగం, దానికి ఎదురయ్యే ఇబ్బందులపై నిరంతర పర్యవేక్షణ అవసరమని అత్యున్నత స్థాయి ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్‌ఎస్‌డీసీ) సమావేశం ఉద్ఘాటించింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఇక్కడ జరిగిన ఈ సమావేశం, ఎకానమీపై కీలక సమీక్ష జరిపింది. సకాలంలో తగిన చర్యలు తీసుకునేలా వ్యవస్థల సంసిద్ధత అవసరాన్ని స్పష్టం చేసింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రులు, రెగ్యులేటర్ల చీఫ్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

2030 నాటికి 10,000 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు: షెల్ ప్రణాళికలు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ పాయింట్లు నెలకొల్పుతున్న ఐవోసీ, రిలయన్స్–బీపీ తదితర సంస్థల జాబితాలో తాజాగా షెల్ కూడా చేరుతోంది. 2030 నాటికి దేశీయంగా 10,000 పైచిలుకు చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలనే యోచనలో ఉంది. కార్లు, ద్విచక్ర వాహనాల కోసం తమ తొలి ఈవీ చార్జర్లను ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ ఈ విషయాలు వెల్లడించింది. తొలి విడతలో బెంగళూరులోని యశ్వంత్‌పూర్, బ్రూక్‌ఫీల్డ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తమ పెట్రోల్ బంకుల్లో రీచార్జ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల్లోనూ విస్తరించనున్నట్లు సంస్థ పేర్కొంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	49,926	▼	374
బంగారం (99.5 స్వచ్ఛత)	49,726	▼	373
వెండి (కిలో)	56,330	▼	20

రెండంకెల స్థాయి వృద్ధి: మ్యాట్రిక్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి రెండంకెల స్థాయిలో 30 శాతం పైగా ఉండగలదని అంచనా వేస్తున్నట్లు సెక్యూరిటీ, టెలికం సొల్యూషన్స్ సంస్థ మ్యాట్రిక్స్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్) పంకజ్ విజయ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం టర్నోవరు సుమారు రూ. 200 కోట్ల స్థాయిలో నమోదైందని వివరించారు. వృద్ధికి ఐపీ వీడియో సర్వైలెన్స్, యాక్సెస్ కంట్రోల్ తదితర విభాగాలు తోడ్పడగలవని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మ్యాట్రిక్స్ పార్ట్‌నర్ కనెక్ట్ కార్యక్రమంలో తమ ఉత్పత్తులను ప్రదర్శించిన సందర్భంగా పంకజ్ ఈ విషయాలు వివరించారు. ప్రస్తుతం 4 విభాగాల్లో 60 పైగా అధునాతన ఉత్పత్తులు, సొల్యూషన్స్ ఆఫర్ చేస్తున్నామన్నారు. 2,500 పైచిలుకు భాగస్వాములున్నారని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితర దిగ్గజాలు క్లయింట్లుగా ఉన్నారని పంకజ్ చెప్పారు.

పర్యావరణ అనుకూల పరిష్కారాలు కావాలి

- ఇంధన స్వావలంబనకు తోడ్పడాలి
- ఆటో రంగానికి ప్రధాని మోదీ సూచన
- ఆర్థికాభివృద్ధిలో ఆటో రంగం పాత్రకు ప్రశంసలు



న్యూఢిల్లీ: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు, దేశ స్వావలంబనకు ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే వాహన ఆవిష్కరణలపై ఆటోమొబైల్ పరిశ్రమ దృష్టి సారించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) 62వ వార్షిక సదస్సును ఉద్దేశించి ప్రధాని లిఖితపూర్వక సందేశం ఇచ్చారు. దీన్ని సియామ్ ప్రెసిడెంట్ కెనిచి అయుకవ చదివి వినిపించారు. ప్రతి రంగంలోనూ స్వావలంబన సాధించాల్సిన అమృత కాల అవకాశం మన ముందుందని పేర్కొంటూ, అందుకు ఆటోమొబైల్ రంగం కూడా అతీతం కాదన్నారు. ఉపాధి కల్పన, దేశ సమగ్ర ఆర్థికాభివృద్ధిలో ఆటోమొబైల్ పరిశ్రమ కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. ఆటోమొబైల్ రంగానికి భవిష్యత్తు బ్లూప్రింట్‌ను అభివృద్ధి చేసే విషయంలో పరిశ్రమ నిపుణులు, తయారీదారులు, విధానకర్తలు వార్షిక సదస్సులో భాగంగా చర్చలు నిర్వహించాలని సూచించారు. వాహన తయారీలో నాలుగో అతిపెద్ద దేశంగా భారత్ అవతరించడంలో పరిశ్రమ పాత్రను మెచ్చుకున్నారు. కరోనా మహమ్మారి ప్రభావం ఉన్నప్పటికీ, ఆటోమొబైల్ పరిశ్రమ సాధించిన ఈ విజయాలు దేశ ఆర్థిక పునరుజ్జీవానికి తోడ్పడినట్టు చెప్పారు. తయారీదారులను ప్రోత్సహించడం ద్వారా భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. మానవాభివృద్ధిలో రవాణా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దేశ వృద్ధికి నాణ్యమైన, సౌకర్యమైన రవాణా కీలకమన్నారు.

నాణ్యత ముఖ్యం.. ధర కాదు: గడ్కరీ

వాహన తయారీ సంస్థలు నాణ్యతకే ప్రాముఖ్యం ఇవ్వాలి కానీ, ధరకు కాదని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. ఎందుకంటే వాహనదారుల ప్రాధాన్యతలు మారుతున్నట్టు చెప్పారు. ఇటీవలే ప్రముఖ పారిశ్రామికవేత్త సైరస్ మిస్త్రీ రోడ్డు ప్రమాదంలో మరణించడం .. రహదారులు, వాహన భద్రతపై చర్చ నడుస్తున్న నేపథ్యంలో మంత్రి సూచన గమనార్హం.

ప్రపంచంలో టాప్–2లో భారత్: సియామ్

వాహన తయారీలోని ప్రతి విభాగంలోనూ భారత్‌ను ప్రపంచంలోని రెండు అగ్రగామి దేశాల్లో ఒకటిగా వచ్చే 25 ఏళ్లలో చేర్చడమే తమ లక్ష్యమని సియామ్ ప్రకటించింది.

సియామ్ కొత్త ప్రెసిడెంట్‌గా వినోద్ అగర్వాల్



ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) నూతన ప్రెసిడెంట్‌గా 2022–23 సంవత్సరానికి వినోద్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకు మారుతీ సుజుకీ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కెనిచి అయుకవ ఈ బాధ్యతలు నిర్వహించారు. వినోద్ అగర్వాల్ వోల్వో ఐచర్ కమర్షియల్ వెహికల్స్‌కు ఎండీ, సీఈవోగా పనిచేస్తున్నారు. సియామ్ నూతన వైస్ ప్రెసిడెంట్‌గా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ శైలేష్ చంద్ర ఎన్నికయ్యారు. డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ సీఈవో, ఎండీ సత్యకమ్ ఆర్యను ట్రెజరర్‌గా సియామ్ ఎన్నుకుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-9-2022	
విశాఖ	450–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440–00
విజయవాడ	440–00
రిటైల్ ధర (డజను)	66.00
15-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

రోజర్ ఫెడరర్ వీడ్కోలు



'శాఫ్' ఫుట్‌బాల్ చాంప్ భారత్

న్యూఢిల్లీ: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–17 సాకర్ చాంపియన్‌షిప్‌లో భారత అబ్బాయిలు టైటిల్ నిలబెట్టుకున్నారు. కొలంబోలో గురువారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 4–0తో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. బాబి సింగ్ (18వ ని.), కొరవ్ సింగ్ (30వ ని.), కెప్టెన్ వాన్లల్‌పెక గీటే (63వ ని.), అమన్ (90+4వ ని.) తలా ఒక గోల్ చేసి భారత్‌ను విజేతగా నిలిపారు. లీగ్ దశలో నేపాల్ చేతిలో 1–3తో ఎదురైన పరాజయానికి ఫైనల్లో అసాధారణ ప్రదర్శనతో ప్రతీకారం తీర్చుకున్నారు.

విహారి అజేయ శతకం

సేలం (తమిళనాడు): దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్ కెప్టెన్ హనుమ విహారి (107 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్), ఓపెనర్ రోహన్ కునుమల్ (143; 16 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో కదంతొక్కారు. నార్త్‌జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో సౌత్‌జోన్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. మొదటిరోజు ఆటముగిసే సమయానికి సౌత్ జట్టు 90 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. విహారితో పాటు బాబా ఇంద్రజిత్ (20 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కోయంబత్తూర్‌లో సెంట్రల్‌జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్ట్‌జోన్ 82 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. పృథ్వీషా (60; 10 ఫోర్లు), రాహుల్ త్రిపాఠి (64 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సెంట్రల్‌జోన్ బౌలర్ కుమార్ కార్తికేయ 5 వికెట్లు తీశాడు.

నేటినుంచి డేవిస్ పోరు



లిలెహమర్ (నార్వే): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 టెన్నిస్ టోర్నీలో భాగంగా భారత జట్టు... ఆతిథ్య నార్వేతో తలపడుతుంది. రెండు రోజుల ఈ పోరులో శుక్రవారం జరిగే సింగిల్స్ పోటీల్లో భారత ఆటగాళ్లకు గట్టి ప్రత్యర్థులే ఎదురవుతున్నారు. తాజా యూఎస్ ఓపెన్ రన్నరప్, నార్వే నంబర్‌వన్ ఆటగాడు కాస్పర్ రూడ్‌తో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తలపడనుండగా, విక్టర్ డ్యురసొవిచ్‌తో రామ్‌కుమార్ రామనాథన్ ఢీకొట్టనున్నాడు. శనివారం జరిగే డబుల్స్ కోసం హైదరాబాద్ ఆటగాడు సాకేత్ మైనేని... యూకీ బాంబ్రీతో జతకట్టాడు. ఈ జోడీ... రూడ్–విక్టర్ జంటతో పోటీపడుతుంది. అనంతరం రెండు రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ

బెంగళూరు: న్యూజిలాండ్ 'ఎ'తో జరుగుతున్న ఆఖరి అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' టాపార్డర్ బ్యాట్స్‌మన్ రుతురాజ్ గైక్వాడ్ (127 బంతుల్లో 108; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కాడు. దీంతో తొలిరోజు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 'ఎ' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 86.4 ఓవర్లలో 293 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉపేంద్ర యాదవ్ (76; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, కివీస్ బౌలర్లలో ఫిషర్ 4 వికెట్లు పడగొట్టాడు.

టెన్నిస్‌ను ఎంత అందంగా ఆడవచ్చో అతను చూపించాడు... బేస్‌లైన్‌నుంచి ఆడినా, నెట్‌పైకి దూసుకొచ్చినా అతని ఆటలో కళాత్మకత కనిపించింది...అతని ఫోర్‌హ్యాండ్ ఘనత గురించి చెప్పాలంటే అది 'టెన్నిస్‌లోనే గొప్ప షాట్'...స్మాష్, స్కై హుక్, హాఫ్ వాలీ, స్లామ్ డంక్...పేరు ఏదైనా అతను ఏ షాట్ కొడితే దానికి ప్రపంచం జేజేలు పలికింది...అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో పాదరసంలా జారుతూ మైదానమంతా చుట్టేసి అతను ప్రత్యర్థుల పని పట్టినప్పుడు చప్పట్లతో తమ సంతోషాన్ని ప్రకటించింది... సుదీర్ఘ కెరీర్‌లో ఘనమైన రికార్డులెన్నో సాధించినా ఏనాడూ వివాదం దరి చేరనివ్వని అసలైన జెంటిల్‌మన్ అతను...ఒక్క మాటలో చెప్పాలంటే టెన్నిస్‌లో రాముడు మంచి బాలుడు ఎవరంటే మరో మాటకు తావు లేకుండా అందరూ అతని పేరే చెబుతారు. అందుకే అతను గెలిచిననాడు వహ్వా అని సంబరాన్ని ప్రదర్శించిన ఫ్యాన్స్...అతను ఓడి అందరి ముందు చిన్నపిల్లాడిగా ఏడ్చి కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు తమకే ఏదో జరిగినంతగా బాధపడ్డారు... రెండు దశాబ్దాలకు పైగా ఆటపై చెరగని ముద్ర వేసిన ఆ దిగ్గజం పేరు రోజర్ ఫెడరర్. చరిత్రలో నిలిచిపోయే విజయాలను తన బయోడేటాగా మార్చుకున్న ఈ స్విస్ స్టార్ ఆటకు వీడ్కోలు పలికాడు...చిరస్మరణీయ జ్ఞాపకాలను అభిమానులకు పంచి నిష్క్రమించాడు.


- టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన స్విస్ స్టార్
- వచ్చే వారం చివరి సారి బరిలోకి
- 20 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన దిగ్గజం

బాసెల్: ప్రపంచ టెన్నిస్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ముగిసింది. తన ఆటతో అభిమానులను అలరించి, ఆటను శాసించిన దిగ్గజ ప్లేయర్ రోజర్ ఫెడరర్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నెల 23నుంచి 25 వరకు లండన్‌లో జరిగే లేవర్ కప్‌లో తాను చివరిసారిగా బరిలోకి దిగుతానని, ఆపై ప్రొఫెషనల్ టెన్నిస్‌నుంచి పూర్తిగా తప్పుకుంటానని అతను వెల్లడించాడు. వరుస గాయాలు, ఆపై శస్త్రచికిత్సలతో చాలా కాలంగా కోర్టుకు దూరంగా ఉంటూ వచ్చిన ఫెడరర్ ఎప్పుడైనా తప్పుకోవచ్చనే సంకేతాలు వినిపించాయి. అయితే గత జూలైలో వింబుల్డన్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి హాజరై ఇక్కడ మరోసారి ఆడాలని ఉందని చెప్పినప్పుడు మళ్లీ బరిలోకి దిగవచ్చని అనిపించింది. కానీ ఆ ఆలోచనను పక్కన పెడుతూ 41 ఏళ్ల రోజర్ తన వీడ్కోలు వివరాలను సోషల్ మీడియా ద్వారా ధ్రువీకరించాడు. 1998లో ప్రొఫెషనల్‌గా మారిన ఈ స్విట్జర్లాండ్ స్టార్ 2021 జూలైలో చివరిసారిగా మ్యాచ్ ఆడాడు. వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్లో హ్యూబర్ట్ హర్కాజ్ (పోలండ్) చేతిలో 3–6, 6–7 (4/7), 0–6 తేడాతో ఓడిపోయాక మళ్లీ రాకెట్ పట్టుకోలేదు. 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన ఫెడరర్ కొన్నాళ్ల క్రితం వరకు అత్యధిక స్లామ్‌లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇప్పుడు అతడిని నాదల్ (22), జొకోవిచ్ (21) అధిగమించారు.

> 'గత మూడేళ్లుగా గాయాలు, శస్త్రచికిత్సలు నన్ను బాగా ఇబ్బంది పెట్టాయి. నేను పునరాగమనం చేసేందుకు చాలా ప్రయత్నించాను. కానీ శరీరం సహకరించడం లేదని నాకు అర్థమైంది. గత 24 ఏళ్లలో 40 దేశాల్లో 1500కు పైగా మ్యాచ్‌లు ఆడాను. టెన్నిస్ నేను ఊహించినదానికంటే ఎక్కువ స్థాయిలో గొప్ప జ్ఞాపకాలు అందించింది. లేవర్ కప్ తర్వాత ప్రొఫెషనల్‌గా కాకుండా ఆసక్తి కొద్దీ ఎప్పుడైనా టెన్నిస్ ఆడుతూనే ఉంటా. ఇది చాలా బాధాకరమైన నిర్ణయమే అయినా నేను సాధించినవాటితో చూస్తే ఎంతో ఆనందం కలుగుతుంది. దేవుడు నాకు టెన్నిస్ బాగా ఆడే ప్రత్యేక ప్రతిభను ఇచ్చాడు. అందులో నేను ఊహించని ఎత్తులకు వెళ్లగలిగాను. ఎంతో మంది గొప్ప ఆటగాళ్లతో పోటీ పడగలగడం నా అదృష్టం. నా ఈ ప్రయాణంలో అండగా నిలిచిన తల్లిదండ్రులు, భార్య, కోచ్‌లు, అభిమానులకు కృతజ్ఞతలు. 24 ఏళ్లు 24 గంటల్లా గడిచినట్లు అనిపిస్తున్నాయి. ఆటగాడిగా విజయాలు ఆస్వాదించాను. నవ్వాను, ఏడ్చాను, బాధను భరించాను, భావోద్వేగాలు ప్రదర్శించాను. నా సొంత నగరం బాసెల్‌లో బాల్‌బాయ్‌గా ఉన్నప్పుడు కన్న కలలు నేను పడిన శ్రమతో నిజమయ్యాయి. టెన్నిస్‌ను నేను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటా'
> – ఫెడరర్



- ➡ కెరీర్‌లో గెలిచిన మొత్తం టైటిల్స్ - 103
- ➡ గెలుపు-ఓటములు - 1251-275
- ➡ కెరీర్ ప్రైజ్‌మనీ - 13 కోట్ల డాలర్లు (సుమారు రూ.1042 కోట్లు)
- ➡ తొలిసారి వరల్డ్ నంబర్‌వన్ - 02/02/2004
- ➡ ఒలింపిక్ పతకాలు (2) - 2008 బీజింగ్‌లో డబుల్స్ స్వర్ణం, 2012 లండన్‌లో సింగిల్స్ కాంస్యం
- ➡ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ - మొత్తం 310 వారాలు (ఇందులో వరుసగా 237 వారాలు)
- ➡ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ విజయాల సంఖ్య - 369
- ➡ కెరీర్‌లో కొట్టిన ఏస్‌లు - 11,478



కెరీర్ స్లామ్ పూర్తి

ఆల్‌టైమ్ గ్రేట్‌గా అన్ని రకాల కోర్టుల్లో సత్తా చాటినా...ఫెడరర్ కెరీర్‌లో ఫ్రెంచ్ ఓపెన్ ఎప్పుడూ సవాల్‌గానే కనిపించింది. అప్పటికే 13 గ్రాండ్‌స్లామ్‌లు సాధించి ఫ్రెంచ్ ఓపెన్‌లోకి ఫెడరర్ అడుగు పెట్టాడు. మరో టైటిల్ గెలిస్తే ఆ సమయంలో అగ్రస్థానంలో ఉన్న పీట్ సంప్రాస్ (14) రికార్డును సమం చేస్తాడు. అయితే ఎర్రమట్టిపై వరుసగా నాలుగేళ్లు టైటిల్ సాధించిన నాదల్ జోరు కొనసాగుతోంది. ఈ దశలో ఫెడరర్‌కు మళ్లీ కష్టమే అనిపించింది. అయితే క్వార్టర్ ఫైనల్లో సొదర్లింగ్ చేతిలో నాదల్ అనూహ్యంగా ఓడటంతో రోజర్‌కు దారులు తెరుచుకున్నాయి. ఈ అవకాశాన్ని వృథా చేయని అతను ఫైనల్లో సొదర్లింగ్‌నే ఓడించి తొలిసారి (ఏకైక) ఫ్రెంచ్ ఓపెన్ సాధించాడు. తన 'కెరీర్ స్లామ్'ను పూర్తి చేసుకోవడంతో పాటు సంప్రాస్‌తో సమంగా నిలిచాడు.

'గ్రాండ్' ఫెడెక్స్

ఆస్ట్రేలియా ఓపెన్ (6) – 2004, 2006, 2007, 2010, 2017, 2018
ఫ్రెంచ్ ఓపెన్ (1) – 2009
వింబుల్డన్ (8) – 2003, 2004, 2005, 2006, 2007, 2009, 2012, 2017
యూఎస్ ఓపెన్ (5) – 2004, 2005, 2006, 2007, 2008

తన కెరీర్ మొత్తంలో 1526 సింగిల్స్, 223 డబుల్స్ మ్యాచ్‌లు ఆడిన ఫెడరర్ ఒక్కసారి కూడా మ్యాచ్ మధ్యలో రిటైర్ కాలేదు.

కవలల జోడి...

ఫెడరర్ పక్కా 'ఫ్యామిలీ మ్యాన్'. తన విజయాల ఘనతల్లో భార్య మిరొస్లావా (మిర్కా)కు ప్రధాన పాత్ర ఉందని తరచూ చెబుతుంటాడు. వీరికి నలుగురు పిల్లలు. వీరికి 13 ఏళ్ల కవల అమ్మాయిలు, 8 ఏళ్ల కవల అబ్బాయిలు ఉన్నారు.



తొలి గ్రాండ్‌స్లామ్ (2003)



చివరి గ్రాండ్‌స్లామ్ (2018)



భార్య మిర్కాతో

క్లుప్తంగా

'మహేంద్రతనయ' ఆమోదంపై సీఎంకు కృతజ్ఞతలు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజలు

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా టెక్కలి డివిజన్‌కు జీవనాడి అయిన మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ పునఃనిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ పరిపాలన ఆమోదం తెలపడంపై జిల్లా వాసులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పలాస–కాశీబుగ్గ మునిసిపాలిటీలోని వైఎస్సార్ విగ్రహానికి, ప్రాజెక్టు నిర్మాణాన్ని అప్పట్లో ప్రతిపాదించిన హనుమంతు అప్పయ్య దొర విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

బీసీ బిల్లుకు బీజేపీ మద్దతివ్వాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

పటమట (విజయవాడ తూర్పు): బీసీ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు తెలపాలని బీజేపీని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిందని.. చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో కూడా తమకు జనాభా ప్రాతిపదికన ప్రాధాన్యం కల్పిస్తోందని చెప్పారు. గురువారం విజయవాడలో ఆయన 25 కుల సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న కేంద్రంపై ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. దీనిపై జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని ప్రకటించారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్, నాయకులు పాల్గొన్నారు.

ఏపీలో బలహీన ప్రతిపక్షం

బీజేపీ ఎంపీ జీవీఎల్



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ప్రతిపక్షం బలహీనంగా ఉందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలపై ప్రధాన ప్రతిపక్షం పోరాటం చేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి నిజమైన ప్రతిపక్షంగా బీజేపీ నిలబడి.. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతోందన్నారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో శనివారం నుంచి అక్టోబర్ 2 వరకు ప్రజా పోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 5 వేల సభలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఒకటే రాజధాని ఉండాలన్నది బీజేపీ విధానమన్నారు. బీజేపీ నేతలపై కేసులున్నా.. దర్యాప్తు సంస్థలు తమ పని తాము చేసుకుపోతాయంటూ.. కొత్తపల్లి గీత కేసును ప్రస్తావించారు.

బాతుపిల్ల కందకుండా!

అచ్చం బాతు పిల్లను పోలిన ఈ గడ్డ చిత్తూరు జిల్లా వి.కోటలోని ఓ కూరగాయల దుకాణంలో కనిపించింది. గురువారం ఉదయం విక్రయాల సమయంలో యజమాని దీనిని గుర్తించి..కంద గడ్డగా నిర్ధారించారు. గడ్డకు మొలకరావడంతో ఇది పక్షి ముక్కును తలపించింది. అచ్చం బాతు పిల్లలా ఉండటంతో ఈ కంద గడ్డను స్థానికులు ఆసక్తిగా చూశారు. - వి.కోట



ఐడియా.. అదిరిందయా!

సెల్ చార్జింగ్ కోసం వినూత్న ఆలోచన

సెల్‌ఫోన్ చార్జింగ్ కోసం ఓ గొర్రెల కాపరి వినూత్నంగా ఆలోచించాడు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్‌కు చెందిన హుస్సేనప్ప తన గొర్రెలను మేత కోసం నల్లమల అటవీప్రాంతానికి తీసుకెళ్తుంటాడు. అయితే అడవిలో విద్యుత్ సౌకర్యం ఉండదు కాబట్టి సెల్‌ఫోన్ చార్జింగ్ సమస్యగా మారింది. దీనికితోడు రాత్రిపూట గొర్రెల మందకు లైటింగ్ కూడా ఉండటం లేదు. దీనిపై ఆలోచించిన హుస్సేనప్ప పరిష్కారమార్గం కనుగొన్నాడు. ఓ సోలార్ ప్లేటు, బ్యాటరీని కొనుగోలు చేసి, గొర్రెల మంద వెంట బియ్యం, ఇతర వంట సామగ్రి తీసుకెళ్లే గాడిదపై ఏర్పాటు చేశాడు. దీనిద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌తో సెల్‌ఫోన్ చార్జింగ్‌తో పాటు మందకు లైటింగ్ ఏర్పాటు చేశాడు. హుస్సేనప్ప గురువారం మందతో పాటు జడ్చర్ల మీదుగా వెళుతుండగా.. గాడిదపైనున్న సోలార్‌ప్లేట్లు ఆకర్షించాయి. - జడ్చర్ల



కృష్ణాలో పెరుగుతున్న వరద..

- ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.74 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- ధవళేశ్వరం నుంచి 13.11 లక్షల క్యూసెక్కుల గోదావరి నీరు కడలిలోకి
- భద్రాచలం వద్ద 42.5 అడుగులకు తగ్గిన నీటిమట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

సాక్షి, అమరావతి/శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురి సౌత్/సత్రశాల(రెంటచింతల)/ధవళేశ్వరం/చింతూరు/పోలవరం రూరల్: పరివాహక ప్రాంతం (బేసిన్)లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిలో వరద ప్రవాహం మరింత పెరగ్గా.. బేసిన్‌లో వర్షాలు తగ్గడంతో గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గుతోంది. జూరాల, సుంకేశుల బ్యారేజ్‌ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రం 6 గంటలకు 3,54,343 క్యూసెక్కులు చేరుతున్నాయి. ప్రాజెక్టులో 884.8 అడుగుల్లో



సాగర్‌లో 18 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

214.36 టీఎంసీలను స్థిరంగా నిల్వ చేస్తూ.. స్పిల్‌వే పదిగేట్లను 12 అడుగులు ఎత్తి 3,19,350, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,348.. కలిపి 3,81,698 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 3,40,387 క్యూసెక్కులు చేరుతున్నాయి. జలాశయంలో 589 అడుగుల్లో 309.05 టీఎంసీలను నిల్వచేస్తూ స్పిల్‌వే 18 గేట్లు ఎత్తి, విద్యుత్ కేంద్రం ద్వారా మొత్తం 3,00,774 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులోకి 2,56,309 క్యూసెక్కులు చేరుతోంది. 169.72 అడుగుల్లో 37.95 టీఎంసీల నీటిని నిల్వచేస్తూ స్పిల్‌వే గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా 2,62,583 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 2,86,684 క్యూసెక్కులు చేరుతుండగా.. 2,74,150 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. శుక్రవారం కూడా కృష్ణాలో ఇదేరీతిలో వరద కొనసాగనుంది.

ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

గోదావరిలో పోలవరం ప్రాజెక్టు నుంచి ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 13,20,635 క్యూసెక్కుల వరద చేరుతోంది. గురువారం రాత్రి 7 గంటలకు నీటిమట్టం 13.90 అడుగులకు చేరింది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. 13,11,835 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. భద్రాచలంలో నీటిమట్టం 42.50 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం గురువారం సాయంత్రానికి 33.510 మీటర్లకు చేరింది.

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఎన్‌టీఎస్‌ఈ ఆన్‌లైన్ క్లాసులు

వీడియో క్లాసులు, మాక్‌టెస్టులు, సబ్జెక్ట్ నిపుణుల గైడెన్స్

పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గొప్ప వరం ఎన్‌టీఎస్‌ఈ (NTSE) పరీక్ష. జాతీయ విద్యా, పరిశోధన, శిక్షణ మండలి (NCERT) ఆధ్వర్యంలో జరిగే పరీక్ష ఇది! ఇంజనీరింగ్, మెడిసిన్, లా, మేనేజ్‌మెంట్, సోషల్ సైన్సెస్, బేసిక్ సైన్సెస్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రోత్సహించి..ఆర్థిక తోడ్పాటునందించే స్కాలర్‌షిప్‌ను అందించేందుకు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పరీక్ష ఇది. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రెండు దశలుగా ఎన్‌టీఎస్‌ఈ (స్టేజ్ 1, స్టేజ్ 2) పరీక్ష నిర్వహించి..ఏటా రెండు వేల మందిని స్కాలర్‌షిప్స్‌కు ఎంపిక చేస్తారు! ఈ నేపథ్యంలో సాక్షి మీడియా, మై ర్యాంక్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (My Rank Education Private Ltd.) సంయుక్తంగా ఎన్‌టీఎస్‌ఈ(NTSE) పరీక్షకు ఆన్‌లైన్ క్లాసులను నిర్వహిస్తున్నాయి. http://www.sakshieducation.com లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా..వీడియో క్లాసులు, మాక్‌టెస్టులు, సబ్జెక్ట్ నిపుణుల గైడెన్స్ మొదలైనవి విద్యార్థులు పొందవచ్చు. http://www.sakshieducation.com కు వెళ్లి హోమ్ పేజీలో NTSE online classesను క్లిక్ చేసి రిజిస్టర్ చేసుకోండి. పూర్తి వివరాలకు 9505514424, 9666013544, 9912671555,9666697219 ఫోన్ నంబర్లను సంప్రదించండి. ఈ ఆన్‌లైన్ కోచింగ్ వ్యాలిడిటీ ఒక సంవత్సరం వరకు ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,599 మాత్రమే. ఈ పరీక్ష నవంబర్/ డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాగులో మార్పులు తేవాలి

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్



సాక్షి, బాపట్ల : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి, రైతుల సమస్యల పరిష్కారానికి ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం కృషిచేయాలని రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్స్‌లర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 54వ స్నాతకోత్సవం గురువారం నిర్వహించారు. వర్చువల్‌గా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక యూనివర్సిటీ శ్రీకారం చుట్టిందని, డ్రోన్‌ల వినియోగ పరిశోధనలో దేశంలోనే యూనివర్సిటీ ముందుండటం గర్వకారణమన్నారు.

తలసరి ఆదాయంలో ఏపీ అగ్రగామి : ప్రొఫెసర్ రమేష్ చంద్

ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ రమేష్ చంద్ మాట్లాడుతూ రాష్ట్ర తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్‌లో 38.6 శాతం అధికంగా నమోదైందని, ఇది రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సూచికని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 2,07,771 కాగా, దేశ తలసరి ఆదాయం రూ.1,49,848 మాత్రమే అని తెలిపారు. 2011 నుంచి 2021 వరకు జాతీయ స్థూల ఉత్పత్తి పెరుగుదల 5.48 శాతం కాగా, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల 7.08 శాతం ఉందన్నారు. కేవలం వ్యవసాయ అనుబంధ రంగాలు 8 శాతం వృద్ధి నమోదు చేశాయని, ఇది భారతదేశ వృద్ధికి రెండు రెట్లు అధికంగా ఉందని వివరించారు. దేశ వృద్ధి రేటు 3.28 మాత్రమేనని వివరించారు. యూనివర్సిటీ వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంపై నివేదిక సమర్పించారు. గిరిజన వ్యవసాయ విధానాలపై అత్యుత్తమ పరిశోధనలు చేసిన విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు యూనివర్సిటీ పురస్కారం ప్రదానం చేసినట్లు తెలిపారు. 722 మందికి డిగ్రీ, 102 మందికి పీజీ, 40 మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు.

టీటీడీ ఈవో పోస్టుకు ధర్మారెడ్డి అర్హుడే

- ఇన్‌చార్జి ఈవోగా ఆయన నియామకం సబబే
- పిటిషన్‌ను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి : డిప్యుటేషన్‌పై టీటీడీ అదనపు ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏవీ ధర్మారెడ్డికి ఇన్‌చార్జ్ ఈవోగా బాధ్యతలు అప్పగించడంపై దాఖలైన కోవారెంటో పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈవోగా నియామకానికి ధర్మారెడ్డి అర్హుడేనని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్(ఐడీఈఎస్)లో ధర్మారెడ్డి జాయింట్ సెక్రటరీగా పనిచేశారని, అది రాష్ట్ర సర్వీసులో కార్యదర్శి స్థాయి పోస్టు అని, ఇదే సమయంలో కలెక్టర్ పోస్టు కన్నా పెద్ద పోస్టు అని.. కలెక్టర్ కన్నా ఎక్కువ హోదా కలిగిన పోస్టులో నియమితులయ్యేందుకు అర్హతలున్న వ్యక్తి టీటీడీ ఈవోగా నియమితులు కావొచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. దీని ప్రకారం ధర్మారెడ్డిని పూర్తిస్థాయి ఈవోగా టీటీడీ నియమించడంలో ఎలాంటి తప్పులేదంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం తీర్పు వెలువరించారు. ఐడీఈఎస్ అధికారి అయిన ధర్మారెడ్డికి ఐఏఎస్ అధికారి నిర్వర్తించే టీటీడీ ఈవో బాధ్యతలు అప్పగించడం చట్ట విరుద్ధమంటూ తిరుపతికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో కోవారెంటో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ గురువారం తీర్పు వెలువరించారు. అందులో ఈవో నియామకానికి సంబంధించిన చట్ట నిబంధనలపై సవివరంగా చర్చించారు. దేవదాయ చట్టంలోని సెక్షన్–107 కింద అఖిల భారత సర్వీసులతో పాటు కేంద్ర, రాష్ట్ర సర్వీసులకు చెందిన ఏ అధికారినైనా ఈవోగా నియమించవచ్చని, అయితే, ఆ అధికారం కలెక్టర్ కన్నా ఎక్కువ హోదా ఉంటే సరిపోతుందన్న ధర్మారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది సర్వ సత్యనారాయణప్రసాద్ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. ధర్మారెడ్డి గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో కార్యదర్శి హోదాలో పనిచేశారని న్యాయమూర్తి తన తీర్పులో గుర్తుచేశారు. నవీన్‌కుమార్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టేశారు.

అక్టోబర్ 14 నుంచి విజయవాడలో సీపీఐ జాతీయ మహాసభలు

- సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వెల్లడి
- పలు రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం



సాక్షి, న్యూఢిల్లీ: సీపీఐ 24వ జాతీయ మహాసభలు అక్టోబర్ 14 నుంచి 18 వరకు విజయవాడలో నిర్వహించనున్నామని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఈ మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి సీపీఐ నాయకులు పాల్గొంటారని, 20 దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్ట్ పార్టీల నాయకులు సౌహార్ద ప్రతినిధులుగా హాజరవుతారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం గురువారం ఢిల్లీ ఏపీ భవన్‌లో రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. జాతీయ మహాసభ అజెండాపై జాతీయ కార్యవర్గ సమావేశాల్లో చర్చించామన్నారు. జాతీయ మహాసభల్లో భాగంగా అక్టోబర్ 14వ తేదీ భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయన్నారు. 15న సభకు సీపీఐ నేతలతో పాటు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ఎంఎల్, ఫార్వార్డ్ బ్లాక్ నాయకులు హాజరవుతారని చెప్పారు. 16, 17 తేదీల్లో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అంశాలపై సెమినార్ జరుగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సెక్యులర్ పార్టీలు, ప్రజాతంత్ర పార్టీల ముఖ్యమంత్రులు సెమినార్‌కు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను ఆహ్వానిస్తామన్నారు. దేశ తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో రాజకీయాలు ప్రమాదకరంగా తయారయ్యాయని, దేశంలో లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. అమరావతి రాజధానిగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, పాదయాత్ర చేస్తున్న వాళ్లకు సీపీఐ నాయకులు అండగా ఉంటారని తెలిపారు.

ఆ స్థలాల్లో ఆక్రమణలు తొలగించండి

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేయాలని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం తీర్పు వెలువరించింది. పార్కులు, రోడ్లు తదితర ప్రజోపయోగ స్థలాల ఆక్రమణలపై హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై గురువారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పంచాయతీ, పురపాలక, అటవీ, రెవెన్యూ భూములను ఆక్రమించుకున్న వారిని ఆ భూముల నుంచి ఖాళీచేయించాలంటూ బుధవారం ఇచ్చిన ఆదేశాలను ఈ వ్యాజ్యాలకు కూడా వర్తింపజేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ సమయంలో ప్రభుత్వ న్యాయవాది (రెవెన్యూ) పోతిరెడ్డి సుభాష్‌రెడ్డి స్పందిస్తూ.. నాలాలు, కాలువలు పెద్ద సంఖ్యలో ఆక్రమణలకు గురై ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. వర్షాకాలంలో మనకు బెంగళూరు, హైదరాబాద్ వంటి పరిస్థితి రాకూడదంటే నాలాలు, కాలువలను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలన్నింటినీ తొలగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆక్రమణల తొలగింపు ఉత్తర్వుల్లో నాలాలు, కాలువలను కూడా చేరుస్తామని ధర్మాసనం తెలిపింది. వీటి తొలగింపు విషయంలో పంచాయతీ, పురపాలక శాఖ అధికారులకు రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తారని సుభాష్ చెప్పారు. ఈ వివరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

ఇంజనీర్లు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఏపీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి



మాట్లాడుతున్న జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

సాక్షి, విశాఖపట్నం/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఇంజనీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలందించాలని ఏపీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి సందర్భంగా ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ దేశానికి గొప్ప సేవలందించిన మోక్షగుండం విశ్వేశ్వరాయ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశ్వేశ్వరాయ చిత్రపటానికి జస్టిస్ నాగార్జునరెడ్డి, ఏపీ ఈఆర్సీ సెక్రటరీ కె.రాజబాపయ్య, ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, ఈపీడీసీఎల్ డైరెక్టర్లు నివాళులర్పించారు. హెచ్ఆర్‌డీ సీజీఎం ఏవీవీ సూర్యప్రతాప్ అధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సీజీఎంలు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

దేశాభివృద్ధిలో ఇంజనీర్లది కీలకపాత్ర అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్ అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి టి.కృష్ణబాబు అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) ఆధ్వర్యంలో విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఇంజనీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణబాబు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య ఇంజనీరుగానే కాకుండా సమాజసేవలో కూడా విశేష కృషి చేశారని కొనియాడారు. ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు విభాగాల్లో సేవలు అందిస్తున్న ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ ఈఎన్‌సీ ఆర్.సతీష్‌కుమార్, ఆర్ అండ్ బీ (అడ్మిన్) ఈఎన్‌సీ కె.వేణుగోపాలరెడ్డి, ఆర్‌అండ్ బీ (ఎండీఆర్) ఈఎన్‌సీ కె.నయీముల్లా, బీఏఐ కో–ఆపరేటివ్ అఫైర్స్ కమిటీ చైర్మన్ బి.శీనయ్య, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరావు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సీహెచ్.రామకోటయ్య, కార్యదర్శి పి.శేషగిరిరావు, కో–చైర్మన్లు వి.వెంకటేశ్వరరావు, అత్తలూరి నాగమల్లేశ్వరరావు, ఆర్.ప్రతాప్‌రెడ్డి, కె.వెంకట నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పాదక విద్యుత్ పెంపుపై దృష్టి

- రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్
- ఎన్టీటీపీఎస్‌లో మోక్షగుండం విశ్వేశ్వరాయ విగ్రహావిష్కరణ



మోక్షగుండం విశ్వేశ్వరాయ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వినియోగదారులకు భవిష్యత్‌లోనూ నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరాయ విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా గురువారం డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లో విజయానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని సహజ వనరులను ఉపయోగించుకుని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వినియోగదారులకు విద్యుత్‌ను అందుబాటు ధరల్లో అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన పునరుత్పాదక ఇంధన పాలసీ 2020లో భాగంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు చర్యలతో పాటు పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉత్పత్తి సాధించి, ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేయగలుగుతామని పేర్కొన్నారు. ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె. పద్మజనార్దన రెడ్డి, ఏపీఎస్ఈబీ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు జీబీ శ్రీనివాసరావు, విద్యుత్ పంపిణీ సంస్థల ఇంజనీర్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా సంఘాలకు 'శాప్' గుర్తింపు తప్పనిసరి

సాక్షి, అమరావతి : రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్‌కు తమ నుంచి ఎలాంటి గుర్తింపులేదని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. నిధులు, ఆటస్థలాలు, ప్రోత్సాహకాలు కేటాయించాలంటే క్రీడా సంఘాలకు శాప్ గుర్తింపు తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ స్పష్టంచేసింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కళాకారుల మృతి



మృతి చెందిన సూరిశెట్టి దుర్గ, ఆడారి బుల్లియ్య, బీశెట్టి వీరబాబు

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం వెలంపేట వద్ద రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కళాకారులు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ ఎ.బాలాజీ కథనం మేరకు..తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నానికి చెందిన 11 మంది కళాకారులు వినాయకుడి ఊరేగింపులో అఘోరా కళను ప్రదర్శించేందుకు ఈ నెల 14న విశాఖ జిల్లా మల్కాపురం వెళ్లారు. ప్రదర్శన ముగిసిన తర్వాత స్వగ్రామానికి బొలెరో వ్యాన్‌లో అర్ధరాత్రి బయలుదేరారు. అదే మార్గంలో విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీని వ్యాన్ ఢీకొంది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో సూరిశెట్టి దుర్గారావు (36) అక్కడికక్కడే మృతి చెందగా మరో పది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108, హైవే అంబులెన్స్‌ల్లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మార్గం మధ్యలో ఆడారి బుల్లియ్య (బుల్లిరాజు) (35), చికిత్స పొందుతూ బీశెట్టి వీరబాబు (45) మృతి చెందారు. పరిస్థితి విషమంగా ఉన్న 8 మందిని కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రులకు తరలించారు.

తాడిపత్రిలో పెన్నా నదిని కాపాడండి

అనంతపురం కలెక్టర్‌కు లోకాయుక్త నోటీసులు

కర్నూలు(సెంట్రల్): అనంతపురం జిల్లా తాడిపత్రిలో పెన్నానది పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించుకుని భవనాలు నిర్మించడంపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తంచేసింది. నది తన స్వరూపం కోల్పోయే ప్రమాదం నెలకొన్నా, అధికారులు ఏమి చేస్తున్నారని లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి ప్రశ్నించారు. తాడిపత్రిలో పెన్నానది ఆక్రమణలకు గురై కుంచించుకుపోతోందని పత్రికల్లో కథనాలు రావడంతో లోకాయుక్త స్పందించింది. సుమోటోగా కేసును స్వీకరించింది. పెన్నా పరివాహంలో నిర్మించిన అధికార, అనధికార భవనాలు గుర్తించాలని, వాటిని తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మూడు నెలల్లో నివేదిక అందించాలని అనంతపురం కలెక్టర్‌కు లోకాయుక్త చైర్మన్ నోటీసులు జారీ చేశారు. పెన్నా నదిని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ నేతృత్వంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ, ఇరిగేషన్ సీఈ, డీపీవో, అనంతపురం ఆర్‌డీఓ, తాడిపత్రి డీఎస్పీ, విజయవాడలోని ఏపీ టూరిజం శాఖ సీఈవో తమ శాఖల తరఫున నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు.



లోకాయుక్త కార్యాలయం (ఇన్‌సెట్‌లో) జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.